మంగళవారం
29-7-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 308
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఆపరేషన్ సిందూర్‌పై
మోదీ సర్కారు నిలదీత

- నిజాలు చెప్పాలని ఇండియా ఎంపీల డిమాండ్
- లోక్‌సభలో వాడివేడి చర్చ
- ప్రతిపక్ష సభ్యుల ప్రశ్నల వర్షం
- సమర్థించుకునే పనిలోనే ప్రభుత్వం

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై పార్లమెంటులో వాడివేడి చర్చ జరిగింది. మోదీ సర్కారును విపక్ష ఎంపీలు తూర్పారబట్టారు. ఇంటెలిజెన్స్ వ్యవస్థ పూర్తిగా విఫలమైందని, ఈ దాడికి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పూర్తి బాధ్యత వహించాలని విపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. అదేసమయంలో భారత్, పాక్ ఘర్షణలు తానే ఆపానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే చెబుతున్నా... మోదీ సర్కారు ఎందుకు మౌనంగా ఉందని నిలదీశారు. నిజాలు చెప్పాలని ప్రతిపక్ష ఇండియా ఐక్య సంఘటన డిమాండ్ చేసింది. అవాస్తవాల వ్యాప్తి క్రమంలో అనేక సందేహాలు వ్యక్తమయ్యాయని, వీటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని నొక్కిచెప్పింది. కాల్పుల విరమణ అర్థాంతరంగా జరగడం, తన వల్లే సాధ్యమైందని అమెరికా అధ్యక్షుడు పదేపదే చెప్పడంపై వివరణ కోరింది. ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చర్చ ప్రారంభించారు. కాంగ్రెస్ నేత గౌరవ్ గొగోయ్ కేంద్రాన్ని ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేశారు. రాజ్‌నాథ్‌తో వాదనకు దిగారు. ఆపరేషన్ సిందూర్‌లో భారత్ ఎన్ని యుద్ధ విమానాలు కోల్పోయిందో చెప్పాలన్నారు. దేశంలో 35 రఫేల్ యుద్ధ విమానాలు ఉన్నాయి, వాటిలో కొన్ని కోల్పోయినా మనకు పెద్ద నష్టం జరిగినట్టే అవుతుందని అన్నారు. పహల్గాం దాడి జరిగి 100 రోజులు గడిచినా ఉగ్రవాదులను ఇప్పటివరకు ఎందుకు పట్టుకోలేదని ప్రశ్నించారు. జరిగిన నష్టం ఎంతో చెప్పాలంటూ రాజ్‌నాథ్ సింగ్‌ను కోరారు. అవాస్తవాల ప్రచారం దృష్ట్యా తాను కోరే సమాచారాన్ని దేశ ప్రజలతో పాటు జవాన్లకూ తెలియడం అవసరమని గొగోయ్ నొక్కిచెప్పారు.

అంతకుముందు రాజ్‌నాథ్ మాట్లాడుతూ భారత స్నేహ హస్తాన్ని అందుకోవడంలో పాకిస్థాన్ విఫలమైందని, ఉగ్రవాదులను పెంచిపోషిస్తోందన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్ కాళ్లబేరానికి వచ్చిందని, భారత సైన్యం సత్తా ప్రపంచానికి తెలిసిందని రాజ్‌నాథ్ అన్నారు. సిందూర్... వీరత్వానికి, శౌర్యానికి ప్రతీకగా వర్ణించారు. 'పహల్గాం దాడికి పాకిస్థాన్‌పై ప్రతీకారం తీర్చుకున్నాం. అనుకున్న లక్ష్యాలన్నీ ధ్వంసం చేశాం' అని ప్రకటించారు. ఉగ్రవాద వ్యతిరేక పటిష్ఠ వైఖరితో ముందుకెళుతున్నట్లు రాజ్‌నాథ్ తెలిపారు. ఆపరేషన్ సిందూర్ ముగియలేదని, పాకిస్థాన్ చర్యలను బట్టి అది కొనసాగుతుందని వెల్లడించారు. కాల్పుల విరమణలో ఇతర దేశాల జోక్యం లేదన్నారు. దేశ సమగ్రత, సార్వభౌమాధికారం పరిరక్షణలో రాజీలేదన్నారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం ఆత్మహత్యాసదృశమని పాక్ గ్రహించాలని రాజ్‌నాథ్ అన్నారు. ప్రత్యక్ష యుద్ధం ద్వారా భారత్‌ను ఏమీ చేయలేమని పాకిస్థాన్‌కు తెలుసు కాబట్టే ఉగ్రవాదులను పోషిస్తూ పరోక్ష దాడులకు పాల్పడుతోందని ఆరోపించారు.

ఎందుకు ఆపారో చెప్పండి: రాహుల్, గొగోయ్

రాజ్‌నాథ్ మాట్లాడుతుండగా ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అడ్డుకున్నారు. అపరేషన్ సిందూర్‌ను ఆకస్మికంగా ఎందుకు ఆపారో సమాధానం చెప్పాలన్నారు. అకస్మాత్తుగా కాల్పుల విరమణ ఎందుకు ప్రకటించారు? వాణిజ్య ఒప్పందాల కోసం యుద్ధ విరమణ ప్రకటిస్తారా? అని రాజ్‌నాథ్‌ను ప్రశ్నించారు. తన సూచన మేరకే కాల్పుల విరమణ జరిగిందని అమెరికా అధ్యక్షుడు 26 సార్లు చెప్పారని, అమెరికా ఒత్తిళ్ల కారణంగానే కాల్పుల విరమణ ప్రకటించినట్లు తోస్తోందన్నారు. దేశ ప్రజలకు ధైర్యం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని రాహుల్ చెప్పారు. ఇంటెలిజెన్స్, నిఘా వ్యవస్థ ఉన్నా పహల్గాం దోషులను ఎందుకు పట్టుకోలేకపోయారని ప్రశ్నించారు. ప్రధాని మోదీ

- మిగతా 2 లో

ప్రజాస్వామ్యంపై దాడి

- ఎస్ఐఆర్ ప్రక్రియ తక్షణమే నిలిపివేయాలి
- పార్లమెంటు వద్ద 'ఇండియా' నిరసన
- ఉభయ సభల్లోనూ ఇదే డిమాండ్

8 లో

జస్టిస్ బట్టు దేవానంద్ ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తిగా జస్టిస్ బట్టు దేవానంద్ సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. మద్రాసు హైకోర్టు నుండి బదిలీపై వచ్చిన ఆయనతో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రమాణం చేయించారు. హైకోర్టు మొదటి కోర్టు హాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, ఏపీ బార్ కౌన్సిల్ అధ్యక్షుడు ద్వారకానాథ్ రెడ్డి, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం, అదనపు సొలిసిటర్ జనరల్

- మిగతా 2 లో

కమిటీ ముందు ఎందుకు హాజరయ్యారు?

న్యూఢిల్లీ: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. ఆయన నివాసంలో పెద్దఎత్తున నోట్ల కట్టలు బయటపడటం, దీనిపై విచారణకు సుప్రీంకోర్టు త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేయడం, ఆ కమిటీ తన నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పించడం చకచకా జరిగాయి. త్రిసభ్య కమిటీ సిఫార్సులను సవాల్ చేస్తూ జస్టిస్ వర్మ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిగింది. ఈ సందర్భంగా సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. 'మీరు ఈ విధంగా పిటిషన్ దాఖలు చేయకుండా ఉండాల్సింది. త్రిసభ్య

- మిగతా 2 లో

విజయవాడ మెట్రోకు టెండర్లు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టు కోసం ఏపీ మెట్రో రైలు కార్పొరేషన్ సోమవారం టెండర్లు పిలిచింది. ఈపీసీ విధానంలో ఈ టెండర్లను ఆహ్వానించింది. ఫేజ్-1లో 38.4 కి.మీ మేర రెండు కారిడార్లలో విజయవాడ మెట్రో నిర్మాణం చేపట్టనున్నారు. కారిడార్-1లో నెహ్రూ బస్టాండ్ నుంచి గన్నవరం బస్టాండ్ వరకు, కారిడార్-2లో బస్‌స్టేషన్ నుంచి పెనమలూరు వరకు మెట్రో నిర్మాణం జరగనుంది. కారిడార్-1లో 4.7 కి.మీ

- మిగతా 2 లో

ఇదీ లోకం!

పోలవరం-బనకచర్ల పనులు ప్రారంభించలేదు

కేంద్రమంత్రి రాజ్ భూషణ్ చౌదరి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పోలవరం-బనకచర్ల ప్రాజెక్ట్ పనులు ఇంకా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్ట లేదని కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ సాంకేతిక, ఆర్థిక అంచనా కోసం ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టును ఇప్పటికే కేంద్ర జలసంఘానికి అందించినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌పై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరాలు లేవనెత్తుతూ... లేఖ రాసిందని గుర్తుచేశారు. ఈ ప్రాజెక్ట్ సాంకేతిక - ఆర్థిక అంచనాల కోసం కేంద్రం తగిన ప్రక్రియ అనుసరిస్తోందని ఆయన స్పష్టం చేశారు. ప్రాజెక్ట్‌పై సంబంధిత అధికారులు, పరీవాహక ప్రాంత రాష్ట్రాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. సోమవారం రాజ్యసభలో కాంగ్రెస్ పార్టీ నేత, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి మంత్రి రాజ్ భూషణ్ ఈ మేరకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. సముద్రంలోకి వృథాగా వెళ్లే గోదావరి మిగులు జలాలను రాయలసీమకు తరలించి... సస్యశ్యామలం చేయాలని చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ఆ క్రమంలో గోదావరిపై బనకచర్ల ప్రాజెక్ట్‌ను రూ.81,900 కోట్లతో నిర్మించాలని నిర్ణయించింది. దీనిపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అఖిలపక్షం ఏర్పాటు చేసి.. ప్రాజెక్ట్ నిర్మాణానికి వ్యతిరేకంగా తీర్మానం చేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో మంత్రులు ఢిల్లీలోని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి... బనకచర్ల నిర్మాణాన్ని అడ్డుకోవాలని, ఈ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల తెలంగాణకు భవిష్యత్తులో కలిగే సమస్యలను వివరించింది. దీంతో ప్రాజెక్ట్ నిర్మాణానికి ఏపీ ప్రభుత్వం సమర్పించిన దస్త్రాన్ని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ పక్కన పెట్టింది.

పర్యాటకం బలోపేతం

ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం

విశాలాంధ్ర-హైదరాబాద్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో చారిత్రక ప్రదేశాలను అభివృద్ధి పరిచి, టూరిజంను బలోపేతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సోమవారం రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, టూరిజం కార్పొరేషన్ ఎండీ వల్లూరి క్రాంతి, జనరల్ మేనేజర్ ఉపేందర్‌రెడ్డిలతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఖమ్మం జిల్లాలో ఏకో, టెంపుల్ టూరిజంను అభివృద్ధిపరిచే ప్రణాళికలను సిద్ధం చేయాలని తుమ్మల అధికారులకు సూచించారు. పాలేరు రిజర్వాయర్, నేలకొండపల్లి బౌద్ధస్థూపం, పర్ణశాల, భద్రాచలం టెంపుల్, కిన్నెరసాని ప్రాజెక్టు, కొత్తగూడెం వద్ద హరితహోటల్, కనిగిరిహిల్స్, వైరా రిజర్వాయర్, వెలుగుమట్ల అర్బన్ పార్కు, ఖమ్మం ఖిల్లా వద్ద రోప్‌వే నిర్మించేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. దేశంలో ప్రసిద్ధిగాంచిన భద్రాచలం రామాలయంను మరింత అభివృద్ధిపరిచి భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలన్నారు. ఇందుకు టూరిజం కార్యాలయం, కార్పొరేషన్ సంయుక్తంగా కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వం ద్వారా గాని, ప్రైవేట్ భాగస్వామ్యంలో గాని వెంటనే నిధుల మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో టూరిజం అధికారులు, కలెక్టర్

- మిగతా 2 లో

ప్రత్యేక రాష్ట్ర సాధనకు జైపాల్‌రెడ్డి ఎనలేని కృషి

వర్ధంతి సభలో మంత్రి కోమటిరెడ్డి

విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జైపాల్‌రెడ్డి ఎనలేని కృషి చేశారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నెక్లెస్ రోడ్డులోని కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి స్మారకం వద్ద సోమవారం ఆయన వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కోమటిరెడ్డితో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, పలువురు నేతలు నివాళి అర్పించారు. జైపాల్‌రెడ్డి సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ... కేంద్రం ఆయనకు భారతరత్న ఇవ్వాలన్నారు. హైదరాబాద్‌కు మెట్రో జైపాల్‌రెడ్డి కృషి వల్లే వచ్చిందని చెప్పారు. దేశం మొత్తం మీద నిజాయతీగా పనిచేసిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన్ను తెలంగాణ మరువదని చెప్పారు.

లూలూకు భూ సంతర్పణ

- విశాఖలో 13.74 ఎకరాలు, విజయవాడలో 4.15 ఎకరాలు
- 99 ఏళ్ల లీజు రూపంలో అప్పగింత
- కారు చౌకగా కట్టబెట్టిన రాష్ట్ర ప్రభుత్వం

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం : ఏ ప్రభుత్వాలు వచ్చిన ప్రజా అవసరాల కన్నా కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నారు. ఖరీదయిన భూములను కారు చౌకగా కట్టబెడుతున్నారు. విశాఖ నగరంలో సెంటు భూమి కూడా ఎంతో విలువైనది. ఇక్కడ గజం స్థలం దొరకడం గగనమవుతోంది. అలాంటిది నగరం నడిబొడ్డున 13.74 ఎకరాలను చదరపు అడుగు రూపాయన్నరకే కారు చౌకగా లూలూ యాజమాన్యానికి 99 ఏళ్ల లీజుకు ఇస్తూ రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ జీవో జారీ

- మిగతా 2 లో

పహల్గాం సూత్రధారి
కాల్చివేత

- ఉగ్రవాది సులేమాన్ మూసా హతం
- శ్రీనగర్‌లో భారీ ఎన్‌కౌంటర్

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో సోమవారం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఇందులో పహల్గాంలో మారణహోమం సృష్టించిన ముగ్గురు ఉగ్రవాదులు హతమైనట్లు తెలుస్తోంది. పహల్గాం సూత్రధారి హషీం మూసా అలియాస్ సులేమాన్ మూసా ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. పహల్గామ్ ఉగ్రదాడికి ఇతడే కీలక సూత్రధారి. భారతీయులు

- మిగతా 2 లో

ఆధార్‌కు అనుమతించండి

ఈసీకి సుప్రీం

న్యూఢిల్లీ: బీహార్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియపై స్టే విధించేందుకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఆగస్టు 1న ముసాయిదా జాబితా ప్రచురణను ఆపలేమని పేర్కొంది. ఆధార్, ఓటరు ఐడీలను అనుమతించాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఓటర్ల తొలగింపు కాదు చేర్పింపే లక్ష్యంగా ఎస్ఐఆర్ జరగాలని సూచించింది. ఎస్ఐఆర్‌పై పిటిషన్లను జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీ నేతృత్వ ద్విసభ్య ధర్మాసనం సోమవారం విచారించింది. అన్ని పిటిషన్లపై ఒకేసారి నిర్ణయం తీసుకుంటామని, తుది విచారణ ఎప్పుడన్నది మంగళవారం నిర్ణయిస్తామని తెలిపింది. ముసాయిదా

- మిగతా 2 లో

హైదరాబాద్ - విజయవాడ మార్గంలో
బస్ టికెట్ల ధరలపై ప్రత్యేక తగ్గింపు

విశాలాంధ్ర-హైదరాబాద్: హైదరాబాద్-విజయవాడ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులకు తెలంగాణ ఆర్టీసీ శుభవార్త చెప్పింది. వివిధ బస్సుల్లో టికెట్ ధరలపై భారీ తగ్గింపు ప్రకటించింది. కనీసం 16 శాతం నుంచి గరిష్ఠంగా 30 శాతం వరకు టికెట్ ధరల్లో ప్రత్యేక తగ్గింపు ఇస్తున్నట్లు తెలుపుతూ 'ఎక్స్'లో పోస్టు పెట్టింది. దీని ప్రకారం... గరుడ ప్లస్ బస్సుల్లో టికెట్ ధరపై 30శాతం, ఈ-గరుడ బస్సుల్లో 26 శాతం ప్రత్యేక ప్రయోజనం కల్పించనుంది. అలాగే, సూపర్ లగ్జరీ, లహరి నాన్ ఏసీ బస్సుల్లో 20 శాతం, రాజధాని, లహరి ఏసీ బస్సుల్లో టికెట్లపై 16శాతం మేర తగ్గిస్తున్నట్లు పేర్కొంది. ఈ రాయితీలు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బుకింగ్‌లకు వర్తిస్తాయి. ఈ టికెట్లను తమ అధికారిక వెబ్‌సైట్ http://tgsrtcbus.in ద్వారా బుక్ చేసుకోవచ్చని సూచించింది.

'సిగాచీ' మృతుల కుటుంబాలకు పరిహారమేది? హరీశ్‌రావు

విశాలాంధ్ర-హైదరాబాద్: సిగాచీ బాధిత కుటుంబాలకు ఇప్పటికీ పరిహారం అందలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిగాచీ ప్రమాద బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలంటూ ఆయన సంగారెడ్డి అదనపు కలెక్టర్‌ను సోమవారం కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... సిగాచీ ప్రమాదంలో మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇప్పిస్తామని సీఎం చెప్పారనీ, రోజులు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. పరిహారం అందలేదని బాధిత

- మిగతా 2 లో

తెల్లరేషన్ కార్డుల పంపిణీ
నిరంతర ప్రక్రియ

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు: కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం: ఎన్నికల హామీ మేరకు తెల్లరేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేయడాన్ని హర్షిస్తున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సన్నబియ్యం నాణ్యత మరింత పెంచి పేదలు కడుపునిండా తిండి తినేలా ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. చుంచుపల్లి, సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి మండలాల లబ్ధిదారులకు సోమవారం తెల్ల రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కొత్త రేషన్ కార్డుల జారీతో చేతులు దులుపుకుంటే సరిపోదని తక్షణమే బియ్యం కేటాయింపు జరగాలన్నారు. ఇతర నిత్యావసరాలు అందిస్తే ప్రజలు ఇంకా ప్రభుత్వానికి రుణపడి ఉంటారని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా 4500 కొత్త రేషన్ కార్డులు అందిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు పాత రేషన్ కార్డుల్లో ఎనిమిది వేల మంది చేర్పింపు జరిగిందన్నారు. కార్డులపంపిణీ నిత్య ప్రక్రియలా కొనసాగేలా ప్రభుత్వంపై వత్తిడి తెస్తానన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చొరవ తీసుకుంటానన్నారు. రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్, డీఎస్ఓ రుక్మిణి, తహసీల్దార్లు రామకృష్ణ, ప్రసాద్, శిరీష, ఎంపీడీవోలు శుభాషిణి, భారతి,

- మిగతా 2 లో

కుదిరిన వాణిజ్య ఒప్పందం

15 శాతం సుంకాలకు ఈయూ-అమెరికా అంగీకారం



టర్న్‌బెర్రీ, స్కాట్లాండ్/వాషింగ్టన్: అమెరికా, యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఆటోమొబైల్స్, సెమీ కండక్టర్లు, ఫార్మాపై 15 శాతం సుంకానికి ఈయూ అంగీకారం తెలిపింది. ఈ మేరకు అమెరికా అధికార ప్రతినిధి ప్రకటించారు. అయితే ఉక్కు, అల్యూమీనియంపై 50 శాతం సుంకానికి అమెరికా కట్టుబడి ఉండగా, వీటిపై చర్చలు కొనసాగించాలని ఈయూ కోరుతోందన్నారు. స్కాట్లాండ్‌లోని తన గోల్ఫ్ రిసార్ట్‌లో ఈయూ అధ్యక్షురాలు అర్సులా వాన్ డెర్ లెయన్‌తో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భేటీ సందర్భంగా ఈ మేరకు వాణిజ్య ఒప్పందం కుదిరింది. అమెరికాలో 600 బిలియన్ల డాలర్ల అదనపు పెట్టుబడులు, 750 బిలియన్ల విలువైన కొనుగోళ్లకు ఈయూ హామీ ఇచ్చింది. అమెరికా నుంచి ఎల్ఎన్‌జీ, చమురు, అణు ఇంధనాన్ని రాబోయే మూడేళ్లల్లో కొనుగోలు చేసేందుకు ఈయూ అంగీకారం తెలిపింది. రష్యా ఇంధనాల నుంచి ఇతర వనరులపై మళ్లే క్రమంలో ఈ నిర్ణయం తీసుకున్నది. అమెరికాకు సంబంధించిన కొన్ని మినహా అన్ని ఉత్పత్తులకు తమ మార్కెట్ల ద్వారాలు తెరిచేందుకు ఈయూ అంగీకరించింది. యూరోపియన్ యూనియన్‌తో వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన కార్యాచరణ ఖారైందని, అన్ని అంశాలపై ఇద్దరు అధినేతల మధ్య ఏకాభిప్రాయం కుదిరిందని అధికారిక ప్రకటన పేర్కొంది.

తక్షణమే కాల్పుల విరమణ

- బేషరతు అమలుకు థాయిలాండ్, కంబోడియా అంగీకారం
- ఫలించిన మలేసియా మధ్యవర్తిత్వం



పుత్రాజయ (మలేసియా): థాయిలాండ్, కంబోడియా దేశాల మధ్య పోరుకు తెరపడింది. తక్షణమే బేషరతుగా కాల్పుల విరమణకు ఏకాభిప్రాయం కుదిరింది. ఈ మేరకు మలేసియా మధ్యవర్తిత్వం ఫలించింది. మలేసియా రాజధాని పుత్రాజయలో ఆ దేశ ప్రధాని అన్వర్ ఇబ్రహీం అధ్యక్షతన సోమవారం కంబోడియా ప్రధాని హన్ మానెట్, థాయ్ తాత్కాలిక పీఎం ఫుమ్‌తాత్ వెచాయాచాయ్ భేటీ అయ్యారు. బేషరతుగా కాల్పుల విరమణకు అంగీకరించారు. అర్ధరాత్రి నుంచి అమల్లోకి తెస్తామన్నారు. ఈ చర్చల్లో అమెరికా, చైనాకు మలేసియా రాయబారులు పాల్గొన్నారు. ఐదు రోజులుగా రెండు దేశాల మధ్య పోరులో 35 మంది ప్రాణాలు కోల్పోగా, 2,70,000 మంది నిరాశ్రయులయ్యారు. ఈ పరిస్థితుల్లో శాంతి నెలకొల్పే ఉద్దేశంతో మధ్యవర్తిత్వం వహించేందుకు మలేసియా ముందుకొచ్చింది. ఇద్దరు ప్రధానులను తమ దేశానికి పిలిపించి మలేసియా ప్రధాని ఇబ్రహీం మాట్లాడారు. దీంతో బేషరుతుగా కాల్పులు విరమణకు అంగీకారం కుదిరింది. సరిహద్దు వివాదాన్ని ముగించి, సాధారణ స్థితికి నెలకొల్పడమే లక్ష్యంగా జరిగిన చర్చలు ఫలించాయని అన్వర్ ఇబ్రహీం వెల్లడించారు. సానుకూలమైన పరిణామం చోటుచేసుకుందని, ఇది కంబోడియా, థాయిలాండ్‌కు సత్ఫలితాలి ఇస్తుందని అన్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో థాయ్, కంబోడియా ప్రధానులు, అన్వర్ ఇబ్రహీం సమక్షంలో కరచాలనం చేస్తూ తమ మధ్య పోరుకు తెర దించినట్లు వెల్లడించారు.

పరిస్థితి మారకపోతే చర్చలు అర్ధరహితం: హమాస్

గాజా సిటీ: ఆంక్షలు, ఆకలి కేకలు కొనసాగేంత వరకు గాజాలో కాల్పుల విరమణపై చర్చలు అర్ధరహితమని హమాస్‌కు చెందిన బహిష్కృత గాజా నేత ఖలీల్ అల్ హయ్యా అన్నారు. గాజాలో పరిస్థితులు మెరుగుపడాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. తక్షణమే, గౌరవప్రదంగా ఆహారం, మందులను ప్రజలకు అందించాలని సూచించారు. అది జరిగినప్పుడే సంప్రదింపులకు విలువ ఉంటుందని చెప్పారు. చర్చలు సఫలమయ్యాయని చెప్పేందుకు ఇదే సంకేతమన్నారు. ఈ మేరకు రికార్డు చేసిన ఆయన ప్రసంగాన్ని హమాస్ విడుదల చేసింది.

కాల్పులకు ఇజ్రాయిల్ 10 గంటల విరామం

గాజాలో ఆకలిచావులు సంభవిస్తున్న నేపథ్యంలో జనాభా ఎక్కువగా ఉన్న మూడు ప్రాంతాల్లో ఆదివారం నుంచి రోజుకు 10 గంటల పాటు కాల్పుల విరమణకు ఇజ్రాయిల్ ఆదేశించింది. గాజా సిటీ, డెయిర్ అల్-బలా, మువాసీ ప్రాంతాల్లో స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకూ పాక్షిక కాల్పుల విరమణ అమలవుతుందని ఇజ్రాయిల్ సైన్యం తెలిపింది. తద్వారా ఆహార సరఫరా సుగమమవుతుందని పేర్కొంది. పాక్షిక కాల్పుల విరమణను ఐక్యరాజ్య సమితి స్వాగతించింది. అందరికీ ఆహారం లభించాలంటే పూర్తిస్థాయి కాల్పుల విరమణ అవసరమని సూచించింది. ఇదిలావుంటే, గాజాలోని మిగిలిన ప్రాంతాల్లో యథాతథంగా దాడులు కొనసాగుతున్నాయని ఇజ్రాయిల్ వెల్లడించింది.

మోదీ సర్కారు నిలదీత

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల కోసం బీహార్ వెళ్లారుగానీ పహల్గాం ఎందుకు వెళ్లలేదని నిలదీశారు. ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయడంలో ఉదాసీనంగా వ్యవహరించారని, పుల్వామా, ఉరి ఘటనల తర్వాత కూడా ఉదాసీనత కనిపించిందని వ్యాఖ్యానించారు. తాను ధైర్యంగా పహల్గాంకు వెళ్లినప్పుడు ప్రధాని ఎందుకు ఆ పనిచేయలేదని రాహుల్ ప్రశ్నించారు. గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ 'మేము శత్రువులం కాదు. మన దేశం, సైన్యానికి అనుకూలం. అయితే మీరు మాకు వాస్తవాలు వెల్లడించాలి' అని రాజ్‌నాథ్‌నుద్దేశించి అన్నారు. ఉగ్రవాదంపై పోరులో ప్రభుత్వానికి అండగా నిలుస్తాం కానీ అబద్ధాలు, మోసాలను ప్రశ్నిస్తామన్నారు. ట్రంప్ 26 సార్లు తన వల్లే కాల్పుల విరమణ జరిగిందని చెప్పుకోవడం వెనుక వాస్తవాలను తెలపాలని డిమాండ్ చేశారు. పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ నిధులను భారత్ ఎందుకు ఆపలేకపోయింది? పహల్గాం ఘటన, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో అంతర్జాతీయ దౌత్యం పరిస్థితి ఏమిటి? అని రాజ్‌నాథ్‌ను ప్రశ్నించారు. ఆపరేషన్ సిందూర్‌పై ఉన్న అనేక సందేహాలను నివృత్తి చేయాలని, పహల్గాంకు ఉగ్రవాదులు ఎలా వచ్చారో చెప్పాలని కోరారు. దేశ ప్రయోజనాలు కాపాడేందుకు ప్రశ్నిస్తున్నామని, కచ్చితమైన సమాధానాన్ని రక్షణ మంత్రి నుంచి ఆశిస్తున్నామన్నారు. శాటిలైట్ వ్యవస్థ, పోలీసు వ్యవస్థ ఉన్నా ఉగ్రవాదులను ఎందుకు పట్టుకోలేదు? ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్ సురక్షితమన్నప్పుడు ఈ దాడి ఎలా జరిగింది? అని గొగోయ్ ప్రశ్నించారు. ఉగ్రవాదాన్ని ఉపేక్షించరాదని, పాక్‌కు భారత్ బుద్ధి చెప్పాలని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తామని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అప్పట్లో చెప్పారని గౌరవ్ గొగోయ్ గుర్తుచేశారు.

ఉగ్రవాదాన్ని ఉపేక్షించం: జైశంకర్

ఉగ్రవాదాన్ని భారత్ ఉపేక్షించదని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ నొక్కిచెప్పారు. జమ్మూకశ్మీర్‌లో కల్లోలం సృష్టించాలని, అక్కడి పర్యాటక రంగాన్ని దెబ్బతీయాలని జరిగిన ప్రయత్నాలను ఆపరేషన్ సిందూర్‌తో తిప్పికొట్టామన్నారు. పహల్గాం ఘటనను ఐరాస భద్రతా మండలి, క్వాడ్ దేశాలు ఖండించినట్లు తెలిపారు. దాడికి పాల్పడిన టీఆర్ఎఫ్‌ను అంతర్జాతీయ ఉగ్ర సంస్థగా అమెరికా ప్రకటించిందని తెలిపారు. ఐరాసలోని 193 దేశాల్లో మూడు మాత్రమే పాకిస్థాన్‌కు అనుకూలమన్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరిక చేశామని, ఆ దేశ ఉగ్రస్థావరాలపై దాడి చేశామని, దీంతో పాకిస్థాన్ దాడులు ఆపమంటూ విజ్ఞప్తులు చేసిందని జైశంకర్ తెలిపారు. ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు ప్రపంచ దేశాల మద్దతు ఉందన్నారు. పహల్గాంపై అమెరికాతో జరిపిన చర్చల్లో వాణిజ్య ఒప్పందం ప్రస్తావన రాలేదని వెల్లడించారు. అదే సమయంలో ప్రతిపక్షంపై మండిపడ్డారు. నాడు ముంబై దాడులపై చర్యలు తీసుకోకపోవడమే సరైనదిగా భావించిన వారు నేడు మమ్మల్ని ప్రశ్నిస్తున్నారని కాంగ్రెస్‌నుద్దేశించి వ్యాఖ్యానించారు. చైనాతో డోక్లామ్ సమస్యను ప్రస్తావించారు. మోదీ హయాంలో 2018 నుంచి 2022 వరకు అంటే 1,576 రోజులు ఎఫ్ఏటీఎఫ్ గ్రేలిస్ట్‌లో పాకిస్థాన్ ఉందని గుర్తుచేశారు. పాకిస్థాన్‌తో కాల్పుల విరమణలో ట్రంప్ పాత్ర లేదని జైశంకర్ తెలిపారు. ఉగ్రవాదం-చర్చలు సాధ్యం కాదని, నీరు-రక్తం ఒకేసారి ప్రవహించలేవని ఆపరేషన్ సిందూర్ నాటి వ్యాఖ్యలను గుర్తుచేశారు. తాను చైనా వెళ్లినది ఒలింపిక్స్ కోసమే లేక రహస్య ఒప్పందాలు చేసుకోవడానికో కాదని... ఉగ్రవాదం, వాణిజ్యం, బలగాల ఉపసంహరణపై భారత్ వైఖరిని స్పష్టం చేసేందుకేనని జైశంకర్ తెలిపారు. పహల్గాం దాడి రోజు అంటే ఏప్రిల్ 22 నుంచి జూన్ 17వ తేదీ వరకు ట్రంప్‌తో ప్రధాని మోదీ మాట్లాడలేదని, ఏ దేశలోనూ వీరిద్దరి మధ్య సంభాషణ జరగలేదని జైశంకర్ వెల్లడించారు.

మరో 20 ఏళ్లు విపక్షంలోనే: అమిత్‌షా

జైశంకర్ మాట్లాడే సమయంలో ప్రతిపక్ష సభ్యులు నినాదాలతో అడ్డుకోగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా జోక్యం చేసుకున్నారు. విపక్షాలపై మండిపడ్డారు. వీళ్లకు (ప్రతిపక్షాలనుద్దేశించి) విదేశాంగ మంత్రి మాటల కంటే వేరొక దేశం చెప్పేదానిపైనే నమ్మకం ఎక్కువ అంటూ వ్యాఖ్యానించారు. వీరి పార్టీలో విదేశాలతో సంబంధాలకు ఉన్న ప్రాధాన్యతను అర్థం చేసుకోగలను. కానీ ఆ పార్టీలో జరిగేదే సభలోనూ జరగాలంటే కుదరదని కాంగ్రెస్‌నుద్దేశించి అన్నారు. ఇలాంటి వైఖరి కారణంగానే మైనారిటీగా ఉన్నారని, మరో 20 ఏళ్లు ప్రతిపక్షంలోనే ఉంటారని అమిత్‌షా విమర్శించారు.

మౌనం ఎందుకు మోదీజీ: ఎస్‌పీ ఎంపీ

సభకు రాకుండా ప్రధాని తప్పించుకుంటున్నారని, ఆయన చెప్పిన అమృత కాలం ఇదేనా అంటూ సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ఛోటేలాల్ ఎద్దేవా చేశారు. పహల్గాం ఉగ్రదాడిపై ప్రధాని మౌనాన్ని ప్రశ్నించారు. ప్రధాని స్పందించకపోవడం ఆ ఘటన జరగడం కంటే కూడా ఘోరమైన పరిణామం అని అన్నారు. దాడి వేళ బీహార్ పర్యటనలో ప్రధాని ఉన్నారని గుర్తుచేశారు. పహల్గాం ఘటనపై ఆయన మౌనం ప్రజాస్వామ్యం తలకు తుపాకీ పెట్టడమేనని అభిప్రాయపడ్డారు. ప్రధాని ఎందుకు మౌనం వహించారో సమాధానం చెప్పాలన్నారు. కుంభమేళ నిర్వహణలో వైఫల్యాలను ఆర్‌జేడీ ప్రస్తావించింది.

బీజేపీ బెంగాలీలను శత్రువులుగా చూస్తోందని టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా వ్యాఖ్యానించారు. జవహర్‌లాల్ నెహ్రూ భారత సైన్యానికి ప్రోత్సాహం అందించలేదని, ఆ పని చేసినది తమ ప్రభుత్వమేనని బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చెప్పడాన్ని ఎన్‌సీపీ(ఎస్‌పీ) ఎంపీ సుప్రియా సూలే ఖండించారు. మనకు రక్షణ కల్పించేందుకు అహర్నిసలు పాటుపడే సైనికులు, వారి కుటుంబాలను అవమానించేలా సూర్య మాట్లాడారని దుయ్యబట్టారు. ముందు దేశం, ఆ తర్వాతే రాష్ట్రం, పార్టీ, కుటుంబం అని సూలే అన్నారు. దేశానికి తొలి ప్రాధాన్యత ఉంటుందని నొక్కిచెప్పారు.

కమిటీ ముందు ఎందుకు హాజరయ్యారు?

(మొదటిపేజీ తరువాయి)

విచారణ కమిటీ ఇచ్చిన దర్యాప్తును మీరు సవాల్ చేశారు. కాబట్టి ఇక్కడ తొలి ప్రతివాది సుప్రీంకోర్టే అవుతుంది. కమిటీ నియామకం జరిగినప్పుడే మీరు సుప్రీంకు ఎందుకు రాలేదు? ఎందుకు వేచి చూశారు? గతంలో ఈ విచారణలకు న్యాయమూర్తులు హాజరుకాలేదు. మీరు ఎందుకు హాజరయ్యారు?' అని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఏజీ మాసిహ్‌తో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. నగదు ఎవరిదో కనుక్కోవచ్చని భావించినందున ఆయన విచారణకు హాజరయ్యారని జస్టిస్ వర్మ తరఫు న్యాయవాది కపిల్ సిబల్ వాదించారు. జస్టిస్ వర్మ అవుట్‌హౌస్‌లో దొరికిన నగదు ఆయనదే అని ఎలా చెబుతారని సిబల్ ప్రశ్నించారు. 'పోలీసులు, సిబ్బంది, అంతా అక్కడ ఉండగా నగదు దొరికింది' అని ధర్మాసనం పేర్కొనగా... హైకోర్టు న్యాయమూర్తి సిబ్బంది అక్కడ లేరని సిబల్ అన్నారు. దాంతో విచారణ కమిటీ నివేదిక సరైంది కాదని అంటున్నారా అని కోర్టు ప్రశ్నించింది. తన ఉద్దేశం అది కాదని సిబల్ బదులిచ్చారు. ఇక దీనిపై తదుపరి విచారణ వచ్చే బుధవారానికి వాయిదా పడింది. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న సమయంలో జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంటి ఆవరణలో కాలిపోయిన నోట్ల కట్టలు దొరికాయి. మంటలను ఆర్పేందుకు వచ్చిన సిబ్బంది వాటిని గుర్తించారు. ఈ ఘటనపై అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా... అంతర్గత విచారణ కోసం ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తులతో కమిటీని వేశారు. ఆ కమిటీ నోట్ల కట్టలు దొరికింది వాస్తవమేనని తేల్చింది. దీంతో రాజీనామా చేయాల్సిందిగా జస్టిస్ వర్మకు సీజేఐ సూచించారు. ఆయన తిరస్కరించడంతో... అభిశంసనకు సిఫారసు చేశారు. కాగా, జస్టిస్ యశ్వంత్ వర్మ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో తన గుర్తింపును దాచిపెట్టారు. 'ఎక్స్ఎక్స్ఎక్స్'గా తనను తాను అభివర్ణించుకున్నారని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. లైంగిక వేధింపులు, దాడికి గురైన మహిళా పిటిషనర్ల గుర్తింపును దాచేందుకు సుప్రీంకోర్టు, హైకోర్టు రికార్డుల్లో ఇలా వాడుతుంటారు. మైనర్లు, విఫల వివాహ బంధాల్లో పిల్లల కస్టడీకి సంబంధించిన అంశాల్లోనూ గుర్తింపు వెల్లడికాకుండా ఇలా ఉపయోగిస్తుంటారు. అత్యాచార కేసుల్లో బాధితులు ప్రాణాలతో బయటపడిన వారి పేర్లను తీర్పుల్లో వెల్లడించవద్దని దిగువ న్యాయస్థానాలకు సుప్రీం అనేకమార్లు సూచించింది. 'ఎక్స్ఎక్స్ఎక్స్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' పేరిట జస్టిస్ వర్మ జులై 17న పిటిషన్ దాఖలు చేశారు. దీనిలో కేంద్రం తొలి ప్రతివాది కాగా... సుప్రీంకోర్టు రెండో ప్రతివాదిగా ఉన్న సంగతి తెలిసిందే. అయితే పిటిషన్‌లో ఆయన తన వివరాలపై గోప్యత పాటించడం వెనక గల కారణాలపై మాత్రం స్పష్టత లేదు.

పర్యాటకం బలోపేతం

(మొదటిపేజీ తరువాయి)

క్షేత్రస్థాయిలో పర్యటించి తగు కార్యాచరణను రూపొందించాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ... ఆగస్టులో ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారని, టూరిజం ప్రదేశాలను సందర్శించే అవకాశం ఉన్నందున, తగు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఖమ్మంకు సమీపంలో సుమారు 500 ఎకరాల విస్తీర్ణంలో అటవీ ప్రాంతంలో ఏకో టూరిజం అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

పత్తి రైతుల బకాయిలు నెలలోగా చెల్లించాలి

జోగులాంబ గద్వాల జిల్లా పత్తి రైతుల బకాయిలను నెలలోగా చెల్లించాలని సీడ్స్ కంపెనీలను మంత్రి తుమ్మల ఆదేశించారు. గద్వాల జిల్లా రైతులు సుమారు 50వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారని, నెలలు గడిచినా సంబంధిత కంపెనీలు చెల్లింపులు చేయలేదని స్థానిక ఎమ్మెల్యే కృష్ణామోహన్‌రెడ్డి ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చారన్నారు. స్పందించిన మంత్రి... రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ లక్ష్యమని, వారికి ఎలాంటి అసౌకర్యం కలిగినా సహించేది లేదని స్పష్టం చేశారు. మంత్రులు, రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ సంచాలకులు డాక్టర్ గోపి... వివిధ సీడ్ కంపెనీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. గద్వాల జిల్లా పత్తి విత్తనాల ఉత్పత్తిలో దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని మంత్రి తుమ్మల అన్నారు. విత్తనాలు కంపెనీలకు అందిస్తే ... రైతులకు ఇప్పటి వరకు డబ్బులు చెల్లించకపోవడం విచారకరమని అన్నారు. సుమారు రూ.700 కోట్లు రైతులకు బకాయిలు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. రైతుభరోసాతో ప్రభుత్వం రైతాంగానికి వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. రాష్ట్ర సీడ్స్‌మెన్ అసోసియేషన్ ప్రతినిధులు రామకృష్ణ, ప్రవీణ్, వివిధ కంపెనీల ప్రతినిధులు, రాష్ట్ర వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

జస్టిస్ బట్టు దేవానంద్ ప్రమాణ స్వీకారం

(మొదటిపేజీ తరువాయి)

ధనుంజయ, అదనపు అడ్వకేట్ జనరల్ పి.సాంబశివ ప్రతాప్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.లక్ష్మీనారాయణ, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ పార్థసారధి, ఇతర రిజిస్ట్రార్లు, సీనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్, బార్ కౌన్సిల్ సభ్యులు, ఏపీ లీగల్ సర్వీసెస్ అథారిటీ, ఏపీ జుడీషియల్ అకాడమీ ప్రతినిధులు పాల్గొన్నారు.

'సిగాచీ' మృతుల కుటుంబాలకు పరిహారమేది? హరీశ్‌రావు

(మొదటిపేజీ తరువాయి)

కుటుంబసభ్యులు ఆందోళనలో ఉన్నారన్నారు. ఎప్పుడు పరిహారం ఇస్తారని నిలదీస్తున్నారని తెలిపారు. పరిహారం కోసం అధికారులను కలిస్తే నిర్లక్ష్యంగా సమాధానాలు ఇస్తున్నారన్నారు. 'కొన్ని కుటుంబాలకు రూ.లక్ష పరిహారమే అందింది. మృతులు, క్షతగాత్రుల వివరాలు ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. ఎంత మందికి పరిహారం ఇచ్చారో అధికారికంగా చెప్పాలి' అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

విజయవాడ మెట్రోకు టెండర్లు

(మొదటిపేజీ తరువాయి)

మేర డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టనున్నారు. 32 చోట్ల మెట్రో స్టేషన్లు, ఒక చోట అండర్ గ్రౌండ్ మెట్రో స్టేషన్ రానుంది. విజయవాడ మెట్రో నిర్మాణానికి డిజైన్లు, సాంకేతిక సహకారం, పర్యవేక్షణ కొరకు టిప్సా కన్సల్టెన్సీని ఇప్పటికే ఎంపిక చేయగా, రెండు కారిడార్లలో రూ.10,118 కోట్ల అంచనా వ్యయం కానున్నట్లు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 91 ఎకరాలు భూసేకరణ చేపట్టాల్సి ఉంటుంది.

తెల్లరేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ

(మొదటిపేజీ తరువాయి)

అంకుబాబు, హన్మంతరావు, పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాషా, దస్రు, కుమారి హన్మంతరావు, వాసిరెడ్డి మురళి, దీటి లక్ష్మిపతి, జక్కుల రాములు, చిరుమామిళ్ల వెంకటేశ్వరరావు, తాళ్ల వెంకటేశ్వర్లు, పాలమూరి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు, తూము చౌదరి, చింతలపూడి శేఖర్, ధర్మారావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఉన్నతాధికారులతో భేటీ

సింగరేణి సంస్థ ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులతో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు భేటీ అయ్యారు. చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరామ్, డైరెక్టర్ (పా) గౌతం తో... కొత్తగూడెం నియోజకవర్గ అభివృద్ధి, మౌలిక సదుపాయాలపై సుదీర్ఘంగా చర్చించారు. సంస్థ నిర్వహణలో కూరగాయల మార్కెట్, షాపింగ్ కాంప్లెక్‌ను త్వరితగతిన అభివృద్ధి చేయాలని కోరారు. సీఎస్ఆర్ నిధులతో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కొత్తగూడెం బస్టాండ్ పున:నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. సింగరేణి వైద్యశాలను కార్పొరేట్ స్థాయి వైద్యశాలగా అభివృద్ధి చేయాలన్నారు. వైద్యుల కొరతను నివారించడంతోపాటు నిపుణులైన వైద్యులను నియమించాలని సూచించారు. కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్వార్టర్లలో సదుపాయాలు కల్పించాలని కోరారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలను అందజేయాలన్నారు. గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు వంగ వెంకట్, రమణమూర్తి తదితరులు ఉన్నారు.

'లూలూ'కు భూ సంతర్పణ

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. దీనిని విశాఖలో వామపక్షాలతో పాటు విపక్ష పార్టీలు, అనేక ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, మేధావులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

లూలూ మాల్‌కు కేటాయించిన 13.74 ఎకరాల స్థలం విశాఖ నగరంలోనే అత్యంత ఖరీదయినది. మార్కెట్ విలువ ప్రకారం ఎకరం భూమి అక్కడ రూ.100 నుంచి 150 కోట్ల ధర పలుకుతోందని అంచనా. అంటే కనీసం ఈ భూముల విలువ రూ.1,500 కోట్ల పైమాటే. మొదటి మూడు సంవత్సరాలు ఎటువంటి లీజు లేకుండా నిర్మాణం పూర్తయిన తర్వాత నుంచి లీజు వసూలు చేస్తారు. చదరపు అడుగుకు నెలకు రూ.1.50 చొప్పున ఏడాదికి రూ.4.51 కోట్లు ప్రభుత్వానికి లూలూ అద్దె రూపంలో చెల్లిస్తుంది. ప్రతి పదేళ్లకు కేవలం 10 శాతం అద్దె మాత్రమే పెంచాలని నిర్ణయించారు. 2028 డిసెంబరు నాటికి ఈ భవనం అందుబాటులోకి వస్తుందని జీవోలో పేర్కొన్నారు. విజయవాడలో కూడా గవర్నర్ పేట ఆర్టీసీ డిపోకు చెందిన 4.15 ఎకరాల భూమిని లూలూకి కట్టబెట్టింది. కేవలం రూ.156 కోట్ల పెట్టుబడితో 2.32 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో జి ప్లస్ త్రీ విధానంలో ఈ షాపింగ్ మాల్ నిర్మించనున్నారు. ప్రజా అవసరాలకు, ఆర్టీసీ అవసరాలకు వినియోగించకుండా ఈ భూమిని లూలూకు కేటాయించడంపై ఆర్టీసీ ఉద్యోగ సంఘాలతో పాటు అనేక రాజకీయ పార్టీలు పెద్ద ఎత్తున వ్యతిరేకిస్తున్నాయి.

ఎందుకు ఈ లూలూ మాల్

లూలూ మాల్స్‌కు వివిధ దేశాల్లో పేరుంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) లోని అబుదాబి ప్రధాన కేంద్రంగా లూలూ సంస్థ ఇతర దేశాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో మాల్స్ నిర్వహిస్తోంది. అలాంటి మాల్‌ను ఆంధ్ర ప్రదేశ్‌లోని విశాఖపట్నంలో, విజయవాడలో ఏర్పాటు చేయడానికి లూలూ యాజమాన్యం ముందుకొచ్చింది. 2018 ఫిబ్రవరిలో విశాఖలో జరిగిన పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సులో అప్పటి టీడీపీ ప్రభుత్వంతో ఒప్పందం కూడా కుదుర్చుకుంది. ఎంఓయూలో భాగంగా విశాఖ సాగర తీరానికి చేరువలో హార్బర్ పార్కు ఎదురుగా ఉన్న 11.23 ఎకరాల ఏపీఐఐసీ స్థలాన్ని, సీఎంఆర్ సంస్థకు చెందిన విశ్వప్రియ ఫంక్షన్ హాలులోని 2.60 ఎకరాలు వెరసి 13.74 ఎకరాలను కేటాయించింది. నామమాత్రపు లీజుతో పీపీపీ విధానంలో లూలూ సంస్థకు విలువైన ప్రభుత్వ స్థలాన్ని కట్టబెట్టడంపై అప్పట్లో ప్రతి పక్షాలు, ప్రజాసంఘాలు ఆందోళనలు చేపట్టాయి. అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. ఒప్పందం జరిగిన మరుసటి ఏడాది టీడీపీ గద్దె దిగి వైసీపీ అధికారంలోకి వచ్చింది. అప్పటికే ఈ ప్రాజెక్టుపై వచ్చిన విమర్శలు, అభ్యంతరాలను దృష్టిలో ఉంచుకుని వైసీపీ ప్రభుత్వం 2019 నవంబరులో రివర్స్ టెండరింగ్ విధానంలో భాగంగా టీడీపీ హయాంలో జరిగిన ఎంఓయూను రద్దు చేసింది. దీంతో లూలూ సంస్థ వెనక్కి వెళ్లిపోయింది. ఆ పై ప్రభుత్వం ఈ స్థలాన్ని వీఎంఆర్డీఏకు అప్పగించింది. అప్పట్లో ఈ భూముల విలువ రూ.1,450 కోట్లు ఉంటుందని అంచనా వేసింది. ఆరేళ్ల క్రితం అంతటి ధర ఉంటే ఇప్పుడెంత పలుకుతుందో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలనలోకి వచ్చిన తర్వాత లూలూ గ్రూపు సీఎండీ యూసఫ్ ఆలీలో కొత్త ఆశలు మళ్లీ చిగురించాయి. దీంతో ఆయన గత సెప్టెంబరులో అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో భేటీ అయ్యారు. వీరిద్దరి కలయికతో విశాఖలో, కొత్తగా విజయవాడలో లూలూ మాల్ మళ్లీ తెర పైకి వచ్చింది. టీడీపీ హయాంలో మాల్ కోసం కేటాయించిన స్థలాన్ని తిరిగి తమకు అప్పగిస్తే ఎంఓయూ ప్రకారం మాల్ నిర్మాణాన్ని చేపడతామని జనవరిలో సీఎం చంద్రబాబుకు లూలూ చైర్మన్ యూసఫ్ ఆలీ లేఖ రాశారు. ఆయన లేఖ రాసిందే తడవుగా ప్రభుత్వం రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశంలో ఆమోద ముద్ర వేసింది. లూలూ మాల్‌కు ఈ భూమిని కేటాయిస్తూ వైసీపీ హయాంలో రద్దు చేసిన 13.74 ఎకరాల భూమిని వీఎంఆర్డీఏ నుంచి ఏపీఐఐసీకీ బదలాయించేలా మార్చి 26న జీవోను జారీ చేసింది.

లూలూకు భూకేటాయింపులు చట్ట విరుద్ధం: విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ

విశాఖ బీచ్ రోడ్‌లోని హార్బర్ పార్క్ భూమిని వాణిజ్య ప్రయోజనాల కోసం లూలూ గ్రూప్‌నకు తిరిగి ఇవ్వాలని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చట్ట విరుద్ధమని, సీఆర్‌జెడ్ నోటిఫికేషన్, సుప్రీం కోర్టు తీర్పు, ఏపీ హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘించడమేనని మాజీ ఐఏఎస్ అధికారి, కేంద్ర ఇంధన శాఖ మాజీ కార్యదర్శి ఈఏఎస్ శర్మ సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. ఈ లేఖను కేంద్ర ప్రభుత్వ సంస్థలయిన సీబీఐకి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌కు పంపారు. ఈ భూమి సీఆర్‌జెడ్ నిషేధిత ప్రాంతంలోకి వస్తుందని, భీమిలి తీర ప్రాంతంలో సీఆర్‌జెడ్ పరిధిలో ఓ రాజకీయ నేత చేపట్టిన కట్టడాలను, పునాదులను కూల్చివేయాలని హైకోర్టు ఆదేశించిందని ఆయన గుర్తు చేశారు. గత ప్రభుత్వం సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా రుషికొండలో పర్యాటక శాఖ సముదాయాన్ని కూల్చి కొత్త భవనాలను నిర్మించడం పైనా మందలించిందని, కేరళలోని మరడు పంచాయతీలో సీఆర్‌జెడ్ నిబంధనలను ఉల్లంఘించి నిర్మించిన నాలుగు భారీ బహుళ అంతస్తుల కూల్చివేతకు సుప్రీం కోర్టు ఆదేశించిందని పేర్కొన్నారు. అందువల్ల లూలూ మాల్ విషయంలో సంబంధిత అధికారులెవ్వరూ సీఆర్‌జెడ్ నిబంధనలను ఉల్లంఘనలకు పాల్పడవద్దని కోరారు.

పహల్గాం సూత్రధారి కాల్చివేత

(మొదటిపేజీ తరువాయి)

ఆశ్చర్యపడేలా కీలక ఉగ్రవాది మూసాను సైన్యం అంతం చేసింది. పక్కా ప్రణాళికతో భారత సైన్యం ఆపరేషన్ మహదేవ్ చేపట్టింది. శ్రీనగర్‌లో దట్టమైన అడవిలో తలదాచుకున్న ఉగ్రవాదుల జాడను సైన్యం పసిగట్టింది. సంచార జాతుల వారు ఇచ్చిన పక్కా సమాచారంతో ఆపరేషన్ మహదేవ్ ప్రారంభించింది. భారత సైన్యంతో పాటు సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్), జమ్మూకశ్మీర్ పోలీసుల బృందాలు ఆపరేషన్ మహదేవ్‌లో పాల్గొన్నాయి. శ్రీనగర్‌లోని హర్వాన్ ప్రాంతంలోని దాచిగామ్ అటవీ ఎగువ ప్రాంతంలో ఉగ్రవాదుల కదలికను ముందుగా కని పెట్టి... చాకచక్యంగా ముగ్గురు ఉగ్రవాదు లను భారత దళాలు మట్టుబెట్టాయి. దాదాపు 14 రోజులుగా ఉగ్రవాదుల కదలికలపై నిఘా పెట్టాయి. అయితే సంచార జాతులు నిర్ధారించడంతో రంగంలోకి దిగి సైన్యం వారిని హతమార్చింది.

హషీం మూసా ఎవరు?

హషీం మూసా అలియాస్ సులేమాన్ మూసా పాకిస్థాన్ ఆర్మీ స్పెషల్ సర్వీస్ గ్రూప్‌లో మాజీ పారా-కమాండో. సైన్యంలో ఉన్నప్పుడు కీలక పదవి నుంచి తొలగింపబడ్డాడు. అనంతరం నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాలో చేరినట్లుగా నిఘా వర్గాల సమాచారం. మూసా అసాధారణ యుద్ధాలు చేయడంలో, రహస్య కార్యకలాపాలు నిర్వహించడంలో నిపుణుడని చెబుతుంటారు. అధునాతన ఆయుధాలు ప్రయోగించడంలో కూడా దిట్ట. అంతేకాకుండా అనేక మందికి శిక్షణ ఇవ్వడంలో మంచి నైపుణ్యం ఉంది. కశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహించడానికి పాకిస్థాన్ ఆర్మీనే అతడిని నియమించినట్లుగా సమాచారం. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత... స్థానికులను దర్యాప్తు బృందం అదుపులోకి తీసుకుని విచారించగా సులేమాన్ కుట్రలు వెలుగులోకి వచ్చాయి. అంతేకాకుండా అతడి జాడ గురించి తెలిసింది. ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఉగ్రవాదులంతా భారత్‌లోనే తలదాచుకుంటున్నారని దర్యాప్తు బృందాలకు పక్కా సమాచారం అందింది. స్థానికుల సాయంతో వారికి ఆహారం, నీళ్లు, తదితర వసతులు అందుతున్నట్లుగా కనిపెట్టాయి. అయితే 14 రోజుల నుంచి అనుమానాస్పద సంభాషణను సైన్యం పసిగట్టింది. దీనికి సంచార జాతుల సాయం కూడా తోడైంది. వారు ఇచ్చిన పక్కా సమాచారంతో ఆపరేషన్ మహదేవ్ చేపట్టి సైన్యం విజయం సాధించింది.

ఆధార్‌కు అనుమతించండి

(మొదటిపేజీ తరువాయి)

జాబితా ప్రచురణపై స్టే ఇవ్వాలన్న పిటిషనర్ ఏడీఆర్ తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర్ నారాయణన్ కోరగా ... కుదరదని ధర్మాసనం తెలిపింది. అందుకోసం పట్టుబట్టవద్దని సూచించింది. ఇదే విషయంలో గతంలో ఇచ్చిన ఆదేశాలను ధర్మాసనం గుర్తుచేసింది. అదే సమయంలో ఓటర్ల జాబితా సవరణకు ఆధార్, ఓటర్ గుర్తింపు కార్డులను అనుమతించాలని ఎన్నికల సంఘానికి స్పష్టంచేసింది. ఓటర్, ఆధార్, రేషన్ కార్డులను అనుమతిస్తామని తన కౌంటర్ అఫిడవిట్‌లో ఈసీ అంగీకరించడాన్ని గుర్తుచేసింది. రేషన్ కార్డుల ఫోర్జరీ సులభమని పేర్కొంది. ఆధార్, ఓటర్ ఐడీలకు యదార్థత ఉన్నది కాబట్టి వాటిని అనుమతించాలని ఈసీకి సూచించింది. ఎస్ఐఆర్ లక్ష్యం ఓటర్లను ఉంటుంది కాబట్టి వాటిని అనుమతించాలని ఆదేశించింది. కాగా, ఈసీఐ తరఫున సీనియర్ న్యాయవాదులు కేకే వేణుగోపాల్, రాకేశ్ ద్వివేది హాజర య్యారు. ప్రతిపక్ష నాయకులైన పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. ఏడీఆర్ తరఫున శంకరనారాయణ్ వాదిస్తూ సరైన పత్రాలు లేని కారణంగా 4.5 కోట్ల మంది ఓటు వేయలేరన్నారు. జస్టిస్ బాగ్చీ స్పందిస్తూ 2003 నాటి ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్న ఓటర్లకు ఆధారాల ధ్రువీకరణ నుంచి మినహాయింపు కల్పిస్తామని ఈసీ అఫిడవిట్ పేర్కొన్నదన్నారు. ఓటర్ల జాబితాను ఈసీ ఖరారు చేయకుండా ఆదేశాలివ్వాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోరగా జస్టిస్ కాంత్ స్పందిస్తూ 'ఇది ముసాయిదా జాబితా. దీని వల్ల మనం అధికారాలు కోల్పోబోం' అని అన్నారు. అలాగే కేసు పూర్వపరాలను కోరారు.

ప్రజావాణి ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : ప్రజావాణి ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమ్మిళిత సమావేశంలో ఆయన మాట్లాడుతూ విపత్తు నిర్వహణకు సంబంధించి ఆయా శాఖలు వారి కార్యాచరణ ప్రణాళికను వారం రోజుల్లోగా సమర్పించాలని ఆదేశించారు. ప్రజావాణి ద్వారా స్వీకరించిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని, ఒకవేళ సమస్య పరిష్కారం కానట్లయితే సంబంధిత ఫిర్యాదు దారుకి తెలియజేయాలని, డివిజన్, మండల గ్రామస్థాయిలో సైతం ఇదేవిధంగా సమస్యల పరిష్కారా నికి చొరవ చూపాలని అన్నారు. కాగా ఈ సోమవారం 130 ఫిర్యాదులు రాగా, జిల్లా అధికారులకు 61, రెవెన్యూ శాఖకు 69 ఫిర్యాదులు వచ్చాయి. స్పెషల్ కలెక్టర్ సీతారామారావు, జిల్లా పరిశ్రమల మేనేజర్ కోటేశ్వరరావు, జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాలి

విశాలాంధ్ర - నేరేడుచర్ల : ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నేరేడుచర్ల నందు ప్రధానోపాధ్యాయులు బట్టు మధు నేతృత్వంలో సోమవారం ఉపాధ్యాయులు విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బట్టు మధు మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, ప్రపంచవ్యాప్తంగా పట్టణీకరణలో భాగంగా అడవుల నరికివేతతో ప్రకృతి సమతుల్యత దెబ్బతిని పర్యావరణా నికి చేటుఏర్పడి చివరికి మానవాళి మనుగడ ప్రశ్నార్థకంలో పడనుందని ఇట్టిపరిస్థితిని అధిగమించుటకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించా లని, విద్యార్థుల్లో ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన పెంచేందుకు, ఆహ్లాదకర వాతావరణం విద్యార్థుల్లో మెరుగైన ఆలోచనలకు దోహద పడుతుందని, పాఠశాలలో మొక్కలు విరివి గానాటుతూ, సంరక్షిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి వీరబాబు ఎన్ సైదులు రషీద్ ఖాన్ జానకిరాములు శౌరి వెంకటేశ్వరరావు మాధవి నాగమణి, ఎన్వి, వెంకటరెడ్డి, యాదగిరి, రామ్మూర్తి, బాలు శ్రీనివాసరావు, నగేష్, లాల్ సాహెబ్ సరస్వతి వెంకటేశ్వర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి

విశాలాంధ్ర బ్యూరో - సంగారెడ్డి : ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించా లని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డిఆర్ఓ పద్మజరాణి లకు ఫిర్యాదులను సమర్పించారు. కాగా రెవిన్యూ -15, పౌరసరఫరాలశాఖ 09, పంచాయత్ రాజ్ 09, డిఆర్డిఓ 09, వివిధ శాఖలకు సంబంధించి 12, మొత్తంగా 54 ఫిర్యాదులు అందాయి. ప్రజా ఫిర్యాదులను సంబంధిత అధికారులు పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పద్మజరాణి, జడ్పిసిఈఓ జానకిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - కొండమల్లేపల్లి : విధుల పట్ల నిర్లక్ష్యత వహిస్తున్న దేవరకొండ మండలం కొమ్మేపల్లి గ్రామ పంచాయతీ సెక్రెటరీ డి అనిత, దేవరకొండ డివిజన్లో ఉన్నటువంటి పంచాయతీ కార్యదర్శులు సరైన సమయపాలన విధుల పట్ల నిర్లక్ష్యత వహించడంపై జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ సోమవారం జిల్లా కలెక్టరుకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ పంచాయతీ సెక్రటరీలు విధుల పట్ల సమయపాలన పాటించకపోవడం, స్థానికంగా గ్రామాలలో ఉండకపోవడం వల్ల ప్రజలు మనోవేదనకు గురవుతున్నారని ప్రజలకు ప్రభుత్వాలకు మధ్య వారధిగా ఉండవలసిన వారే ప్రభుత్వంపై వ్యతిరేక భావన కలిగేలా చేస్తున్నారని తెలియజేశారు. ఇలాంటి వారిపై తక్షణమే విచారణ జరిపించి శాఖ పరమైన చర్యలు చేపట్టి ప్రజలకు న్యాయం చేయగలరని కోరారు. వారి వెంట వరికుప్పల శ్రీను ఆర్మీ, పున్న వెంకటేష్ నేత, రెడ్డి, కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

గడువు చెల్లిన ఎరువులు అమ్మితే చర్యలు : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : సారంగాపూర్ మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఎరువులు, విత్తనాల దుకాణాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లు, రసీదు పుస్తకాలు తదితరాలను పరిశీలించారు. వానాకాలం సాగు సమయంలో రైతులకు ఎరువులు, విత్తనాల అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రైతుల అవసరాల మేరకు సరిపడే నిల్వలు ఉండేలా పర్యవేక్షణ నిర్వహించాలని ఆదేశించారు. రైతులను మోసం చేసే చర్యలకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గడువు ముగిసిన, నాణ్యతలేని ఎరువులు లేదా విత్తనాలు విక్రయిస్తే సంబంధిత విక్రేతలపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ తనిఖీలో జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, సంబంధిత అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులు అంతర పంటలతో లాభాలను పొందాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : రైతులు అదనపు లాభాలు అర్జించాలంటే పత్తి పంట మధ్య మునగ సాగు చేయ్యాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. జిల్లాలోని రైతులకు వ్యవసాయం లాభదయకం కావడానికి కలెక్టర్ ఒక ప్రకటనలో సోమవారం అనేక సూచనలు చేసారు. ఈ సీజన్‌లో రైతులు శ్రమించి అంతర పంటలు వెయ్యాలన్నారు. ముఖ్యంగా మునగ సాగు గురించి గత ఏడాది అవగాహన కల్పించడంతో జిల్లాలో దాదాపు 100 ఎకరాల్లో మునగ సాగు జరిగిందన్నారు. అలాగే పత్తితో పాటు మునగను అంతరపంటగా వేసిన రైతుల సంఖ్య కూడా 300 ఎకరాలకు చేరుకుందన్నారు. ప్రస్తుతం రైతులు నాటిన పత్తి జనవరి-ఫిబ్రవరి మధ్య కాలంలో పంట తీసుకునే దశకు చేరుతుందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు విత్తనాలు, ప్లాస్టిక్ బ్యాగులు పొందవచ్చని తెలిపారు. ఇంటి వద్దే మట్టి, ఎరువుతో కలిపి వీటిలో విత్తనాలు నాటి రెండు మూడు నెలల్లో మంచి మొక్కలు తయారు చేయవచ్చన్నారు. ఆ మొక్కలను సెప్టెంబరు నాటికి వర్షాలు తగ్గిన అనంతరం పత్తి పొలాల మధ్యలో నాటితే అది పంటగా మేలుచేస్తుందని వివరించారు. ఉదాహరణకు వెయ్యి చెట్లు నాటి ప్రతి చెట్టును బ్రతికించుకుంటే రూ.2 లక్షల వరకు ఆదాయం పొందవచ్చని తెలిపారు. డ్రోన్ స్ప్రే వాడటం ద్వారా మందుల పిచికారీ, యూరియా స్ప్రే లాంటి పనులు సులభంగా చేయవచ్చన్నారు. యూరియా బస్తాల కోసం పోటీ చేయాల్సిన అవసరం లేకుండా నానో యూరియా వాడితే మొక్కలకు నేరుగా అవసరమైన పోషకాలు అందుతాయన్నారు. అలాగే బోర్ వెల్ పక్కన ఒక కుంటలో ఫామ్ పౌండ్ తవ్వించుకోవాలని సూచించారు. ఈ ఫామ్ పౌండ్‌ను కూడా ఉపాధి హామీ పథకం ద్వారా ఉచితంగా నిర్మించవచ్చన్నారు. చేపల పెంపకం కోసం ఎక్కువ ఎకరాలు తవ్వవలసిన అవసరం లేదన్నారు. ఒకే కుంటలో తక్కువ ఖర్చుతో చేపల పెంపకం చేపట్టి పది రెట్ల ఆదాయం పొందే అవకాశాలున్నాయని వివరించారు. మొక్కజొన్న పండించే రైతులు నీటి సౌకర్యం ఉంటే ఆయిల్ ఫామ్ సాగు చేయడం వల్ల సబ్సిడీలు పొంది పంట ద్వారా అత్యధిక లాభాలు పొందవచ్చాన్నారు. వెదురు సాగుపై కూడా రైతులు దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. ఒక ఎకరాలో సుమారు 160 మొక్కలు నాటి మూడు నాలుగు సంవత్సరాల్లోనే మంచి ఆదాయం పొందవచ్చన్నారు. మన జిల్లాలో దాదాపు 2.5 లక్షల మేకలు ఉన్నందున వాటి మేత అవసరాన్ని తీర్చేందుకు వెదురు చక్కటి లాభందయం అన్నారు. పట్టు, సెరికల్చర్ పై ఆదివాసీ రైతులు దృష్టి పెట్టాలని ఇందులో 90 శాతం సబ్సిడీ ప్రభుత్వం అందిస్తుందన్నారు. త్వరలోనే మేము ఈ అన్ని అవకాశాలపై ప్రత్యేకంగా శిక్షణ, అవగాహన కార్యక్రమాలు చేపట్టాబోతున్నట్లు చెప్పారు. ఇలా మన జిల్లా వ్యవసాయ అభివృద్ధికి తీసుకునే కీలక అడుగు ఇదే అవుతుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు అండగా నిలబడడం అభినందనీయం

విశాలాంధ్ర - తొర్రూరు: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు రమేష్ నాయక్ అండగా నిలవడం అభినందనీయమని తొర్రూరు ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య అన్నారు. మండలంలోని వెలికట్ట శివారు పెద్ద మంగ్య తండ గ్రామ పంచాయతీలో ఉన్న ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం ఆ గ్రామ మాజీ సర్పంచ్, శారద ఐటిఐ కళాశాల కరస్పాండెంట్ జాటోత్ శారద రమేష్ నాయక్ సహకారంతో పుస్తకాలు, నోట్ పుస్తకాలు, కుర్చీలను ఎంఈఓ బుచ్చయ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందన్నారు. పాఠశాలకు బీరువా, రెండు ఫ్యాన్లు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన సంతోష్, పాఠశాలలో మొక్కలు అందించిన రవి నాయక్, పాఠశాల, గుడి భూమి దాత చిన్న మంగ్యలను అభినందించారు. పంచాయతీ కార్యదర్శి నీరజ, పాఠశాల హెచ్ఎం మాలతి, ఉపాధ్యాయురాలు ప్రేమ దీపిక, స్థానికులు జాటోత్ రవి నాయక్, జాటోత్ చిన్న మంగ్య, జాటోత్ సంతోష్ నాయక్, తుకారం, అంగన్వాడీ టీచర్లు శాంతి, సుజాత పాల్గొన్నారు.

అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి

విశాలాంధ్ర - నేరేడుచర్ల : నేరేడు చర్ల మండల కేంద్రంలో వున్నటు వంటి రైస్ మిల్లులో సోమవారం ఎస్ఐ రవీందర్ నాయక్ ఆధ్వర్యంలో పాపిలాన్ ఫింగర్ ప్రింట్ డివైస్ ద్వారా వివిధ రైస్ మిల్లులలో పనిచేస్తున్న బయట రాష్ట్రాలకు సంబంధించిన కార్మికుల ఫింగర్ ప్రింట్ చెక్ చేయడమైనది. అనంతరం ఆయన మాట్లాడుతూ దీనిద్వారా వారి నేర చరిత్ర తెలుసుకొని నేరాలని కట్టడి చేయవచ్చు. కావున ప్రజలు అనుమానితులు కనిపిస్తే 100కు ఫోన్ ద్వారా గాని నేరుగా గాని పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. అలాగే గంజాయి వాడకం, రవాణా మీద కూడా నిఘా పెట్టినట్లు తెలిపారు. కావున తల్లితండ్రులు వారి పిల్లల పట్ల శ్రద్ధ చూపాలి అని హెచ్చరించారు. ఎవ్వరీ దగ్గరైన 50 గ్రాముల గంజాయి దొరికిన కూడా కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం అని అన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం : ఎమ్మెల్సీ

విశాలాంధ్ర - కొమురం భీం : సిర్పూర్ (టి) ప్రజాపాలన - ప్రగతి బాట ఆహార భద్రత, కొత్త రేషన్‌కార్డు పంపిణీ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, జిల్లా కలెక్టర్ సంతోష్ దోత్రే, జాయింట్ కలెక్టర్ డేవిడ్, కాగజ్నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా కలసి నూతన రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ గత 10 ఏళ్ల పాటు అధికారంలో ఉన్న ప్రభుత్వం పేదలకు రేషన్ కార్డులు ఇవ్వకుండా జాప్యం చేసిందన్నారు. నేడు ప్రజ ప్రయోజనాలకు అనుగుణంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తోందని, అర్హులైన ప్రతి పేదవాడికి రేషన్‌కార్డులు వస్తాయ న్నారు. పేద కుటుంబాల ఆర్థిక భారాన్ని తగ్గించడం కోసం ప్రభుత్వం నిత్యం పాటు పడుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు

విశాలాంధ్ర - సూర్యాపేట : బహిరంగంగా మద్యం తాగడం, బహిరంగ ధూమపానం చేయడం లాంటివి చట్టరీత్య నేరం అని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపినారు. ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలపై జిల్లా వ్యాప్తంగా నిఘా ఉంచాం అని, అక్రమ సిట్టింగ్‌లు, బహిరంగంగా మద్యం తాగడం, సిగరెట్ తాగడం లాంటి అసాంఘిక చర్యలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని ఎస్పీ హెచ్చరించారు. బహిరంగంగా మద్యం తాగడం, ఎదుటివారికి ఇబ్బంది కలిగించడం చేస్తే పట్టణ న్యూసెన్స్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తాం అన్నారు. మైనర్ పిల్లలకు మద్యం, పొగాకు ఉత్పత్తుల లాంటి మత్తు పదార్థాలను అమ్మవద్దు అని హెచ్చరించారు. వీటి వల్ల పిల్లలు చెడు వ్యసనాలకు అలవాటు పడి నేరాలకు పాల్పడే అవకాశం ఉన్నదని, పిల్లల భవిష్యత్తు అంధకారం అవుతుంది అని గుర్తు చేశారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి : సీఐ

విశాలాంధ్ర - ఇల్లందు : యువతరాన్ని పట్టి పీడిస్తున్న మహమ్మారుల్లో గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ టి.సురేష్ కోరారు. తెలంగాణ ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ (ట్రస్మా) రాష్ట్ర అధికార ప్రతినిధి సూరపనేని శేషకుమార్ మూడో వర్ధంతి సందర్భం గా సోమవారం స్థానిక సాహితీ డిగ్రీ కళాశాల ఆవరణలో సభ జరిగింది. ఇల్లెందు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ట్రస్మా ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నివారణ గురించి వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల ప్రారంభానికి సిఐ సురేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డ్రగ్స్ వాడినా, రవాణా చేసినా పెద్ద నేరం అవుతుందని సిఐ అన్నారు. ఈ సందర్భంగా సిఐ సురేష్‌ను పాఠశాలల యాజమాన్యాలు ఘనంగా సన్మానించారు. మున్సిపల్ మాజీ చైర్మన్, ట్రస్మా రాష్ట్ర నాయకులు దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వెంకటస్వామి, తుమ్మలపల్లి ప్రసాద్, డాక్టర్ సుధాకర్, యాదగిరి రాంబాబు, అర్వపల్లి రాధాకృష్ణ, సర్వేశ్వరరావు, రాం చందర్, మహేందర్, ఒంగూరి శ్రీను, రామకృష్ణ పాల్గొన్నారు.

గ్రీవెన్స్ దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్: జిల్లాలో వివిధ మండలాలు గ్రామాల నుండి గ్రీవెన్స్‌లో ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో రెవెన్యు అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్‌తో కలిసి గ్రీవెన్స్‌లో ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రీవెన్స్‌లో వివిధ శాఖలకు సంబందించి (169) దరఖాస్తుల వచ్చావని వాటిని సంబంధిత శాఖా అధికారులకు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు ఆయన తెలిపారు. ఈ ప్రజావాణిలో జెడ్.పి సీ ఈఓ పురుషోత్తం, డి.ఆర్.డి.ఓ మధుసూధనరాజు, డి.ఎం.ఇండస్ట్రీ శ్రీమన్నారాయణ, మైనారిటీ డెవలప్మెంట్ అధికారి, శ్రీనివాసరావు, శ్రీనివాస్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి దేశీరాం, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ కృష్ణవేణి, ఇంచార్జ్ డి.డబ్ల్యూఓ. శిరీష, డి.సి.ఓ వెంకటేశ్వర్లు, మత్స్య శాఖ అధికారి వీరన్న, ఎల్.డి.ఎం. యాదగిరి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ మదన్ మోహన్, భూభారతి కోఆర్డినేటర్ సురేష్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర బ్యూరో, మెదక్ : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండా లని కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. టేక్మాల్ మండలం ఎలకుర్తి, దనూర గ్రామాలలో విస్తృతంగా పర్యటించారు. గత సంవత్సరం డెంగీ, మలేరి యా కేసులు ఎక్కడ ఎక్కువ నమోదయ్యాయో ఆ ఏరియాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమలన్నీ నిర్మూలనకు ఫాగింగ్ చేపట్టాల న్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శారీరక పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వాసుపత్రిలో అన్ని రకాల మందుల నిల్వలు అందుబాటులో ఉంచాలని, ఆరోగ్య సిబ్బందిని అప్రమత్తం చేయాలని, ఇంటింటికి ఆరోగ్య సర్వే వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రజా వాణిలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు వినతులను సమర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ వినతులను పరిష్కరించడంలో వివిధ శాఖల అధికారులు బాధ్యత యుతంగా పని చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్డిఓ భుజంగరావు, డిఆర్డీఓ శ్రీనివాస్‌రావు తదితరులున్నారు.

డ్రైనేజీల్లో చెత్తను తొలగించాలి

విశాలాంధ్ర - చర్ల: స్థానిక సంస్థల అధ్యర్వంలో చేపట్టిన పలు డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని బీజేపీ మండల అధ్యక్షులు నూప రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైనేజీ నీరు ప్రవహించడానికి సరైన అవగాహన లేకుండా నిర్మాణం చేయడం వల్ల ప్రజా ధనం వృధా అవుతుందన్నారు. లింగపురం గ్రామ పంచాయితీ పరిధిలోని మసీదు ఎదురుగా గత వేసవిలో నిర్మించిన డ్రైనేజీ దోమల ఉత్పత్తి కేంద్రంగా తయారైందని విమర్శించారు. రెండు వీధుల నుండి వచ్చిన నీరు నూతన డ్రైనేజీలో పేరుకుపోయి స్విమ్మింగ్ పూల్‌ను తలపిస్తోందన్నారు. వర్షపు నీరు, మురికి నీరు, డ్రైనేజీలో నిల్వ ఉండటం మూలాన ఈగలు, దోమలు ఉత్పత్తి అధికమైందన్నారు. తద్వారా ప్రజలకు మలేరియా టైఫాయిడ్ డెంగ్యూ వంటి జ్వరాలు, అంటువ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మేల్కొని డ్రైనేజీని శుభ్రం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ బాబా ఫహీం, జిల్లా కార్యవర్గ సభ్యులు గూనూరి రమణ, మండల ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి ఇర్పా సుబ్బారావు, తరుణ్ రెడ్డి, చింతూరి విశ్వనాథం, బందా మధు, సంద్రుగొండ వేంకటేశ్వరరావు కోర్సా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు గొడుగులు పంపిణీ

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : కొత్తగూడెంలోని విద్యాధరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని గంగమ్మ కాలనీ, క్రాంతి నగర్ గ్రామాలలో నివసించే ఆదివాసి ప్రజలకు లక్ష్మీదేవిపల్లి బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు కొట్టి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యాధరి ఫౌండేషన్ బాధ్యులు మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో ఆదివాసులు సౌకర్యం కోసం గొడుగులను పంపిణీ చేసినట్లు వివరించారు. వర్షంలో తడవడం వలన సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశాలు ఉంటాయన్నారు. నిరుపేదలైన ఆదివాసుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని గొడుగులను పంపిణీ చేసినట్లు తెలిపారు. గొడుగులు అవసరం ఉన్నవారు సమాచారం ఇస్తే ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే విధంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు ఆత్మ సంతృప్తి కలిగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాధరి ఫౌండేషన్ సభ్యులు రవీందర్, రాజేష్ ఖన్నా, కృషి కుమార్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ మంచి అవకాశం...

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ పరిస్థి తుల కారణంగా పాఠశాల స్థాయిలోనే చదువును మానేసిన వారికి లేదా పదోతరగతి పూర్తయిన తర్వాత ఇంటర్మీడియట్ చదవాలనుకునే వారికీ తెలంగాణ రాష్ట్ర ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) చదువుకునే మంచి అవకాశాన్ని కల్పిస్తోందని జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ అన్నారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ బాధ్యులు రూపొందిం చిన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ విధానంలో చేరినవారు తమ ఉపాధి మార్గాలను వదులుకోకుండా ఖాళీ సమయాల్లో పాఠ్యాంశాలను అధ్యయనం చేస్తూ, పరీక్షలలో ఉత్తీర్ణులై ప్రామాణికమైన విద్యార్హతను పొందవచ్చని వేణుగోపాల్ అన్నారు. రెగ్యులర్ పాఠశాలల్లో చదివినవారి సర్టిఫికెట్లతో సమానమైన గుర్తింపు ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్లు కలిగి ఉంటాయన్నారు. ఓపెన్ విధానంలో కేవలం ఐదు సబ్జెక్టులతో పదోతరగతి లేదా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించవచ్చన్నారు. ఇంటర్మీడియట్‌ను ఒకే సంవత్సరంలో పూర్తిచేసుకునే అవకాశమూ ఉంటుందనీ వివరించారు. ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్ పొందేందుకు 2025 ఆగస్టు 31 నాటికి 14 ఏళ్ళు నిండినవారు 10 వ తరగతికి అర్హులు కాగా 15 ఏళ్ళు నిండిన వారు ఇంటర్మీడియట్‌కు అర్హులన్నారు. వయస్సు ధృవీకరణ పత్రంగా టి.సి, రేషన్ కార్డు లేదా సంబంధిత అధికారులిచ్చిన పుట్టినతేదీ ధృవీకరణ పత్రం సరిపోతుందని తెలిపారు. అపరాధ రుసుము లేకుండా దరఖాస్తులు 31 జూలై 2025 లోపు స్వీకరించబడతాయన్నారు. అనంతరం 1 ఆగస్టు నుండి 28 ఆగస్టు వరకు అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి గలవారు మరిన్ని వివరాలకు కోసం www.telanganaopenschool.org వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని తెలిపారు. లేదా ఉమ్మడి ఖమ్మం జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావును సెల్ నెంబర్ 8008403522 కు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విద్యా చందన, మద్దినేని పాపారావు, జిల్లా వైద్యశాఖ అధికారి జయలక్ష్మి, డిప్యూటీ జెడ్పి సీఈవో చంద్రశేఖర్, పరిశ్రమల శాఖ అధికారి పృథ్వి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో

ఇల్లందులో పోలీసుల తనిఖీలు

విశాలాంధ్ర - ఇల్లందు : తెలంగాణ రాష్ట్ర కమిటీ మావోయిస్టు వారోత్సవాలు సోమవారం నుంచి ఆగస్టు 3 వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అనాదిగా కొనసాగుతున్న ఈ వారోత్సవాలను ఈ దఫా కూడా మావోయిస్టులు ప్రతిష్టగా నిర్వహిస్తున్నట్లు తెలుస్తుంది. ఈ మధ్యకాలంలో కేంద్ర బలగాల దాడులతో కేంద్ర, రాష్ట్ర కమిటీ నాయకులను, వందలాది మంది క్యాడర్ ను కోల్పోయి మావోయిస్టు పార్టీ చాలా బలహీన పడిందని భావిస్తున్నారు. ఈ క్రమంలో వారోత్సవాలను ఘనంగా నిర్వహించి తమ క్యాడర్‌లో మనోబలాన్ని, పూర్వ వైభవాన్ని పాదుగొలపాలని మావోయిస్టు నేతలు ఈ కార్యాన్ని ప్రతిష్టగా తీసుకున్నారు. దీంతో జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమయింది. జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాలతో ఇల్లందు డిఎస్పి ఎన్.చంద్రభాను ఆధ్వర్యంలో సోమవారం సీఐ టి. సురేష్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో పూర్తిస్థాయి తనిఖీలు నిర్వహించారు. అనుమానం ఉన్న వ్యక్తులను వివరాల అడిగి తెలుసుకున్నారు. స్థానిక కొత్త బస్టాండ్ ఏరియాలో పలు షాపులను తనిఖీ చేసి కొత్తవారు సంచరిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా సిఐ సురేష్ మాట్లాడుతూ మావోయిస్టు వారోత్సవాల సందర్భంగా పటిష్ట భద్రత చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు ఎస్కే హసీనా, శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాలి : ఏఎస్పీ

విశాలాంధ్ర - భద్రాచలం : రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రజలకు నిత్యం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఏ.ఎస్.పి విక్రాంత్ కుమార్ సింగ్ ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. భద్రాచలం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ముందుగా పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తించే సిబ్బంది ఆయనకు గౌరవ వందనం నిర్వహించారు. విధులు నిర్వర్తించే సిబ్బందికి చెందిన ప్రభుత్వ కిట్ ఆర్టికల్స్‌ను ఏఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేస్తూ పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవాలన్నారు. అనేక సమస్యలతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించారు. వర్టికల్స్ వారీగా విధులు నిర్వర్తించే సిబ్బంది పనితీరును పరిశీలించారు. మద్యం సేవించి వాహనాలను నడుపుతూ పట్టుబడిన వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు, సిబ్బందికి సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆవరణలో ఏఎస్పీతో పాటు అధికారులు, సిబ్బంది మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ట్రాఫిక్ ఎస్సై తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారం సత్వరమే పూర్తి చేయాలి

విశాలాంధ్ర బ్యూరో- పెద్దపల్లి: అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించా లని అదనపు కలెక్టర్ డి.వేణు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా అదనపు కలెక్టర్ డి.వేణు సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. గోదావరిఖని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన సామాజిక కార్యకర్త బి.వంశీకృష్ణ గోదావరిఖనిలో గల్లీకి ఒక బెల్టు షాపు కొనసాగుతుందని, ఆర్టిఐలో తనకు తప్పుడు సమాచారం అందించారని, మున్సిపల్ కార్పోరేషన్ పర్యాటక కేంద్రాలు పర్మిట్ రూమ్‌లు ఉండకూడదు అనే ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా రామగుండం కార్పొరేషన్ పెద్దపల్లి మంథని సుల్తానాబాద్ మున్సిపాలిటీలో వైన్ షాపులకు అనుబంధంగా భారీ విస్తీర్ణంలో పర్మిట్ రూములు ఏర్పాటు చేశారని, బెల్ట్ షాప్‌లోను నిర్మూలించడంతో పాటు తప్పుడు సమాచారం అందించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా అభ్కారి శాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. రామగుండం నగరం ఇందిరానగర్‌కు చెందిన కల్లూరు వెంకటి తనకు తన ఇద్దరు ఆడపిల్లలు పట్టించుకోవడం లేదని, తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పెద్దపల్లి ఆర్డీవోకు రాస్తూ పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన బృందావన్ కాలనీ వాసులు తమ నివాసాల సమీపంలో ఉన్న రైస్ మిల్స్ బూడిద దుర్వాసన వెదజల్లే పొగను వ్యర్థ జలాలను నిర్లక్ష్యంగా విడుదల చేస్తున్నాయని, దీనివల్ల బృందావన్ కాలనీలో నివసించే ప్రజలు అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని, తమ సమస్యకు పరిష్కారం చూపాలని కొరుతూ దరఖాస్తు చేసుకోగా పెద్దపల్లి ఆర్డీవోకు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు.

సంపాదకీయం

ఎన్నికల కమిషన్‌కు దిక్కేది!

బీహార్‌లో జరుగుతున్న ప్రత్యేక లోతైన ఓటర్ల జాబితా సవరణపై సోమవారం సుప్రీంకోర్టులో జరగవలసిన విచారణ జరగలేదు. కానీ ఆధార్‌కార్డ్, రేషన్ కార్డ్, ఓటర్ గుర్తింపు కార్డును ఓటర్లను గుర్తించడానికి ప్రామాణికంగా స్వీకరించాలని సుప్రీంకోర్టు ఎన్నికల కమిషన్‌కు స్పష్టమైన ఆదేశాలు చేసింది. కిందటి సారి విచారణ జరిగినప్పుడు ఈ మూడు పత్రాలను ప్రామాణికంగా పరిగణించవచ్చు కదా అని సుప్రీంకోర్టు సూచించింది. అన్ని సందర్భాలలో సుప్రీంకోర్టు నికరమైన ఆదేశాలు జారీ చేయకపోవచ్చు. సాధారణంగా సుప్రీంకోర్టు ప్రస్తావించే అంశాలను, వ్యాఖ్యలను ఆదేశాలుగానే చూస్తారు. కానీ బీహార్ ఓటర్ల జాబితాను సవరించే పేరున ఎన్నికల కమిషన్ నిజానికి కొత్తగా ఓటర్ల జాబితా రూపొందిస్తోంది. దాదాపు 52 లక్షల మందిని ఓటర్ల జాబితాలోంచి తొలగించే ప్రమాదం ఉంది. ఈ విషయమై మీడియాలో, బీహార్ ప్రజల్లో గగ్గోలు బయలు దేరింది. ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేయించుకోవాలంటే ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటర్ గుర్తింపు కార్డును ప్రామాణికంగా పరిగణించబోమని ఎన్నికల కమిషన్ పేర్కొంది. మరో 11 పత్రాలలో ఏదో ఒకటి చూపించాలని పట్టుబట్టింది. అసలు ఆంతర్యం ఏమిటంటే ఓటర్ల జాబితా ప్రక్షాళన పేరుతో కొందరు ఓటర్ల పేర్లను కొత్తగా తయారు చేసే జాబితా నుంచి తొలగించడమే. బీహార్‌లోనూ అక్రమంగా వలస వచ్చిన వారు ఉన్నారని వారి పేర్లు తొలగించాలని ఎన్నికల కమిషన్ పట్టుదలతో ఉంది. అక్రమంగా వలస వచ్చినవారంటే మోదీ ప్రభుత్వం దృష్టిలో బంగ్లాదేశ్ నుంచి వచ్చిన ముస్లింలే. వివిధ రాష్ట్రాలలో ఏదో ఓ రకంగా ముస్లింల మీద మోదీ ప్రభుత్వం గురి పెట్టింది. వారిని సక్రమ పద్ధతి ఏదీ అనుసరించకుండా బలవంతంగా బంగ్లాదేశ్‌లో ప్రవేశపెడ్తోంది. అదీ దొంగ చాటుగా. ఇదే పని బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణ పేరుతో జరుగుతోంది. ఓటర్ల జాబితా సవరణకు, ప్రజలు తమ పేర్లు ఓటర్ల జాబితాలో నమోదు చేయించుకోవడానికి ఇచ్చిన గడువు చాలా స్వల్పం. ఎక్కడైనా ఓటర్ల జాబితాలో లోపాలు ఉన్నాయనుకుంటే పరిమిత ప్రాంతంలో ఓటర్ల జాబితా సవరించే అధికారం ఉంది తప్ప రాష్ట్రమంతటా ఈ పని చేపట్టే అధికారం ఎన్నికల కమిషన్‌కు లేదన్న వాదనలు బలంగా వినిపించాయి. ఓటు హక్కు లేకుండా చేస్తున్నారన్న ఆందోళన మొదలైంది. జాబితా సవరించే పేరుతో ఎన్నికల కమిషన్ అనుసరిస్తున్న విధానంలో లోపాలను కొన్ని మీడియా సంస్థలు ఎండగట్టాయి. యూ ట్యూబ్ లో సమాచారం అందించే అజిత్ అంజుం అయితే ఏకంగా బీహార్‌లోని అనేక ప్రాంతాలలో పర్యటిస్తూ ఈ అవకతవకల బండారాన్ని బయట పెట్టారు. ఎన్నికల కమిషన్ ఆయన మీద ఎఫ్ఐఆర్ దాఖలు చేసింది. దైనిక్ భాస్కర్ పత్రిక కూడా ఎన్నికల సంఘం అనుచిత ప్రవర్తనను వెల్లడించినా ఏ చర్యా తీసుకోలేదు. ఓటర్ల జాబితా సవరణ నెపంతో ఎన్నికల కమిషన్ పౌరులు ఎవరో కానివారు ఎవరో తేల్చే పని పెట్టుకుంది. నిజానికి పౌరసత్వ నిర్ధారణ ఎన్నికల కమిషన్ పరిధిలోనిది కాదు. ఆ వ్యవహారం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ చూసుకోవలసిన అంశం. దీనిబట్టి ఓ నిర్దిష్ట మతం వారికి ఓటు హక్కు లేకుండా చేయడానికి ఎన్నికల కమిషన్ సాహసించింది. ఎన్నికల కమిషన్ రాజ్యాంగ వ్యవస్థ. ప్రభుత్వాలు వస్తాయి, పోతాయి. ఎన్నికల సంఘం ఎప్పుడూ ఉండవలసిన వ్యవస్థ. అయితే సకల వ్యవస్థలను మోదీ ప్రభుత్వం లొంగదీసుకుని వాటిని నిర్వీర్యం చేస్తోంది. బీహార్‌లో లాగే దేశమంతా ఇదే పద్ధతిలో ఓటర్ల జాబితా సవరిస్తామని ఎన్నికల కమిషన్ చెప్తోంది. ఇది ముస్లింల మీద మోదీ ప్రభుత్వం కొనసాగిస్తున్న విద్వేషానికి కొనసాగింపే.

ఈ దాష్టీకాన్ని ఎదిరించడానికి అనేక మంది సుప్రీంకోర్టు మెట్లెక్కారు. సాధారణంగా ఎన్నికల కమిషన్ వ్యవహారాలలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోదు. కానీ ఓటు హక్కుని హరించే ప్రయత్నాలు జరుగుతున్నప్పుడు విచారించక తప్పలేదు. సోమవారం ఈ అంశంపై విచారణ అయితే జరగలేదు. ఈ పిటిషన్‌ను విచారిస్తున్న న్యాయమూర్తులు సూర్యకాంత్, జయ్‌మాల్యా బాగ్చీ ప్రధాన న్యాయమూర్తి ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరు కావలసి వచ్చినందువల్ల విచారించే అవకాశం లేకుండా పోయింది. ఇంతకు ముందు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటర్ గుర్తింపు కార్డును ఓటర్ల గుర్తింపునకు ప్రామాణికంగా తీసుకోవచ్చుగదా అని సుప్రీంకోర్టు చేసిన సూచనను ఎన్నికల కమిషన్ పాటించకపోగా ఈ పత్రాలను అంగీకరించబోమని తెగేసి చెప్పింది. సోమవారం ఈ విషయం ప్రస్తావనకు వచ్చినప్పుడు న్యాయమూర్తులు ఈ మూడు పత్రాలను ప్రామాణికంగా తీసుకోవాల్సిందేనని స్పష్టంగా చెప్పారు. ఇది నిజానికి ఎన్నికల కమిషన్‌కు ఎదురు దెబ్బే. ఈ పత్రాలను అక్రమ పద్ధతుల్లో కూడా సంపాదించవచ్చు కనక అవి చెల్లవని ఎన్నికల కమిషన్ తరఫు న్యాయవాది రాకేశ్ ద్వివేదీ వాదించారు. అలా అయితే ఎన్నికల కమిషన్ అడుగుతున్న 11 పత్రాలు కూడా నకిలీవి ఉండొచ్చు కదా అని న్యాయమూర్తులు ఎదురు ప్రశ్న వేశారు. దీనికి ఎన్నికల కమిషన్ దగ్గర సమాధానం లేదు. ఈ రోజే బీహార్ ఓటర్ల జాబితా సవరణను సవాలు చేస్తున్న పిటిషన్‌పై తీర్పు వస్తే బాగుండునని రెండు పక్షాల వారూ భావించారు. కానీ అసలు విచారణే జరగలేదు. కనీసం తాత్కాలిక ఉత్తర్వులైనా జారీ చేయడానికి వీలులేకుండా పోయింది. ఈ కేసు వెంటనే తెమిలేటట్టు కనిపించడం లేదు. నవంబర్ మధ్యలోకెల్లా బీహార్ శాసనసభ ఎన్నికలు జరగవలసి ఉంది. సాధారణంగా ఎన్నికల ప్రక్రియలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోదు. కానీ పౌరసత్వం నిర్ధారించే అధికారం ఎన్నికల కమిషన్‌కు ఉందా లేదా, లోపాలను సరిదిద్దే మిషతో రాష్ట్రమంతటా ఓటర్ల జాబితా సవరించే అధికారం ఉందా లేదా అని తేల్చాల్సింది సుప్రీంకోర్టే. మంగళవారం ఈ అంశంపై విచారణ జరగొచ్చు. కానీ ఉభయ పక్షాలు తమ వాదన వినిపించడానికి ఎంత సమయం పడ్తుందో, తీర్పు వెంటనే వెలువడుతుందో లేదో చెప్పలేం. ప్రత్యేక నిశిత ఓటర్ల జాబితా అంశంపై ఎన్నికల కమిషన్ ఇటీవలే 780 పేజీల ప్రమాణ పత్రం సమర్పించింది. దీనిమీద సుప్రీంకోర్టు ఎలాంటి ఆంక్షలూ విధించలేదు. ఎన్నికల కమిషన్ తమ సూచనలను పాటించలేదన్న అంశాన్ని సుప్రీంకోర్టు గమనించినట్టే కనిపిస్తోంది. అందుకే సోమవారం తాము సూచించిన మూడు పత్రాలను కూడా ఓటర్ల జాబితాలో చేర్చడానికి ప్రామాణికంగా తీసుకోవాలని న్యాయమూర్తులు ఆదేశించారు. ఎన్నికల కమిషనే జారీ చేసిన ఓటరు గుర్తింపు కార్డును కూడా ప్రామాణికంగా ఒప్పుకోకపోవడం ఎన్నికల కమిషన్ మంకు పట్టుకి నిదర్శనం. సుప్రీంకోర్టు విచారణవల్ల బీహార్ శాసనసభ ఎన్నికలకు ఏ ఆటంకమూ ఉండకపోవచ్చు కానీ ఎన్నికల కమిషన్ పరిధులపై నిర్ణయం వెలువరించవచ్చు. ఆ నిర్ణయం ఎన్నికల కమిషన్‌కు ప్రతికూలంగా ఉంటే దిక్కేది!

పిట్ట పోరు - పిల్లి తీర్పు

చింతపట్ల సుదర్శన్

రెండు కొండల మధ్య ఆకాశం నుదుటి మీద ఎర్రని బొట్టులాగున్నాడు సూర్యుడు. నల్ల దుప్పటి కప్పుకున్న చీకటి, దుప్పటి విసిరేసి పారిపోతున్నది. ఇళ్ల మీద వెలుతురు పూవు విచ్చుకుంటున్నది. డాగీ మంచి నిద్రలో ఉంది. కుక్క బతుక్కు దేవుడనే వాడెవడో బహుమానంగా అంటగట్టిన డ్యూటీ తెల్లవార్లూ మొరుగుతూ కాపలాకాయడమే కదా. చీమ చిటుక్కుమన్నా తెల్లవార్లు అరిచి అరిచి అలసిపోయిన డాగీ తెల్లారుఝామున కంటి నిండా నిద్ర పోతున్నది. గోడకు ఆనుకుని చల్లగాలికి పట్టిన నిద్ర నుంచి బయటకు రాకూడదని అనుకుంది డాంకీ. అనుకున్నవి అనుకున్నట్లు అయితే 'ఎవరైనా ... జిందగీ' అని విసుక్కోవలసిన పని ఉండదు కదా. ఉలిక్కిపడి కళ్లు తెరిచింది డాంకీ 'ఎంత హీనమూ ఈ గాడిద బతుకు' అనుకుంటూ. పాత కొంప లోపల్నించి వీరావేశంగా అరుస్తున్నవి రెండు పిల్లులు. ఒకటి ప్రశ్న వేస్తున్నట్టు మరొకటి జవాబిస్తున్నట్టు శబ్దావధానం చేస్తున్నవి. ఎవడవురా అంటే ఎవడవురా అని ఎంతరా అంటే నువ్వెంతరా అని శ్రుతినీ లయనీ మార్చి మార్చి, సౌండును తగ్గించీ, హెచ్చించీ అదే పనిగా

రంగస్థలం

ఆ పిల్లులు అరిచి 'గీ' పెడుతుండటంతో కళ్లు తెరిచిన డాంకీ, డాగీ వైపు చూసింది. ఇంత గోల గత్తర జరుగుతున్నా ఇది లేవదేం అనుకుంది. పాపం తెల్లవార్లూ మొరిగి అలసిపోయి ఉంటుంది అనుకుంది. అవతల మార్జాల యుద్ధం కంటిన్యూ అవుతున్నది. డాంకీకి చెవులు చిల్లుపడతాయేమో ననిపించింది. ఈ పిల్లుల యుద్ధానికి 'సీజ్ ఫైర్' ఎలా అని ఆలోచించింది. గాడిదలు చెయ్యాల్సిన పని, కుక్కలు చేయాల్సిన పని మనుషులు చేయాల్సిన పని అని పని విభజన జరిగింది కదా. పిల్లుల్ని శాంతింపచేయడం తన పని కాదని, వల్లకాదని అనుకుంది డాంకీ. పైగా రెండు పిల్లుల్లో రంగు భేదం, జాతి భేదం కూడా ఉన్నట్టున్నాయి కనుక వాటిని శాంతింప చేయడానికి 'డాగీ' నే సరైనదని భావించి తప్పనిసరై డాగీ! డాగీ! మై డియర్ డాగీ అని అరిచింది. ఆ అరుపులకు వాటికి జతగా పిల్లుల అరుపులకు కళ్లు తెరిచింది డాగీ.

ఏంటి జంటిల్ డాంకీ ఇది నీకు తగునా, కాస్త కునుకుపడితే ఓర్చుకోలేవా? అంది డాగీ సణుగుతూ. సారీ తమ్ముడూ. నిన్ను నిద్రలేపక తప్పని పరిస్థితి వచ్చింది. లోపలి గదిలో రెండు పిల్లులు హోరాహోరీ పోరాటం చేస్తున్నవి. వాటి ఉరుములూ, మెరుపులకి బస్తీలో ఉన్న వాళ్లంతా నిద్రలేచి విసుక్కుంటున్నట్టున్నారు. నువ్వే ఈ టైంలో ఆదుకోవాలి. ఆ రెండింటి మధ్య సయోధ్య వచ్చేట్టు చూస్తావో, అదిరించి, బెదిరించి పారదోలుతావో నీ ఇష్టం. నువ్విప్పుడు పట్టి కంట్రీ డాగ్‌వి కాదు. లోకాన్ని, లోకంలో దేశాల్ని కొట్టుకోకుండా ఉద్ధరించే వాడివి. అందరికీ పెద్దన్నవీ, అంకుల్‌వీ కూడా. ఈ రెండు పిల్లుల పోరు ప్రపంచ యుద్ధం కాకుండా కాపాడగలిగిన శక్తివి నీవే అని డాగీని మునగచెట్టు ఎక్కించింది డాంకీ.

నాలుక్కాళ్ల మీద లేచి నిలబడి సింహంలా జూలు దులిపి ఆవులించింది డాగీ. ఒళ్లు విల్లులా వంచి సాగదీసి,తోకని నిటారుగా నిలబెట్టి, ఈ మధ్య చీటికి మాటికీ ఏదో ఒక దానికి గిల్లికజ్జాలు పెట్టుకుంటున్నవివి. ఇక్కడ నేను ఉన్నానన్న భయం లేకుండా పోయింది అంటూ లోపలి గదిలోకి ఉప్పెనలా ఉరికింది డాగీ. అప్పటి నుంచీ అరిచి అరిచి 'టైరై' పోయేయో, లేక డాగీ నోటికి తమ తోకలు అందుతాయని భయపడ్డయోకాని రెండు పిల్లులూ, కాళ్ల సందున తోకలు దాచేసుకుని గోడ ఎక్కి అవతలి పక్క దూకి పారిపోయేయి. నిజానికి డాగీ చేసిందేమీలేదు కాని తన కారణంగానే అవి యుద్ధ విరమణ చేశాయని సగర్వంగా తల ఎత్తుకు బయటకు వచ్చింది డాగీ.

అప్పటికే మార్నింగ్ వాక్‌కి వచ్చిన అబ్బాయి అరుగు మీద కూచుని ఉన్నాడు. విషయం ఏమిటో డాంకీ, అబ్బాయికి చెప్పేసింది. డాగీని చూస్తూ మంచి పని చేశావు డాగీ. ఈ పిల్లుల గోల మా 'డాబా' మీద కూడా రోజూ మమ్మల్ని నిద్ర పోనివ్వడం లేదు అన్నాడు అబ్బాయి. ఎక్కడ పిల్లుల పోరు జరిగినా నన్ను పిలవండి. కిక్కురుమనకుండా చేసి పారేస్తాను అంది డాగీ చెవులు ఎగరేస్తూ. అబ్బ ప్రపంచ శాంతి కోసం నువ్విచ్చిన హామీ చూస్తే ముచ్చటేస్తుంది డాగీ. నీకు 'నోబెల్' ప్రైజు ఇవ్వాలసలు. నోబెల్ ప్రైజు అనగానేమిటో అంది డాగీ హుషారుగా. అంటే మరేం లేదు డాగీ తంపులు పెట్టటం తమాషా చూడడం. కొట్టుకునే వాళ్లని కొట్టుకోనిచ్చి, తర్వాత మధ్యవర్తిత్వం చేయడం. ఇది చేసిన వాళ్లని ప్రపంచ శాంతిదూత అనాలని, వాళ్లకి నోబెల్ శాంతి పురస్కారం ఇవ్వాలని అడిగే వాళ్లడుగుతున్నారు అన్నాడబ్బాయి.

పురస్కారం అంటే గుర్తు వచ్చింది. ఈ మధ్య మన నాయకుడొకరు ఏదో ఒక లేఖ పట్టుకుని ఇదే నా లైఫ్ టైం అఛీవ్‌మెంట్ అవార్డు అని. ఇదే ఆస్కారు అవార్డు అని అన్నాడు కదా అంది డాంకీ. అవును అవార్డులు ఊరికే రావు, అడుక్కోవాలి లేదా లాక్కోవాలి, లేదా ఇలాగ ఏదో ఓ వంకతో వచ్చినట్టే అని సంతోషపడాలి అన్నాడు అబ్బాయి.

ఇవాళ నేను చేసిన పనికి లైఫ్ టైం అఛీవ్‌మెంట్ అవార్డు, ఆస్కార్ అవార్డూ, నోబెల్ శాంతి పురస్కారమూ ఇవ్వాలి నాకు అంది డాగీ.

దక్షిణాఫ్రికా ఎన్నికల బరిలో తొలిసారిగా కమ్యూనిస్టు పార్టీ

సబీనా ఫ్రైస్

ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఎఎన్‌సీ) ఎన్నికల వ్యూహాలు ఆమోదయోగ్యం కాదని భావించిన సౌత్ ఆఫ్రికన్ కమ్యూనిస్టు పార్టీ (ఎస్ఏసీపీ) కొత్త వ్యూహాన్ని ఎంచుకుంది. జాతి వివక్షతను అంతం చేయడానికి 1920లలో జాతీయ విముక్తి పోరాటం నుంచి ఉద్భవించిన త్రైపాక్షిక కూటమి సభ్యులు భుజం భుజం కలిపి పోరాడారు. ఈ కూటమిలో సౌత్ ఆఫ్రికన్ కమ్యూనిస్టు పార్టీ (ఎస్ఏసీపీ), ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఏఎన్‌సీ), కాంగ్రెస్ ఆఫ్ సౌత్ ఆఫ్రికన్ ట్రేడ్ యూనియన్స్ (సీఓఎస్ఏటీయూ) ఉన్నాయి. దశాబ్దాలుగా పోరాటంలోనే కూటమి ఐక్యత పరిఢవిల్లింది. అలాంటి సైద్ధాంతిక కలయికలు ఎన్నికల సమన్వయానికి పునాదిగా అభివృద్ధి చెందాయి. 1994 నుంచి ఎస్ఏసీపీ, సీఓఎస్ఏటీయూ(కొసాటు) పోటీ చేయకుండా ఎన్నికలలో ఏఎన్‌సీ మాత్రమే పోటీ చేసేందుకు అనుమతించేలా ఏర్పాటు జరిగింది. ద్వంద్వ సభ్యత్వం కలిగిన సభ్యులను ప్రభుత్వంలో ఏఎన్‌సీ ప్రతినిధులుగా కూర్చోవడానికి అనుమతించారు. అయితే, 2026లో ఒక ఎన్నికల మొదటి సంఘటన జరగబోతుంది. అది కమ్యూనిస్టు పార్టీ తన సొంత పేరుతో పోటీ చేయబోతోంది.

దక్షిణాఫ్రికాలో సామ్యవాదాన్ని సాధించాలనే ఉమ్మడి నిబద్ధతతో నేషనల్ డెమొక్రటిక్ రివల్యూషన్ (జాతీయ ప్రజాస్వామ్య విప్లవం ఎన్‌డీఆర్) సాధన అనే కూటమి విస్తృత లక్ష్యం కూటమి సభ్యులను కలిపి ఉంచింది. ఈ ఐక్య పోరాటం కొనసాగాలని ఎస్ఏసీపీ కోరుకుంటోంది. జాతి వివక్షను ధ్వంసం చేసిన తరువాత దేశాన్ని స్థిరీకరించడం, ఏకం చేయడం కోసం జాతీయ ప్రజాస్వామిక విప్లవం పట్ల బలమైన నిబద్ధత 'జాతీయ ప్రజాస్వామ్య దశ'ను కూటమికి తక్షణ ప్రాధాన్యత చేసింది. సౌత్ ఆఫ్రికా యంగ్ కమ్యూనిస్ట్ లీగ్ మోసెస్ మఖిదా ప్రొవిన్షియల్ సెక్రటరీ అయండా జులు ఇలా పేర్కొన్నారు: "మా ఎన్‌డీఆర్ మొదటి దశలో, ఏఎన్‌సీ నేతృత్వంలోని ప్రభుత్వం ప్రధానంగా నీరు, విద్యుత్, గృహ నిర్మాణం, ఆరోగ్యం, విద్యను అందుబాటులోకి తీసుకువచ్చే గొప్ప పని చేసింది. అయితే, ఆర్థిక వ్యవస్థను కార్మిక వర్గం చేతుల్లోకి మార్చడంలో ఏఎన్‌సీ విఫలమైంది. నయా ఉదారవాద విధానాలు ఇప్పుడు అన్ని లాభాలను తిప్పికొడుతున్నాయి.

బడ్జెట్ కోతలు ఆరోగ్యం, విద్య, ప్రాథమిక సేవలను అందించడంపై ప్రభావం చూపుతున్నాయి. ఇప్పుడు పోరాటం మారిందని స్పష్టమవుతోంది. ఎస్ఏసీపీ, ఏఎన్‌సీ విధానాల మధ్య వైరుధ్యాలు పెరగడంతో ఇప్పుడు పోరాటం మారినట్లు స్పష్టమవుతోంది. ఏఎన్‌సీ విస్తృత రాజకీయ కూర్పు దీర్ఘకాలంగా కూటమిపై అనిశ్చితిని సృష్టించింది. 1988లో ఎస్ఏసీపీ మాజీ ప్రధాన కార్యదర్శి జో స్లోవో చెప్పినట్లుగా: 'కార్మిక వర్గ దీర్ఘకాలిక సామ్యవాద ఆకాంక్షలను తిరస్కరించే శక్తులతో కూటమి ఎప్పుడూ సమస్యలు లేకుండా లేదా ఉద్రిక్తత లేకుండా ఉండదు.' గత సంవత్సరం ఎన్నికల ఫలితాల తరువాత మొదటిసారిగా మెజారిటీని కోల్పోవడంతో ఏఎన్‌సీ మితవాద పక్ష డెమొక్రాటిక్ అలయన్స్ (డీఏ)తో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. దీనికి 'జాతీయ ఐక్యత ప్రభుత్వం'గా నామకరణం చేశారు. స్పష్టమైన సైద్ధాంతిక వ్యత్యాసాలతో, నిత్యం ప్రతిష్టంభనలు, పార్లమెంటరీ ఘర్షణలను చవి చూస్తూ ఆ సంకీర్ణం ప్రయోజనకారిగా లేదు. ఏఎన్‌సీ అధ్యక్షుడు సిరిల్ రామఫోసా 2025 మేలో 'జాతీయ సంభాషణ' ప్రయత్నం పేరు తో దక్షిణాఫ్రికా ఎదుర్కొంటున్న అత్యంత

దక్షిణాఫ్రికా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి సోలి మపైలా

> 2007 నుంచి, సౌత్ ఆఫ్రికన్ కమ్యూనిస్ట్ పార్టీ సొంతంగా ఎన్నికలలో పోటీ చేసే అవకాశాన్ని చర్చిస్తోంది. ప్రభుత్వం నయా ఉదారవాద విధానాలు, దాని పొదుపు కార్యక్రమం, నిరుద్యోగం, పేదరికం, అసమానతలపై తీవ్ర ప్రభావాన్ని చూపడం వంటి చర్యల ఆధారంగా ఈ చర్చ సాగింది. ఉపాధి అవకాశాల లభించకపోవడం ఎన్నికల రాజకీయాలపై నిరాశకు దారితీసింది.

తీవ్రమైన సమస్యలను పరిష్కరించడానికి, భిన్న పార్టీల మధ్య ఐక్యతను ప్రోత్సహించడానికి ఒక ప్రయత్నం చేస్తున్నట్లు ప్రకటించారు. కేవలం ఒక నెల తరువాత నిష్ప్రయోజనంగా తేలిపోవడంతో 'డీఏ' ఈ భాగస్వామ్యాన్ని నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. డీఏ పార్టీ నాయకుడు జాన్ స్టీన్ హ్యూసెన్ ఈ భావనను 'సమయం, డబ్బు వృథా'గా అభివర్ణించారు. బ్యాలెట్ బాక్స్ దిశగా త్రైపాక్షిక అలయన్స్ ఉమ్మడి మార్గం కూడలికి చేరుకుందని స్పష్టంగా ఉంది. డీఏతో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనే ఏఎన్‌సీ నిర్ణయం ఎస్ఏసీపీకి రుచించలేదు. ఫలితంగా ఎన్నికల ఐక్యత నుంచి అది నిష్క్రమించింది. ఆయండా జులు వివరిస్తూ: '2007 నుంచి, సౌత్ ఆఫ్రికన్ కమ్యూనిస్ట్ పార్టీ సొంతంగా ఎన్నికలలో పోటీ చేసే అవకాశాన్ని చర్చిస్తోంది. ప్రభుత్వం నయా ఉదారవాద విధానాలు, దాని పొదుపు కార్యక్రమం, నిరుద్యోగం, పేదరికం, అసమానతలపై తీవ్ర ప్రభావాన్ని చూపడం వంటి చర్యల ఆధారంగా ఈ చర్చ సాగింది. పెట్టుబడిదారీ ప్రయోజనాలను సమర్థించే పార్టీ డెమొక్రటిక్ అలయన్స్ ఇటీవల ప్రభుత్వంలో చేరిక పరిస్థితిని మరింత దిగజార్చింది.'

దేశం అనేక సమస్యలను ఎదుర్కొంటున్న సమయంలో డీఏను ప్రభుత్వంలో చేర్చుకోవాలనే ఏఎన్‌సీ దిగజారుడు సైద్ధాంతిక విధానం ముందుకు వచ్చింది. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దక్షిణాఫ్రికా 'శ్వేతజాతీయుల మారణహోమం' అమలు చేస్తోందని ఆరోపించడం విభజనలు తెచ్చింది. కపట నాటకాలతో అంతర్జాతీయ ఖండనలు వెల్లువెత్తాయి. ట్రంప్ ప్రభుత్వం నిర్ణయానికి ప్రధాన కారణం ఎక్స్‌ప్రొప్రియేషన్ యాక్ట్, దీనిని రూపొందించడంలో ఎస్ఏసీపీ కీలక పాత్ర పోషించింది. ఈ చట్టం ప్రైవేట్ భూమిని ప్రభుత్వ ఉపయోగం కోసం ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నప్పుడు 'న్యాయమైన, సమానమైన' పరిహారం చెల్లించడానికి అనుమతిస్తుంది. గమ్మత్తుగా అమెరికా రాజ్యాంగంలోని ఐదవ సవరణలో ఇదే విధమైన నిబంధన ఉంది. అది 'న్యాయమైన పరిహారం' అందించినంత కాలం ప్రజా ప్రయోజనాల ఆధారంగా భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడానికి అనుమతిస్తుంది. తమకు ఆశ్రయం కల్పించాలని కోరుతూ కొందరు చేసుకున్న దరఖాస్తులపై దక్షిణాఫ్రికా విచారణ చేస్తూ వుండగా, 60 మంది లోపు ఆఫ్రికన్‌లు జోహన్నెస్‌బర్గ్ నుంచి యునైటెడ్ స్టేట్స్‌కు చార్టర్డ్ విమానం ఎక్కిన నాటకీయ దృశ్యం. తమ స్వదేశాలలో హింస నుంచి పారిపోవడానికి ప్రమాదకరమైన ప్రయాణాలు చేసే ప్రజల విలక్షణ దృశ్యాలకు పూర్తి భిన్నమైంది. ఇవి అసమానతకు సంబంధించిన రెండు పూర్తి భిన్నమైన కథలు. ఏఎన్‌సీ నయా ఉదారవాద విధానాలు, పెరుగుతున్న అవినీతి కుంభకోణాలతో, దక్షిణాఫ్రికా నిరుద్యోగ స్థాయిలు 30 శాతం వద్దే నిలిచిపోయాయి. అయితే 15 - 24 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న యువ నిరుద్యోగులు 60శాతం పైగా ఉన్నారు.

ఉపాధి అవకాశాల లభించకపోవడం ఎన్నికల రాజకీయాలపై నిరాశకు దారితీసింది. గత ఎన్నికలలో ఓటర్ల పోలింగ్ శాతం 58శాతం కంటే కొద్దిగా ఎక్కువ ఉంది. దక్షిణాఫ్రికాలో 1994లో సార్వజనీన ఓటు హక్కు సాధించినప్పటి నుంచి ఇది అత్యల్ప శాతం. కూటమి రద్దు తరువాత సీఓఎస్ఏటీయూ(కొసాటు), ఎస్ఏసీపీ మధ్య సంబంధం గురించి, ఆయండా జులు ఇలా వివరించారు: కొసాటులోని ఎన్‌యూఎం (గని కార్మికులు), ఎన్ఈహెచ్ఏడబ్ల్యూయూ (విద్య, ఆరోగ్యం), పీఓపీసీఆర్‌యూ (పోలీస్, జైళ్లు) వంటి ప్రధాన యూనియన్లు ఇప్పటికే ఈ నిర్ణయాన్ని ఆమోదించాయి. సెప్టెంబర్‌లో జరగనున్న కొసాటు కేంద్ర కమిటీ సమావేశంలో ఈ విషయం ఖరారయ్యే అవకాశం ఉంది. కార్మిక వర్గానికి నేతృత్వం వహిస్తున్న ఈ పార్టీలో కొసాటుకు అనుబంధంగా పని చేసే సంఘటితరంగ కార్మికులు ఉన్నారు. ఏఎన్‌సీ లేదా ఎస్ఏసీపీ- అనుబంధ యూనియన్‌లు ముందుకువస్తాయా? అనే ఆసక్తికరమైన ప్రశ్నను పరిశీలిస్తే, 2 లక్షల మంది సభ్యులు కలిగిన ఎస్ఏసీపీ నిర్ణయానికి కార్మిక ఉద్యమంలో విస్తృత మద్దతు ఉందని స్పష్టమవుతోంది. దక్షిణాఫ్రికా దేశ చరిత్రలో మొదటిసారిగా 2026 స్థానిక ఎన్నికలలో ఆ దేశ ప్రజలకు కమ్యూనిస్టు పార్టీకి ఓటు వేసే అవకాశం లభిస్తుంది. దేశానికి సామ్యవాదం కోసం వారి పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లడంలో అది బహుశా ప్రేరణను అందిస్తుంది.

విలువలకు ప్రతీక సుమిత్ చక్రవర్తి

సాత్యకి చక్రవర్తి

సుప్రసిద్ధ జర్నలిస్టు, మెయిన్‌స్ట్రీమ్ వార్తాపత్రిక ఎడిటర్ సుమిత్ చక్రవర్తి మరణం భారతదేశ మీడియాకు ఎనలేని నష్టం కలిగించింది. విచ్ఛిన్నకర శక్తులకు వ్యతిరేకంగా నాలుగు దశాబ్దాలకుపైగా విరామంలేకుండా పత్రిక ద్వారా పోరాటం చేశారు. సెక్యులర్ విలువలకు, సమానత్వానికి సుమిత్ చక్రవర్తి ప్రతీక. ఆయన వయసు 81వ సంవత్సరాలు. 2025 జులై 26న (శనివారం) సాయంకాలం కోల్‌కతాలో మరణించారు. చరిత్రకారిణి డాక్టర్ గార్గి చక్రవర్తి ఆయన సతీమణి. వారికి కుమారుడు ఉన్నారు. మెయిన్ స్ట్రీమ్ పత్రిక ప్రధాన సంపాదకుడిగా ఆయన తండ్రి నిఖిల్ చక్రవర్తి నుంచి 1980లో బాధ్యతలను స్వీకరించారు. మెయిన్‌స్ట్రీమ్‌కు అత్యంత ప్రతిష్టాకరమైన పేరుఉంది. ఆయన తండ్రి నిఖిల్ చక్రవర్తి మెయిన్‌స్ట్రీమ్‌ను గొప్పగా దిద్దితీర్చారు. అదే సంప్రదాయాన్ని సుమిత్ చక్రవర్తి చివరికంటా నిలిపారు.

1980 నుంచి కొద్ది సంవత్సరాల క్రితం వరకు పత్రిక బాధ్యతలను ఏమాత్రం తండ్రికి తీసిపోకుండా నడిపారు. ఆయనకు గుండెపోటు వచ్చిన సందర్భంగా సంపాదకుడి బాధ్యతల నుంచి తనంతట తానుగా వైదొలిగారు. మెయన్‌స్ట్రీమ్ పత్రికను గొప్ప చరిత్రకారులు, మేధావులు నియమం తప్పకుండా చదువుతూ అనేక అంశాలపై ప్రశంసలు తెలియజేసేవారు. కమ్యూనిస్టు ఉద్యమంలో రేణుచక్రవర్తి, నిఖిల్ చక్రవర్తి ఆనాడు కలకత్తాలో గొప్ప మేధావులుగా వెలుగొందారు. సుమిత్ చక్రవర్తి 1944లో జన్మించారు. ఆనాడు ఉన్నటువంటి రాజకీయ వాతావరణంలో ఆయన పెరిగారు. చిన్నవయసు నుంచి ఆయన జాతీయ రాజకీయాలపైన ఎంతో ఆసక్తిని కనబరచేవారు. సాహిత్యరంగంలోనూ ఆయన ప్రతిభ గొప్పది. బెంగాలీ రాజకీయాలలో చురుకైన కార్యకర్త మాత్రమేకాదు, బెంగాలీ భాషలో గొప్ప కవి.

ఆయన ఎంఎస్‌సీలో జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయం నుంచి 1960లలో ఉత్తీర్ణులయ్యారు. ఆయనకు జర్నలిజంలో ఎనలేని ఆసక్తి. మొదట ఆయన ఢిల్లీ నుంచి వెలువడే పేట్రియాట్ దినపత్రికలో చేరారు. అనతికాలంలోనే ఆయనకు మాస్కోలో విలేకరి బాధ్యతలను అప్పగించారు.

మాస్కోలో పనిచేసే కాలంలో సోవియట్ యూనియన్‌లోనూ ఐరోపాలోని ఇతర దేశాలలోనూ జరిగే పరిణామాలను విస్తృతంగా రచించేవారు. రాజకీయాలపై వ్యాఖ్యలను లోతైన విశ్లేషణాశక్తితో రచించేవారు. ఆ రోజుల్లో పేట్రియాట్‌కి రాసే ప్రత్యేక కథనాలను పాఠకులు ఎంతో ఆసక్తిగా చదివేవారు. ఐరోపా, సోవియట్ యూనియన్ పరిణామాలను ఎంతో లోతుగా పరిశీలించి

> మాస్కోలో పనిచేసే కాలంలో సోవియట్ యూనియన్‌లోనూ ఐరోపాలోని ఇతర దేశాలలోనూ జరిగే పరిణామాలను విస్తృతంగా రచించేవారు. రాజకీయాలపై వ్యాఖ్యలను లోతైన విశ్లేషణాశక్తితో రచించేవారు. ఆ రోజుల్లో పేట్రియాట్‌కి రాసే ప్రత్యేక కథనాలను పాఠకులు ఎంతో ఆసక్తిగా చదివేవారు. ఐరోపా, సోవియట్ యూనియన్ పరిణామాలను ఎంతో లోతుగా పరిశీలించి రాసేవారు.

రాసేవారు. సుమిత్ చక్రవర్తి నాయకత్వంలో మెయిన్‌స్ట్రీమ్ వారపత్రిక నిరంతరాయంగా ఇండియా రాజ్యాంగపరిరక్షణకు, సెక్యులర్ విలువల కోసం కృషిచేసింది. దేశ రాజ్యాంగ విలువలను ఆర్ఎస్ఎస్, బీజేపీ దిగజార్చడంపై పదునైన విశ్లేషణాత్మకమైన విమర్శలను రాసేవారు. నేడు ఈ శక్తులు మతోన్మాదానికి విస్తరించేందుకు పూనుకున్నాయి. ప్రత్యేకించి 2014లో నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయ్యాక ఆయన ముఖ్యంగా ఎన్డీయే నాయకత్వంలో రాజకీయ, ఆర్థిక విధానాలపై శ్రద్ధపెట్టారు. మెయిన్‌స్ట్రీమ్ కార్యాలయంలో కూర్చుని తీవ్ర విమర్శలతో వ్యాసాలు రాయడమేగాకుండా, ఆదివాసీల హక్కులను కాపాడేందుకు దేశంలోని ఇతర అణగారిన ప్రజల కోసం పనిచేసే అనేక కమిటీలలో ఆయన భాగస్వామి. దళితులను హత్యచేసి వారి గృహాలను దహనంచేసిన ప్రాంతాలలో అనేకసార్లు సుమిత్ చక్రవర్తి వెళ్లి వాస్తవాలను తెలుసుకునేవారు. అత్యాచారాలతో, అక్రమాలతో వేధింపులకు గురైన వారి సమస్యలపై పోరాడిన అనేక కమిటీలలో ఆయనున్నారు. సుమిత్ చక్రవర్తి చాలాకాలం సీపీఐ సభ్యుడిగా ఉన్నారు. ఆయన చివరి దశలో కూడా సీపీఐకి దగ్గరగా ఉన్నారు. పార్టీ కోరినప్పుడల్లా సుమిత్ సహాయాన్ని అందించేవారు. ఆయన సతీమణి డాక్టర్ గార్గి చక్రవర్తి ప్రముఖ చరిత్రకారిణి. జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) సీనియర్ నాయకురాలు కూడా.

సుమిత్ చక్రవర్తి తండ్రి 1990ల చివరిలో మరణించారు. మెయిన్‌స్ట్రీమ్ ఏమాత్రం వాణిజ్యపరమైంది కాదు. అవినీతికి వ్యతిరేకంగా పోరాటంచేసిన పత్రిక, నీతి నిజాయితీతో వెలుగొందింది. పత్రిక ఇబ్బందుల్లో ఉన్నకాలంలో ఆయన స్నేహితులు ఎంతగానో సహాయం చేశారు. ఏనాడూ పత్రిక ఆగకుండా పనిచేసింది. ఆర్ఎస్ఎస్ పత్రిక ఆర్గనైజర్ పూర్తిగా తమ భావజాలానికి సంబంధించిన వ్యాసాలను మాత్రమే అందించేది. మెయిన్‌స్ట్రీమ్ పత్రిక ఇందుకు పూర్తిగా భిన్నమైనది. 1940లో నిఖిల్ చక్రవర్తి కేంబ్రిడ్జి యూనివర్సిటీ నుంచి తిరిగివచ్చాక సీపీఐ అధికార పత్రికలో జర్నలిస్టుగా తన జీవితాన్ని ప్రారంభించారు. మెయిన్‌స్ట్రీమ్‌లోనూ ఎడిటర్‌గా ఇతర భాషా వ్యాసాలను ఎంతో నైపుణ్యంగా తర్జుమా చేసేవారు. టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రిక ఎల్లప్పుడూ రెచ్చగొట్టే వార్తలను ప్రచురించేది. దేశ పరిస్థితులపైన లోతైన రచనలు చేసేవారు. విదేశీ వ్యవహారాలపైన కూడా గొప్ప రచనలు చేశారు.

సీపీఐ ప్రగాఢ సంతాపం:

సీపీఐ కార్యదర్శివర్గం ఒక ప్రకటనలో సుమిత్ చక్రవర్తి మరణంపై ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసింది. సుప్రసిద్ధ జర్నలిస్టు మరణం మీడియా రంగానికి, పార్టీకి ఎంతో నష్టదాయకమని ఆ ప్రకటన పేర్కొన్నది. సుమిత్ చక్రవర్తి వాణి నిరంతర ప్రగతిశీలమైనది. సుమిత్ చక్రవర్తి విశిష్టమైన జర్నలిస్టు. గొప్ప విలువలకు, వాస్తవాలకు, న్యాయానికి, లౌకికతత్వానికి జీవితమంతా కట్టుబడిఉన్న మేధావి ఆయన. సూత్రబద్ధమైన జర్నలిజాన్ని ఆయన పాఠకులకు అందించారు. భారతదేశ పురోగతికి, ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ఉన్న జర్నలిస్టుగా రాజకీయ, పాత్రికేయ రంగాలలో మంచిపేరు ఉన్నది. ఈ రెండు రంగాలలోనూ ఆయన ఎంతో ప్రశంసలు పొందారు. సీపీఐతో ఎంతో సన్నిహితంగా ఉన్నారు. జీవితమంతా దేశ ప్రగతికి, ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడిఉన్నారు. ఆయనలేని లోటు తీర్చలేనిది. న్యూఢిల్లీ ప్రెస్‌క్లబ్ తీవ్ర సంతాపాన్ని వ్యక్తంచేస్తూ భీతిలేని పాత్రికేయుడని ప్రశంసించింది. సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి సుమిత్ చక్రవర్తి మరణంపై ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తంచేశారు.

ఇళయరాజా పిటిషన్ సుప్రీం తిరస్కృతి

న్యూఢిల్లీ: ప్రఖ్యాత సంగీత దర్శకుడు ఇళయరాజా పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. సంగీతానికి సంబంధించిన 536 పాటల అంశంలో ఆయన కాపీరైట్ కేసు వేశారు. అయితే బాంబే హైకోర్టులో ఉన్న ఆ కేసును మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేయాలని అత్యున్నత న్యాయస్థానాన్ని ఆయన అభ్యర్థించారు. ఆ పిటిషన్‌ను సోమవారం సుప్రీం తిరస్కరించింది. సీజేఐ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్, ఎన్వీ అంజారియాలతో కూడిన ధర్మాసనం ఆ పిటీషన్‌ను డిస్మిస్ చేసింది. మ్యూజిక్ డైరెక్టర్ ఇళయరాజా సుమారు 1,500 చిత్రాలకు 7,500 పాటలు కంపోజ్ చేశారు. అయితే ఇళయరాజాకు చెందిన మ్యూజిక్ ఎన్ మేనేజ్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తమ వద్ద ఉన్న 536 పాటలను అక్రమంగా వాడుకుంటున్నట్లు సోనీ మ్యూజిక్ ఎంటర్‌టైన్మెంట్ ఇండియా సంస్థ ఆరోపించింది. ఈ నేపథ్యంలో 2022లో బాంబే హైకోర్టు కేసు దాఖలు చేసింది. ఆ 536 పాటలను ఓరియంటల్ రికార్డ్స్ ఎకో రికార్డింగ్ నుంచి తీసుకున్న సోనీ కంపెనీ చెప్పింది. అయితే ఆ మ్యూజిక్ వర్క్స్ విషయంలో కేసు దాఖలు చేసిన ఇళయరాజా.. పిటీషన్‌ను మద్రాసు హైకోర్టుకు ట్రాన్స్‌ఫర్ చేయాలని కోరారు. సోనీ సంస్థ క్లెయిమ్ చేస్తున్న 536 పాటల్లో 310 పాటలపై మద్రాసు హైకోర్టులో కేసు విచారణ జరుగుతున్నట్లు ఇళయరాజా పేర్కొన్నారు. ఇళయరాజా కంపెనీ తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారణన్‌తో పాటు అడ్వకేట్ ఉత్సవ్ త్రివేది వాదిస్తున్నారు.

ఆక్సిజన్ సరఫరా తగ్గి
ముగ్గురు రోగుల మృతి

చండీగఢ్: సాంకేతిక లోపం వల్ల కొద్దిసేపు ఆక్సిజన్ సరఫరా తగ్గడంతో ఐసీయూలో ఉన్న ముగ్గురు రోగులు మరణించిన ఘటన పంజాబ్‌లోని జలంధర్ ప్రభుత్వాసుపత్రిలో ఆదివారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే... జలంధర్‌లోని ఓ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆక్సిజన్ సరఫరా మార్చేటప్పుడు సాంకేతిక లోపం తలెత్తింది. ఆక్సిజన్ ఒత్తిడి పడిపోవడంతో సరఫరా తగ్గింది. దీంతో ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న ముగ్గురు రోగులు మరణించారు. దీంతో ఆసుపత్రిలో భయాందోళన వాతావరణం ఏర్పడింది. కాగా, సాంకేతిక సమస్య వల్ల ఆక్సిజన్ సరఫరా కొద్దిగా తగ్గిందని చీఫ్ మెడికల్ ఆఫీసర్ (సీఎంవో) డాక్టర్ వినయ్ కుమార్ తెలిపారు. వెంటనే బ్యాకప్ ఆక్సిజన్ సిలిండర్లను ప్రారంభించడంతోపాటు సాంకేతిక లోపాన్ని సరిదిద్దినట్లు చెప్పారు. ఇదంతా కేవలం ఐదు నుంచి పది నిమిషాల్లోనే జరిగిందని అన్నారు. మరణించిన ముగ్గురు రోగుల పరిస్థితి ముందు నుంచే విషమంగా ఉందని వివరించారు. వేర్వేరు కారణాల వల్ల వారు చనిపోయినట్లు పేర్కొన్నారు. ఈ ఘటన నేపథ్యంలో పంజాబ్ ఆరోగ్యశాఖ మంత్రి బల్బీర్ సింగ్ ఆ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు.ఆక్సిజన్ సరఫరా తగ్గిన అంశంపై కమిటీతో దర్యాప్తు చేయిస్తామని తెలిపారు. ఎవరైనా బాధ్యులుగా తేలితే వారిపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

కుక్కల బెడదపై నివేదిక ఇవ్వండి: సుప్రీం

న్యూఢిల్లీ: దేశంలో వీధి కుక్కల బెడదపై మీడియాలో వచ్చిన కథనాలకు సుప్రీం కోర్టు స్పందించింది. ఈ అంశాన్ని సుమోటోగా విచారణకు స్వీకరించింది. జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్‌తో కూడిన ధర్మాసనం వీధి కుక్కల బెడదను తీవ్రంగా కలవరపరిచే అంశంగా పేర్కొంది. ప్రతి రోజు దేశ రాజధాని దిల్లీలో వందలాది వీధి కుక్కల కాటు కేసులు నమోదవుతున్నాయి. కుక్క కాటుతో చిన్నారులు, పెద్దలు ప్రాణాంతక రేబిస్ వ్యాధిబారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. దీనికి సంబంధించిన నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించింది. మరోవైపు పార్లమెంట్‌లో కేంద్రమంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ తెలిపిన సమాచారం ప్రకారం గతేడాది దేశవ్యాప్తంగా 37 లక్షల మంది కుక్కకాటుకు గురికాగా... రేబిస్ వ్యాధి సోకి 54 మంది ప్రాణాలు కోల్పోయారు.

సెల్ఫీ పిచ్చి... నీటి ప్రవాహంలో కొట్టుకుపోయిన కుటుంబం

రాంచీ: సెల్ఫీ పిచ్చి ఓ కుటుంబాన్ని ప్రాణాపాయంలోకి నెట్టింది. సెల్ఫీ తీసుకునే క్రమంలో ప్రమాదవశాత్తూ నీటి ప్రవాహంలో ఓ కుటుంబం కొట్టుకుపోయింది. స్థానికులు, మత్స్యకారులు వెంటనే స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన జార్ఖండ్‌లోని ధన్‌బాద్ సమీపంలో గల ప్రసిద్ధ భటిండా జలపాతం వద్ద జరిగింది. వివరాల్లోకి వెళితే... పశ్చిమ బెంగాల్‌లోని బర్ధమాన్ జిల్లాకు చెందిన ఓ కుటుంబం భటిండా జలపాతం సందర్శనకు వెళ్లింది. అక్కడ జలపాతం వద్ద సెల్ఫీ తీసుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఓ మహిళ ప్రమాదవశాత్తూ జారి నీటిలో పడిపోయింది. అప్రమత్తమైన భర్త, పిల్లలు ఆమెను రక్షించేందుకు వెంటనే నీటిలోకి దూకేశారు. జలపాతం వద్ద నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో నలుగురూ మునిగిపోయి కొట్టుకుపోయారు. అక్కడే ఉన్న జాలర్లు వారిని గమనించి నీటిలోకి దూకి వారిని రక్షించడంతో ఆ కుటుంబం ప్రాణాలతో బయటపడింది. వారంతా ప్రస్తుతం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారికి ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.

మెరుపువేగమే రుద్ర, భైరవ బలం

న్యూఢిల్లీ: రుద్ర ఆల్‌ఆర్మ్స్ బ్రిగేడ్, భైరవ లైట్ కమాండో బెటాలియన్లు భారత సైన్యంలో భారీ మార్పులకు బలమైన సంకేతాలుగా నిలిచాయి. ఒకే రకమైన ఆయుధాలతో వేల మంది యుద్ధం చేయడం కంటే... తక్కువ మంది సైనికులు విభిన్న ఆయుధాలు, టెక్నాలజీతో ఏకకాలంలో సమష్టిగా శత్రువుపై విరుచుకుపడేలా వీటిని రూపొందించారు. చైనా, పాక్‌తో ఘర్షణల అనంతరం భారత సైన్యంలో శరవేగంగా చోటు చేసుకొంటున్న మార్పులకు ఇవి చిహ్నం. నాటి సీడీఎస్ బిపిన్ రావత్ హయాంలో సైనిక సంస్కరణలు మొదలయ్యాయి. అప్పుడే ఇంటిగ్రేటెడ్ బ్యాటిల్ గ్రూప్ (ఐబీజీ)లు ఏర్పాటు చేయాలనే ఆలోచన రూపొందింది. దీనిలో ఇన్‌ఫాంట్రీతోపాటు... శతఘ్ని, రాకెట్, సాయుధ కవచ, ఎయిర్ డిఫెన్స్, సిగ్నల్స్ తదితర బలగాలు మొత్తం ఉంటాయి. ఇది బ్రిగేడ్ సైజ్(3,000) కంటే పెద్దదిగా... డివిజన్ (10,000)సైజు కంటే చిన్నదిగా ఉంచాలని నిర్దేశించారు. మేజర్ జనరల్ స్థాయి అధికారి వీటికి నాయకత్వం వహిస్తారు. నిర్ణయాలు కూడా వేగంగా తీసుకొంటారు. కేవలం 12 నుంచి 48 గంటల్లో అవసరమైన ప్రాంతాల్లో మోహరించేలా ప్రణాళిక రూపొందించారు. సైనిక చర్యలు చేపట్టాలంటే పదాతి దళాలతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లోని శతఘ్ని, సాయుధ వాహనాలు, సిగ్నల్స్, ఎయిర్ డిఫెన్స్ తదితర యూనిట్లను సిద్ధం చేసుకోవడానికి... వాటిని సరిహద్దులకు చేర్చడానికి రెండు మూడు వారాల నుంచి నెలల సమయం పడుతోంది. ఆపరేషన్ పరాక్రమ్ సమయంలో చాలా జాప్యం జరిగింది. శత్రువు తాపీగా మన కదలికలను తెలుసుకొందనే విమర్శలూ ఉన్నాయి. దీంతో బ్రిగేడ్ స్థాయిలో అన్ని రకాల వనరులతో సైన్యం సిద్ధంగా ఉండేందుకు వీలుగా వీటిని ప్రతిపాదించారు. ప్రస్తుతం ఉన్న రెండు ఇన్‌ఫాంట్రీ (పదాతి దళ) బ్రిగేడ్లను 'రుద్ర'గా మార్చాలని నిర్ణయించారు. వీటిల్లో మెకనైజ్డ్ ఇన్‌ఫాంట్రీ, ట్యాంకులు, శతఘ్నులు, ప్రత్యేక దళాలు, మానవ రహిత విమానాలు, ప్రత్యేకమైన లాజిస్టిక్స్ వ్యవస్థలు, కంబాట్ సపోర్ట్‌తో వీటిని సిద్ధం చేస్తున్నారు. రుద్ర బ్రిగేడ్‌లు మోహరించే ప్రదేశాల భౌగోళిక పరిస్థితులు, ఆపరేషన్ల ఆధారంగా... వీటిల్లో వచ్చే బలగాల సమ్మేళనం మారుతుంటుంది. సాధారణంగా వీటిల్లో శతఘ్నులు, డ్రోన్ల నిఘా ఉండటంతో... ఇవి మన సేనలకు ఆధిపత్యాన్ని ఇస్తాయి. తీవ్రస్థాయిలో జరిగే స్వల్పకాలిక ఘర్షణలు ఎదుర్కోవడంలో ఇటువంటి బ్రిగేడ్లు ప్రభావవంతంగా ఉంటాయి. ముఖ్యంగా పాక్‌తో సరిహద్దు పంచుకొనే పంజాబ్, గుజరాత్, రాజస్థాన్ వంటి ప్రాంతాల్లో వీటిని మోహరించవచ్చు. పాక్ దుందుడుకు చర్యలకు వెంటనే సమాధానం చెప్పొచ్చు. చురుగ్గా సరిహద్దుల్లో మోహరించడానికి, మెరుపు వేగంతో దాడులు చేయడానికి వీలుగా భైరవ కమాండో బెటాలియన్లు ఏర్పాటు చేసింది. తక్షణమే చేపట్టే టాక్టికల్ ఆపరేషన్స్‌పై భైరవ బెటాలియన్స్ దృష్టిపెడతాయి. సైనిక చర్యకు సర్వసన్నద్ధంగా ఉంటాయి. భవిష్యత్తు యుద్ధాల కోసం భారత్ ఇప్పటికే డ్రోన్ ప్లాటూన్లను, లాయిటరింగ్ (గాల్లో తిరుగుతూ శత్రు లక్ష్యంపై దాడి చేసేవి) కమ్యూనిషన్లను, శతఘ్ని రెజిమెంట్లు ఏర్పాటు చేస్తోంది. దీనికి 'దివ్యాస్త్ర ప్రోగ్రామ్'గా పేరు పెట్టింది. ప్రతిపాదిత ఐబీజీలు, ప్రారంభించిన రుద్ర, భైరవ యూనిట్లను భవిష్యత్తులో మెరుపు వేగంతో శత్రువుపై విరుచుకుపడేలా రూపొందిస్తున్నారు.

మహువాపై లోక్‌పాల్‌కు నివేదిక

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎంపీ మహువా మొయిత్రా, వ్యాపారవేత్త దర్శన్ హిరనందాని పాల్గొన్న నగదుకు ప్రశ్నల కుంభకోణానికి సంబంధించి కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ తన నివేదికను లోక్‌పాల్‌కు సమర్పించినట్లు అధికారులు సోమవారం తెలిపారు. లోక్‌పాల్ సూచన మేరకు అవినీతి నిరోధక చట్టంలోని నిబంధనల కింద మొయిత్రా, హిరనందానిపై గత ఏడాది మార్చి 21న సంస్థ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. 'తన పార్లమెంటరీ అధికారాలను రాజీ పడేలా చేసి, తన లోక్‌సభ లాగిన్ ఆధారాలను పంచుకోవడం ద్వారా జాతీయ భద్రతకు ముప్పునకు కారణమైంది' అని పేర్కొంది. అవినీతి కార్యకలాపాలకు పాల్పడిందని, హిరనందాని నుంచి లంచాలు, ఇతర అనుచిత ప్రయోజనాలను స్వీకరించడమే కాకుండా అవినీతి కార్యకలాపాలకు పాల్పడిందని ఆరోపణలు వచ్చాయి. కేసులో తన పరిశోధన ఫలితాలను లోక్‌పాల్‌కు సీబీఐ సమర్పించింది. ఈ కేసులో తదుపరి చర్యను ఇది నిర్ణయిస్తుందని అధికారులు తెలిపారు. గత లోక్‌సభలో కృష్ణానగర్ స్థానానికి ప్రాతినిధ్యం వహించిన మొయిత్రాను డిసెంబరు 2023లో 'అనైతిక ప్రవర్తన' కారణంగా సభ నుంచి బహిష్కరించారు. దీనిని ఆమె సుప్రీం కోర్టులో సవాలు చేసింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆమె తన ప్రత్యర్థి బీజేపీకి చెందిన అమృత రాయ్‌ను విజయవంతంగా ఓడించి, 18వ లోక్‌సభలో తన స్థానాన్ని నిలుపుకుంది. బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే మొయిత్రాపై చేసిన ఆరోపణలపై ప్రాథమిక విచారణ ఫలితాలను అందుకున్న తర్వాత అవినీతి నిరోధక అంబుడ్స్‌మన్ అయిన లోక్‌పాల్ సీబీఐకి ఆదేశాలు జారీ చేసింది. పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో సహా ఇతరులపై దాడి చేయడానికి దుబాయ్‌కు చెందిన వ్యాపారవేత్త దర్శన్ హిరానందిని నుంచి నగదు, బహుమతులకు బదులుగా మొయిత్రా సభలో ప్రశ్నలు అడిగారని దూబే ఆరోపించారు.

దళిత యువకుడి దారుణ హత్య

చెన్నై: తమిళనాడులో 25 ఏళ్ల దళిత యువకుడి హత్య సంచలనంగా మారింది. దీనిని 'పరువు హత్య'గా భావిస్తున్నారు. తూత్తుకుడికి చెందిన కవిన్... తిరునెల్వేలిలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి సమీపంలో హత్యకు గురయ్యాడు. కవిన్ ఐటీ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. అతడికి కేటీసీ నగర్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్న తన మాజీ స్కూల్ విద్యార్థినితో సంబంధం ఉందని తెలుస్తోంది. అమ్మాయి కుటుంబం నుంచి వ్యతిరేకత వచ్చినా... కవిన్ ఆమెను పెళ్లి చేసుకోవాలని భావిస్తున్నాడు. ఆదివారం ఆమెను కలిసేందుకు ఆస్పత్రికి వెళ్లాడు. ఆమె సోదరుడు సుర్జిత్ అతని వద్దకు వచ్చి మాట్లాడాలనుకుంటున్నట్లు చెప్పాడు. ఆ తర్వాత వీరిద్దరి మధ్య వాదన చెలరేగింది. ఆ సమయంలో సుర్జిత్ ఆస్పత్రికి కేవలం 200 మీటర్ల దూరంలో కొడవలితో కవిన్‌ని నరికి చంపాడు. ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయిన సుర్జిత్... పాలయంకొట్టై పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. ఈ ఘటన స్థానికంగా సంచలనంగా మారింది. తమకు న్యాయం జరిగేదాకా మృతదేహాన్ని తీసుకోమని కవిన్ కుటుంబీకులు చెప్పారు. సుర్జిత్‌పైనే కాకుండా పోలీసు శాఖలో పనిచేస్తున్న అతడి తండ్రి శరవణన్, తల్లి కృష్ణకుమారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రపతి సూచన తప్పుదారి పట్టించేదే

సుప్రీంకోర్టులో కేరళ ప్రభుత్వం వాదన

న్యూఢిల్లీ: తమిళనాడు గవర్నర్ కేసులో రాష్ట్రపతి సూచన తప్పుదారి పట్టించేలా ఉందని కేరళ ప్రభుత్వం పేర్కొంది. తమిళనాడు గవర్నర్ కేసులో సుప్రీంకోర్టు తన అధికారిక ప్రకటనపై అప్పీలులో పాల్గొనేలా చేయడం కుట్ర అని, రాష్ట్రపతి సూచనను కొట్టివేయాలని కేరళ ప్రభుత్వం సోమవారం సుప్రీం కోర్టును కోరింది. రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులను ఆమోదించడానికి రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించే అధికారం సుప్రీంకోర్టుకు ఉందా లేదా తేల్చాలని రాష్ట్రపతి 14 ప్రశ్నలు సంధించిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు తన సొంత తీర్పులపై అప్పీలు చేసుకునేందుకు రాజ్యాంగం అనుమతించదు లేదా రాష్ట్రపతి సూచన ద్వారా కోర్టులో అప్పీలు అధికార పరిధిని రాష్ట్రపతి అధీనంలోకి తీసుకునేందుకు అనుమతించదు అని కేరళ ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్రపతి సూచన తప్పుదారి పట్టించేది, వాస్తవాలను తొక్కి పెట్టేదిగా ఉందని కేరళ ప్రభుత్వం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకోకపోతే రాజ్యాంగంలోని ఆర్టికల్ 143 సలహా అధికార పరిధిలోని ప్రశ్నలను మాత్రమే రాష్ట్రపతి సుప్రీంకోర్టుకు సూచించగలరని కేరళ తరపున సీనియర్ న్యాయవాదులు కేకే వేణుగోపాల్, సీకే శశి వాదించారు. 1993లో కావేరీ జల వివాదాల ట్రిబ్యునల్‌లో ఇచ్చిన సూచన సహా న్యాయపరమైన ఉదాహరణలను ప్రస్తావించింది. ఏప్రిల్ 8న తెలంగాణ, పంజాబ్, తమిళనాడు రాష్ట్రాలు దాఖలు చేసిన కేసుల్లో రాజ్యాంగంలోని ఆర్టికల్ 200, 201 కింద గవర్నర్లు, రాష్ట్రపతి అధికారాలు మూడు వేర్వేరు అధికారిక తీర్పులకు లోబడి ఉన్నాయని పేర్కొంది. 'ఒక చట్టపరమైన అంశంపై సుప్రీంకోర్టు చట్టానికి లోబడి అధికార పరిధిలో నిర్ణయం వెల్లడించినపుడు... నిర్ణయంపై ఏదైనా సందేహం ఉందని చెప్పలేము లేదా అది నిర్ణయం కాని విషయమని కూడా చెప్పలేము. తద్వారా రాష్ట్రపతి ఈ ప్రశ్నపై చట్ట పరిధిలో వాస్తవ స్థానం ఏమిటో తెలుసుకోవాలి. చట్టపరమైన ప్రశ్నపై కోర్టు నిర్ణయం అన్ని కోర్టులు, అధికారులు కట్టుబడి ఉండాల్సిందే. అందువల్ల కోర్టు నిర్ణయం తీసుకోనపుడు మాత్రమే రాష్ట్రపతి చట్టపరమైన ప్రశ్నను సూచించగలరు' అని కేరళ ప్రభుత్వం పేర్కొంది. ఏప్రిల్ 8న తమిళనాడు గవర్నర్ కేసులో జస్టిస్ జేబీ పార్థివాలా తీర్పులో, మే నెలలో రాష్ట్రపతి సూచనలో లేవనెత్తిన ప్రశ్నలను ఇప్పటికే వివరంగా ప్రస్తావించారని కేరళ ప్రభుత్వం తెలిపింది. కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 8 తీర్పును సవాలు చేయాలనుకుంటే సుప్రీంకోర్టులో సమీక్ష లేదా క్యురేటివ్ పిటిషన్ దాఖలు చేసి ఉండాల్సిందని, రాష్ట్రపతి సూచన మార్గాన్ని ఎంచుకోకూడదని పేర్కొంది. ఏప్రిల్ 8 తీర్పును సమీక్షించాలని కేంద్ర ప్రభుత్వం కోరలేదని, దానిని స్థిరమైన చట్టంగా నిర్ధారించిందని పేర్కొంది. 'తమిళనాడు కేసులో కోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా కేంద్రం సమీక్ష లేదా క్యురేటివ్ పిటిషన్ దాఖలు చేయలేదు అంటే తీర్పును అంగీకరించింది. ఈ తీర్పు చెల్లుబాటు అయ్యే ఏ విచారణలోనూ దాడి చేయబడకుండా లేదా కొట్టివేయబడకుండా, అంతిమస్థితికి చేరుకుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 144 ప్రకారం... రాష్ట్రపతి, కేబినెట్ సుప్రీం కోర్టుకు అనుకూలంగా వ్యవహరించాలి' అని కేరళ ప్రభుత్వం వాదించింది.

ఇది చీకటి చర్య

- బీహార్‌లో 1.26 కోట్ల ఓట్లు తొలగింపు
- టీఎంసీ ఎంపీ సాకేత్ గోఖలే

న్యూఢిల్లీ: జూన్ 24 నుంచి జులై 25 వరకు నిర్వహించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) తర్వాత బీహార్‌లో 1.26 కోట్ల మంది ఓటర్లను ఎన్నికల కమిషన్ (ఈసీ) తొలగించిందని, దీనిని 'చీకటి చర్య'గా తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీ సాకేత్ గోఖలే విమర్శించారు. 2024 లోక్‌సభ ఓటర్ల జాబితా నుంచి పెద్దమొత్తంలో ఓటర్లను తొలగించినట్లు తెలిపారు. 'బీహార్‌లో ఏడాది క్రితం లోక్‌సభ ఎన్నికలకు ఉపయోగించిన ఓటర్ల జాబితాలో 1.26 కోట్ల మంది ఓటర్లను తొలగించారు. ప్రస్తుత ఎస్ఐఆర్ సమయంలో బీహార్‌లో తొలగించబడిన ఓటర్ల సంఖ్య ఉత్తరాఖండ్‌తో పాటు హిమాచల్ ప్రదేశ్ లేదా ఈశాన్యంలోని 6 రాష్ట్రాల (అసోం మినహా) మొత్తం జనాభాకు సమానం' అని రాజ్యసభ ఎంపీ 'ఎక్స్'లో సోమవారం తెలిపారు. ఈసీ వెల్లడించిన వివరాలు వింతగా ఉన్నాయని పేర్కొంటూ, మొత్తం 7.90 కోట్ల మంది ఓటర్ల నుంచి మాత్రమే ఫారాలు సేకరించామని గోఖలే ఎత్తి చూపారు. మొత్తం 7.90 కోట్ల ఓటర్ల జాబితా నుంచి 7.24 కోట్ల మందికి తగ్గించారు. అంటే 65 లక్షల మంది ఓటర్లకు ఓటు హక్కు తీసేశారు. మరణించినట్లు పేర్కొంటూ దాదాపు 22 లక్షల మంది ఓటర్లు (2.83 శాతం)ను తొలగించారు. ఇక జాడ తెలియడం లేదంటూ దాదాపు 36 లక్షల మంది ఓటర్లు (4.59 శాతం)ను తొలగించారు. దాదాపు 7 లక్షల మంది ఓటర్లు (0.89 శాతం) నకిలీ నమోదుగా గుర్తించినట్లు పేర్కొన్నందున సగం అంటే 3.5 లక్షల ఎంట్రీలు తొలగించబడ్డాయి' అని వివరించారు. 'భారత పౌరులు కాని వారు ఎంతమంది ఓటర్లు ఉన్నారనేది భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) వెల్లడించలేదు. అక్రమ వలసదారులను తొలగించడానికి ఎస్ఐఆర్ కసరత్తు చేపట్టినట్లు ఈసీ పేర్కొన్నందున ఇది ముఖ్యం' అని గోఖలే పేర్కొన్నారు. 'అత్యవసరంగా కొన్ని ప్రశ్నలకు ఈసీ సమాధానం చెప్పాల్సి ఉంది' అని అన్నారు. రాజ్యసభలో ప్రతిపక్ష ఎంపీల రోజువారీ వాయిదా నోటీసులను ప్రస్తావిస్తూ, పార్లమెంటులో ఈ అంశాన్ని చర్చించడానికి మోదీ ప్రభుత్వం విముఖత చూపడాన్ని గోఖలే ప్రశ్నించారు. 'ఒకే రాష్ట్రంలో 1.26 కోట్ల మంది ప్రజలు ఓటు హక్కు కోల్పోతున్నప్పుడు ఇది తీవ్రమైన సమస్య. పార్లమెంటులో దీనిపై బహిరంగ చర్చకు మోదీ ప్రభుత్వం ఎందుకు భయపడుతోంది?' అని నిలదీశారు. బీహార్‌లో కొనసాగుతున్న ఓటర్ల జాబితాపై ఎస్ఐఆర్ కసరత్తు రాజకీయ వివాదాన్ని సృష్టించింది. పెద్ద సంఖ్యలో ఓటర్లను తొలగించడమే లక్ష్యంగా పెట్టుకుందని ప్రతిపక్ష ఇండియా ఐక్య సంఘటన విమర్శించింది. ఓటర్ల జాబితా నుంచి ఒక్క పేరు కూడా తొలగించకుండా చూసుకోవాలని బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సోమవారం బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు)కు చెప్పారు. 'ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎవరి పేర్లను తొలగించకుండా, ఒక్క వ్యక్తిని కూడా వేధించకుండా బీఎల్‌వోలు అప్రమత్తంగా ఉండాలి' అని బీర్భూమ్ జిల్లాలోని బోల్పూర్‌లో జరిగిన పరిపాలనా సమీక్ష సమావేశానికి అధ్యక్షత వహించిన ఆమె అన్నారు. టీఎంసీ నాయకుడు అభిషేక్ బెనర్జీ సోమవారం మాట్లాడుతూ 'ఈసీ ఇకపై స్వతంత్ర సంస్థ కాదు. అది బీజేపీ వ్యక్తిగత కీలుబొమ్మలా ప్రవర్తిస్తోంది. ప్రతి ఆదేశానికి తలవంచుతోంది. వారి ప్రయోజనాలను తీర్చడానికి వెనుకకు వంగి ఉంది. ప్రజాస్వామ్యం దీనికి మరింత అర్హమైనది. తటస్థతకు చెందిన ఈ ప్రమాదకరమైన అపహాస్యాన్ని మేము వ్యతిరేకిస్తున్నాము' అని అన్నారు.

నికర ఎఫ్‌డీఐలు తగ్గాయి

భయంలో దేశీయ పెట్టుబడిదారులు: కాంగ్రెస్

న్యూఢిల్లీ: నికర విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు బాగా తగ్గాయని, దేశీయ పెట్టుబడిదారులు 'భయం, అనిశ్చితి' లో చిక్కుకున్నారని కాంగ్రెస్ సోమవారం పేర్కొంది. ఆదాయాలకు మద్దతు ఇవ్వాలని, దాని 'ఆశ్రిత పెట్టుబడిదారి, పన్ను ఉగ్రవాదం' విధానాలను ముగించాలని, జీఎస్టీని పరిష్కరించాలని, చైనా డంపింగ్ నుంచి భారతీయ పరిశ్రమలను రక్షించాలని ప్రభుత్వాన్ని కోరింది. భారతదేశానికి చెందిన ప్రైవేట్ రంగ పెట్టుబడి పెరుగుతున్న ప్రభుత్వ వ్యయంతో సరిపోవడం లేదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన నివేదికల తర్వాత ప్రతిపక్ష పార్టీ ఈ విమర్శలు చేసింది. 'ఎక్స్' లో చేసిన ఒక పోస్ట్‌లో... కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్ వ్యవహారాల ఇంఛార్జ్ జైరాం రమేశ్ మాట్లాడుతూ 'చాలా కాలంగా చెబుతున్న దానిని ఆర్థిక మంత్రి చివరకు అంగీకరించారు. ప్రైవేట్ పెట్టుబడుల మందగమనం కొనసాగుతోంది. ఆశించిన వేగంతో పెరగడం లేదు' అని పేర్కొన్నారు. 'అధ్యక్షుడు ట్రంప్ తిరిగి ఎన్నికకు మద్దతుగా హ్యూస్టన్‌లో జరిగిన హౌడీ మోదీ కార్యక్రమానికి ముందు చేపట్టిన సెప్టెంబరు 2019లో గణనీయమైన కార్పొరేట్ పన్ను కోతల తర్వాత కూడా ఇది జరిగింది' అని జైరాం రమేశ్ తెలిపారు. నికర ఎఫ్‌డీఐ బాగా తగ్గిందని, దేశీయ పెట్టుబడిదారులు 'భయం, అనిశ్చితి' లో చిక్కుకున్నారని అన్నారు. ముఖ్యంగా 'పన్ను ఉగ్రవాదం, కొన్ని వ్యాపార సమూహాలకు మాత్రమే అనుకూలంగా ఉండే విధానాల కారణంగా' అని వివరించారు. దశాబ్ద కాలంగా నిలిచిపోయిన వేతన సంక్షోభం, ప్రాథమిక సంస్కరణల కోసం ఎదురుచూస్తున్న లోపభూయిష్ట జీఎస్టీ ద్వారా వినియోగ వస్తువుల కోసం సామూహిక మార్కెట్ల వృద్ధి దెబ్బతింటోందని విమర్శించారు. చివరగా, లడఖ్‌లో భారత భూభాగాన్ని కోల్పోయినప్పటికీ చైనా నుంచి చౌక దిగుమతులను 'డంపింగ్' చేయడం వల్ల దేశీయ తయారీ యూనిట్లు మూతపడుతున్నాయని, కొత్త పెట్టుబడుల అవకాశాన్ని ముందస్తుగా మూసివేసిందని ఆయన అన్నారు. పెరుగుతున్న ధరలు, తగ్గుతున్న ప్రైవేట్ పెట్టుబడులు, వేతనాల్లో స్తబ్దత సామాన్య ప్రజలను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని పేర్కొంటూ కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వంపై విమర్శల దాడి చేస్తోంది.

యెమెన్‌కు నిమిష ప్రియ కుటుంబ సభ్యులు

న్యూఢిల్లీ: యెమెన్‌లో మరణశిక్ష ఎదుర్కొంటున్న భారతీయ నర్సు నిమిష ప్రియను దేశానికి సురక్షితంగా తీసుకొచ్చేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తున్న వేళ... ఆమె విడుదలను కోరుతూ నిమిష ప్రియ కుటుంబసభ్యులు యెమెన్‌కు వెళ్లారు. ప్రజా శాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ తాజాగా ఓ వీడియో షేర్ చేశారు. నిమిష ప్రియను వదిలేయాలని కోరుతూ ఆమె భర్త థామస్, కుమార్తె మిషెల్ అక్కడి ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్న దృశ్యాలు వీడియోలో కనిపిస్తున్నాయి. వారితో పాటు కేఏ పాల్, ఇతరులు ఉన్నారు. తన భార్య మరణశిక్షను తాత్కాలికంగా నిలిపివేసినందుకు నిమిష ప్రియ భర్త థామస్ అక్కడి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. వీడియోలో పాల్... ద్వేషం కంటే ప్రేమ శక్తివంతమైనదిగా పేర్కొన్నారు. అనేక సంవత్సరాలుగా కొనసాగుతున్న అంతర్యుద్ధంతో అతలాకుతలమైన యెమెన్‌లో శాశ్వత శాంతి కోసం మధ్యవర్తిత్వం వహించడానికి తాను సిద్ధంగా ఉన్నానని పేర్కొంటూ... నిమిష ప్రియను విడుదల చేయాలని అక్కడి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. యెమెన్ జాతీయుడి హత్యకేసులో నిమిషకు మరణశిక్ష పడిన సంగతి తెలిసిందే. నిమిష, బాధిత కుటుంబాలు పరస్పర అంగీకారానికి వచ్చి కేసును పరిష్కరించు కునేందుకు మరింత సమయం ఇవ్వాలని యెమెన్ ప్రభుత్వాన్ని భారత్ పలుమార్లు కోరడంతో జులై 16న అమలు కావాల్సిన మరణశిక్షను వాయిదా వేశారు. అయితే మృతుడు తలాల్ అదిబ్ మెహది కుటుం బం మాత్రం ఆమెకు శిక్ష పడాల్సిందేనని పట్టుబడుతోంది. దీంతో నిమిష ప్రియ కేసులో ఏమి జరుగుతుందోననే ఉత్కంఠ నెలకొంది. కేఏ పాల్ పర్యటనకు సంబంధించి భారత విదేశాంగశాఖ ఎటువంటి ప్రకటన ఇవ్వలేదు. ఆయనకున్న అంతర్జాతీయ పరిచయాలతో యెమెన్ వెళ్లినట్టు తెలుస్తోంది.

కోర్టు సహనాన్ని పరీక్షిస్తున్నారా

మంత్రి విజయ్‌షాపై సుప్రీంకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్ మంత్రి కున్వర్ విజయ్‌షా కోర్టు సహనాన్ని పరీక్షిస్తున్నారని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. భారత ఆర్మీ అధికారి కల్నల్ సోఫియా ఖురేషిపై చేసిన వ్యాఖ్యలకు బహిరంగ క్షమాపణ చెప్పకపోవడంపై ఆయనను సుప్రీంకోర్టు సోమవారం తీవ్రంగా మందలించింది. మంత్రి అభిప్రాయం, విశ్వసనీయతను అనుమానించేలా ఆయన ప్రవర్తన ఉందని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చితో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఆగస్టు 13లోగా నివేదిక సమర్పించాల్సిందిగా మంత్రి వ్యాఖ్యలపై దర్యాప్తు చేపట్టేందుకు నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను ఆదేశించింది. సిట్ 87 మందిని విచారించిందని, ప్రస్తుతం వారి వాంగ్మూలాలను పరిశీలిస్తున్నట్లు సుప్రీంకోర్టు గుర్తించింది. విజయ్‌షా మంత్రి పదవికి రాజీనామా చేయాలంటూ కాంగ్రెస్ నేత జయఠాకూర్ దాఖలు చేసిన పిటిషన్‌ను పరిశీలించేందుకు ధర్మాసనం నిరాకరించింది. అయితే గత ఘటనల గురించి రిట్ పిటిషన్‌లో చేసిన కొన్ని ఆరోపణలను సిట్ పరిశీలిస్తోందని ధర్మాసనం పేర్కొంది. తదుపరి విచారణను సుప్రీంకోర్టు ఆగస్ట్ 18కి వాయిదా వేసింది. అయితే మంత్రి ఆన్‌లైన్‌లో బహిరంగ క్షమాపణలు తెలిపారని, కోర్టు రికార్డుల్లో చేర్చాల్సి ఉందని షా తరపున హాజరైన సీనియర్ న్యాయవాది కె.పరమేశ్వర్ కోర్టుకు తెలిపారు.

గబ్బిలాలతో చిల్లీ చికెన్... ఇద్దరి అరెస్ట్

చెన్నై: ఫాస్ట్‌ఫుడ్ ప్రియులకు మింగుడుపడని వార్త ఇది. లొట్టలేసుకుంటూ తిన్నది 'చిల్లీ చికెన్' కాకపోయి ఉండొచ్చు. ఎందుకంటే... చికెన్ పేరిట గబ్బిలాల మాంసాన్ని హోటల్స్‌కు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు చేరవేసే ఓ ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు . తమిళనాడు సేలం జిల్లా డేనిష్ పేట అటవీ ప్రాంతంలో తుపాకులతో సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. తమ పేర్లను కమల్, సెల్వంగా చెప్పిన నిందితులు... విచారణలో దిమ్మతిరిగిపోయే విషయాలను తెలియజేశారు. కొన్ని నెలలుగా గబ్బిలాలను వేటాడుతున్న వీళ్లిద్దరూ.. వాటిని చంపి ఆ మాంసాన్ని చికెన్ పేరిట హోటల్స్‌కు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు సప్లై చేస్తున్నట్లు చెప్పారు. అంతేకాదు... కొన్ని హెూటల్స్‌కు చిల్లీ చికెన్ తదితర ఐటెమ్స్‌ను వీళ్లే స్వయంగా గబ్బిలాల మాంసంతో వండించి నేరుగా చేరవేస్తున్నారట. తమ కంటే ముందు కొంతమంది.. కొన్నేళ్లుగా ఇలాగే చేస్తున్నారంటూ మరో బాంబ్ పేల్చారు. దీంతో పోలీసులు ఫుడ్ సేఫ్టీ అధికారులను అప్రమత్తం చేశారు. సేలం, కమల్ ఇచ్చిన సమాచారంతో నగరంలోని పలు రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్‌సెంటర్లపై పోలీసులు తనిఖీలకు సిద్ధమయ్యారు. ఇంతకాలం పిల్లి, కుక్క ఎలుకల మాంసాన్ని ఇలా తరలించడం చూశాం. ఇప్పుడు ఏకంగా గబ్బిలాల మాంసాన్ని చేరవేస్తుండడం ఇప్పుడు కలవరపాటుకు గురి చేయడం ఖాయంగా కనిపిస్తోంది.

విశాలాంధ్ర హైదరాబాద్

జైపాల్‌రెడ్డి వ్యక్తిత్వం స్ఫూర్తిదాయకం

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ ముద్దుబిడ్డ, విలువల విఖ్యాతకుడు ఎస్ జైపాల్ రెడ్డి అని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం నెక్లెస్ రోడ్ స్మృతి స్థలంలో ఎస్ జైపాల్ రెడ్డి ఆరవ వర్ధంతి సందర్భంగా ఆయన మెమోరియల్ వద్ద పుష్పగుచ్చాలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. జైపాల్ రెడ్డి మెమోరియల్ వద్ద నివాళులు అర్పించిన శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, గడ్డం వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, ఇతర ప్రముఖులు జైపాల్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో జైపాల్ రెడ్డి పాత్ర ఎనలేనిదని అలాగే అభివృద్దే లక్ష్యంగా రాజకీయాలకు అతీతంగా గణనీయమైన సేవలందించారని, ముఖ్యంగా యువతరానికి ఆయన ఆదర్శమని అన్నారు. విద్యార్థి దశ నుండి ఒక లీడర్‌గా, కేంద్ర మంత్రిగా అందించిన మహనీయ సేవలు నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. అజాత శత్రువు కీర్తిశేషులు ఎస్ జైపాల్ రెడ్డి అని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. స్మృతి స్థల్‌లో పుష్ప గుచ్చాలు ఉంచి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్ర మంత్రి, ఎంపీ, రాజ్యసభ సభ్యులుగా ఎన్నో సేవలు అందించారని హైదరాబాద్ మెట్రో, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కి ఎంతో కృషి చేశారని, అలాగే కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు తెలంగాణలో వివిధ అభివృద్ధి పనులకు పదివేల కోట్ల రూపాయలు అలాగే నల్గొండ జిల్లాకు 400 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని అన్నారు. విశిష్ట సేవలు అందించిన వ్యక్తిగా జైపాల్‌రెడ్డిని కేంద్ర ప్రభుత్వం గుర్తించి భారతరత్న అందించాలని అన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ జైపాల్ రెడ్డి ప్రజా సేవకు నిలువెత్తు సాక్ష్యం అని, తెలంగాణ రాష్ట్ర అవతరణలో ఆయన పాత్ర కీలకమని అన్నారు. స్టూడెంట్ లీడర్‌గా, కేంద్ర మంత్రిగా అటు దేశానికి ఇటు తెలంగాణకు ఎన్నో విలువైన సేవలు అందించారని విలువలకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చే వారని, ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు అందుకోవటం ఆయన గొప్పతనానికి నిదర్శనమని అన్నారు. రాజకీయాల్లో మచ్చలేని మనిషిగా ఎదిగారని నేటి తరం ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. స్వర్గీయ జైపాల్ రెడ్డి కుటుంబాన్ని శాసనసభ స్పీకర్, శాసనమండలి చైర్మన్, మంత్రులు, ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు పరామర్శించారు.

స్మృతి స్థల్‌లో మాజీ కేంద్రమంత్రి ఎస్ జైపాల్ రెడ్డి ఘాట్ నందు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మాజీ మంత్రి పల్లం రాజు, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చెన్నారెడ్డి, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, మాజీ మంత్రులు సంబాని చంద్రశేఖర్, మాజీ ఎంపీలు హనుమంతరావు, రవీంద్ర నాయక్, మధు యాష్కీ గౌడ్, ఎమ్మార్పీ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ, స్వర్గీయ జయపాల్ రెడ్డి కుటుంబ సభ్యులు, ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు, పుర ప్రముఖులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు వర్ధంతి సందర్భంగా ఘాట్ వద్ద ఘనంగా నివాళులర్పించారు.

ప్రజావాణిలోని అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి అదనపు కలెక్టరు (80) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం ఉండకూడదని అన్నారు. ఎంతో వ్యయ, ప్రయాసలు కూర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి అర్జీదారులకు ఎందుకు తిరస్కరిస్తున్నామనే విషయాన్ని తప్పనిసరిగా వివరంగా తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్‌లైన్‌లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇనార్బిట్ మాల్‌లో ఘనంగా కలంగన్ ఆర్ట్ ఫెస్టివల్

విశాలాంధ్ర - హైదరాబాద్ : సైబరాబాద్‌లోని ఇనోర్బిట్ మాల్ వద్ద రెండు రోజులు పాటు నిర్వహించిన కలంగన్ ఆర్ట్ ఫెస్టివల్ ఘనంగా జరిగింది. కమ్యూనిటీ విభిన్న కళాకారులతో సహకారంతో సృజనాత్మకత వెల్లి విరిసెల కార్యక్రమం నిర్వహించారు. 40 మందికి పైగా కళాకారులు పాల్గొన్నారు. గీతా భాస్కర్, సందీప్ సరోజ్, కమ్యూనిటీ ప్రతినిధులు స్వెతా షార్మిస్టాతో సహా ప్రత్యేక అతిథులు దీనిని "ఇటీవలి కాలంలో కమ్యూనిటీతో జరిగిన ఉత్తమ ఆర్ట్ ఫెస్ట్" అని కొనియాడారు. ఈ కార్యక్రమం కళా ప్రేమికులు, ఆసక్తికరమైన దుకాణదారులు, ఇతర ఔత్సాహితులను ఒకచోట చేర్చింది. ప్రతిరోజూ రాత్రి 11 గంటల వరకు ఉత్సవాలు జరిగాయి. సమాజ సృజనాత్మకత యొక్క స్ఫూర్తిని కార్యక్రమం రగిలించిందని నిర్వాహకులు చెప్పారు. 30కి పైగా స్థానిక సృష్టికర్తలను కలిగి ఉన్న కలంగన్, పూర్తి స్థాయి ఆర్ట్ ఫెస్టివల్ అని, ఇది చేతితో డిఐవై జోన్లు, ఇంటరాక్టివ్ వర్క్‌షాప్‌లు లైవ్ క్రాఫ్ట్ షోకేస్‌లతో నిండి ఉందన్నారు. సందర్శకులు క్రోచెటింగ్, మైక్రో ఆర్ట్ చేతితో తయారు చేసిన దుస్తులు నుండి పెయింటింగ్స్, చేతితో తయారు చేసిన రాఖిస్, రెసిన్ ఆర్ట్ మరిన్ని వరకు ప్రతిదీ అన్వేషించడంతో మాల్ సందడి చేసిందన్నారు. పవన్‌పుర్‌పురా ఆర్ట్ గ్యాలరీ, ఇషా సనా స్టూడియో, విస్టా వెల్వెట్, హరిని ఆర్ట్ మూమెంట్స్, స్నగ్లే పఫ్ వంటి పాల్గొనే బ్రాండ్లు వారి స్వంత సృజనాత్మక ఆకట్టుకున్నాయి.

చేనేత సహకార సంఘాల రుణాలు మాఫీ చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : సంక్షోభంలో ఉన్న చేనేత పరిశ్రమను రక్షించడానికి చేనేత సహకార సంఘాల రుణాలన్నింటిని మాఫీ చేసి తిరిగి రుణ సౌకర్యం కల్పించాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ హిమాయత్ నగర్ లోని రాజ బహదూర్ గౌర్ విజ్ఞాన కేంద్రంలో జరిగిన చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి పెండెం సర్వేశం అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకట్రాములు ప్రసంగిస్తూ పాలకుల నిర్లక్ష్యంతో చేనేత పరిశ్రమ తీవ్రమైన సంక్షోభానికి గురైకార్మికులు పడుతున్న బాధలు వర్ణనాతీతమన్నారు. చేనేత కార్మికులకు ప్రకటించిన రుణమాఫీ ని ఎలాంటి షరతులు లేకుండా పూర్తిగా మాఫీ చేయాలని, సహకార సంఘాలు అప్పుల ఊబిలో కూరుకుపోయి కార్మికులకు పని కల్పించలేకపోతున్నాయని వెంటనే సహకార సంఘాల అన్ని రకాల రుణాలను పూర్తిగా మాఫీ చేసి తిరిగి రుణ సౌకర్యం కల్పించాలన్నారు. ఆత్మహత్యల పాలైన నేతన్నల కుటుంబాలకు రూ.20 లక్షలు ఎక్స్ గ్రేషియో చెల్లించాలన్నారు. కేంద్రం చేనేతపై జిఎస్టి తొలగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మీ నరసయ్య ప్రసంగిస్తూ నేతన్న భరోసా పథకంలో సంవత్సరంలో పది వార్పులు నేయాలన్న నిబంధన తొలగించాలన్నారు. గత 12 ఏళ్లుగా ఎన్నికలు జరుపనందు న సంఘాలు నిర్వీర్యమై కార్మికులకు పనులు కల్పించలేకపోతున్నాయని వెంటనే ఎన్నికలు నిర్వహించాలన్నారు. చేనేత కార్మికుల పెన్షన్ రూ.5 వేలకు పెంచాల న్నారు. చేనేత రాష్ట్ర నాయకులు జల్లి రాములు, కొలిపాక సంపత్ వృత్తి సంఘాల రాష్ట్ర నాయకులు దీటి నరసయ్య, బొద్దుపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీసాయినగర్ (ఈస్ట్) కాలనీ నూతన కమిటీకి సన్మానం



విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 2వ డివిజన్ పరిధిలోని శ్రీ సాయి నగర్ ఈస్ట్ కాలనీ నూతన కమిటీ ఏర్పడిన సందర్భంగా సోమవారం ఉదయం మాజీ కార్పొరేటర్ సుభాష్ నాయక్ నూతన కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీలకతీతంగా కాలనీ అభివృద్ధి లక్ష్యంగా అందరిని కలుపుకొని ఐక్యంగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాయినగర్ కాలనీ ఈస్ట్ నూతన అధ్యక్షుడు కృష్ణ కాంత్, ప్రధాన కార్యదర్శి సంపత్ కుమార్ గౌడ్, కోశాధికారి యాకోబ్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులు శ్రీనివాస్, సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీలు కోటేశ్వరరావు, మధు ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్దే లక్ష్యంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులు వి.జగదీశ్వర్ గౌడ్ తెలిపారు. శేరిలింగంపల్లి జోనల్ కమీషనర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక నియోజకవర్గ ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను జోనల్ కమిషనర్ హేమంత్ భోరడేతో కలిసి చర్చించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ గౌడ్, కిరణ్, సంగమేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి:కమిషనర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజావాణిలో వచ్చిన విన్నపాలను సత్వరమే పరిష్కరించాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారు లను ఆదేశించారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు కమీషనర్ కు తమ విన్నపాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రజల నుండి అందిన ఫిర్యాదులను కమీషనర్ క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారా నికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ ఆర్.వి కర్ణన్ మాట్లాడుతూ... ప్రజల విన్నపాల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని, అధికారులను ఆదేశించారు. ప్రతి అర్జీదారు సమస్య పరిష్కారం కోసం తిరిగి అదే సమస్య విన్నవించకుండా హెచ్ఓడిలు కృషి చేయాలన్నారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 66 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 32, ట్యాక్స్, శానిటేషన్ విభాగాలకు 8 చొప్పున, ఇంజనీరింగ్ విభాగానికి 5, యు.బి.డి విభాగం 3, వెటర్నరి, కూకట్ పల్లి జోన్, విజిలెన్స్, ఎల్.డబ్ల్యు.ఎస్, అడ్మిన్, ఎస్టేట్, ఫైనాన్స్ విభాగాలకు ఒకటి చొప్పున ఫిర్యాదులు అందగా, ఫోన్ ఇన్ ద్వారా 3 ఫిర్యాదులు అందాయి. జిహెచ్ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 93 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్ పల్లి జోన్, సికింద్రాబాద్ జోన్‌లలో 33 చొప్పున, శేరిలింగంపల్లి జోన్‌లో 18, ఎల్బీనగర్ జోన్, చార్మినార్ జోన్‌లలో 4 చొప్పున, ఖైరతాబాద్ జోన్‌లో ఒక ఫిర్యాదు అందింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు పంకజ, గీతా రాధిక, సత్యనారాయణ, వేణు గోపాల్, మంగతాయారు, సితః రత్నాకర్, హౌసింగ్ సి ఈ నిత్యానంద, డిప్యూటీ కలెక్టర్ భూసేకరణ రామ్ నాయక్, అడిషనల్ సి సి పి లు గంగాధర్, వెంకన్న, ప్రదీప్, డిప్యూటీసిలు సంపద, పనస రెడ్డి, ఎస్ఎన్ డిపి పివిరావు, హౌసింగ్ ఈఈ పివి రవీందర్, ఎలక్ట్రిసిటీ ఈఈ మమత, చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ పంకజ, చీఫ్ వెటర్నరీ అబ్దుల్ వకీల్, అసిస్టెంట్ అడ్వర్టైజ్మెంట్ అధికారి దుర్గాన భాను తదితరులు పాల్గొన్నారు.

ఫిడే విజేత మాస్టర్ దివ్యకు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : అంతర్జాతీయ చెస్ ఫెడరేషన్ ప్రపంచ కప్ ఫైనల్స్‌లో విజయం సాధించి అరుదైన రికార్డును కైవసం చేసుకున్న ఇంటర్నేషనల్ మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్‌కి ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఫిడే ప్రపంచ కప్ ఫైనల్‌లో దేశానికే చెందిన గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపితో తలపడి టైటిల్ సాధించగా, వీరద్దరూ ఫైనల్స్‌కు చేరడం దేశానికి గర్వకారణ మన్నారు. అంతర్జాతీయ చెస్ ఫెడరేషన్‌లో సెమీఫైనల్‌లో ప్రపంచ దిగ్గజాలతో తలపడి ఫైనల్‌కు చేరిన వీరిద్దరూ దేశ ప్రతిష్టను మరింత పెంచారని కొనియాడారు. అవకాశాలు లభిస్తే మహిళలు ఏదైనా సాధిస్తారనడానికి వీరిద్దరూ ఉదాహరణ అని అన్నారు. ఫిడే మహిళా చెస్ ప్రపంచ కప్‌లో ఇప్పటివరకు భారత క్రీడాకారణి సెమీస్‌కు చేరిన చరిత్ర లేకపోగా ఏకంగా ఇద్దరు క్రీడాకాణిలు ఫైనల్స్‌కు చేరడం గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో వీరిద్దరూ మరిన్ని విజయాలు సాధించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

'టాప్ పెర్ఫార్మర్ 2025'గా విక్రమ్ సోలార్ కివా

విశాలాంధ్ర - హైదరాబాద్ : విక్రమ్ సోలార్ లిమిటెడ్, భారతదేశంలోని ప్రముఖ సోలార్ ఫోటోవోల్టాయిక్ మాడ్యూల్ తయారీదారులలో ఒకటి, కివా పివిఈఎల్ మాడ్యూల్ రిలయబిలిటీ స్కోర్‌కార్డ్‌లో "టాప్ పెర్ఫార్మర్ 2025"గా గుర్తింపు పొందినట్లు ప్రకటించింది. ఈ పురస్కారం కంపెనీకి మొత్తం మీద ఎనిమిదోసారి లభించగా, వరుసగా ఏడవ ఏడాది కూడా ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపు అందుకోవడం విశేషం. ఈ సంవత్సరం, విక్రమ్ సోలార్ ఎస్-టైప్ జి12ఆర్ మాడ్యూల్ కూడా కివా పీవీఈఎల్ 2025 ప్రొడక్ట్ క్వాలిఫికేషన్ ప్రోగ్రామ్ కింద అర్హతను పొందింది. సోలార్ ఫోటోవోల్టాయిక్ మాడ్యూల్స్ కోసం పొడిగించిన విశ్వసనీయత పనితీరు పరీక్షల్లో, కివా పీవీఈఎల్ ప్రపంచవ్యాప్తంగా అత్యంత విశ్వసనీయమైన థర్డ్ పార్టీ పరీక్షా సంస్థగా గుర్తించబడింది. ఈ పిక్యుపి ద్వారా అందే డేటా, ప్రపంచ పివి కొనుగోలుదారులకు అధికారిక థర్డ్ పార్టీ ప్రమాణాల ఆధారంగా అవగాహనను కల్పిస్తూ, నమ్మదగిన, దీర్ఘకాలిక పనితీరు కలిగిన మాడ్యూల్స్‌ను ఎంచుకునే లోపల వ్యక్తిగత, వాణిజ్య మరియు పారిశ్రామిక అవసరాలకు సహాయపడుతోంది. ఈ గుర్తింపు, అధిక పనితీరు, దీర్ఘకాలిక విశ్వసనీయత, మరియు ఆవిష్కరణలపై విక్రమ్ సోలార్ చూపించే స్థిరమైన నిబద్ధతకు మరో మైలురాయిగా నిలుస్తుంది.

ఎటిసిలో శిక్షణతో యువతకు ప్రపంచస్థాయి నైపుణ్యం

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రస్తుత ఐటిఐలు ఇప్పుడు టెక్నాలజీ హబ్‌లుగా రూపుదిద్దుకున్నాయని కార్మికశాఖ జాయింట్ కమీషనర్ జి.సునీతా తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అనంతరం అదనపు కలెక్టర్ కదిరవన్ పలనితో కలిసి ఆమె అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు గురించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వమ నిరుద్యోగ యువతి యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే సదుద్దేశ్యంతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల (ఎటిసి)గా నూతనంగా ప్రవేశపెట్టిందన్నారు. తద్వారా ఐటిఐలు ఇప్పుడు టెక్నాలజీ హబ్‌లుగా మారిపోయాయి. అత్యాధునిక మౌలిక వసతులు, ప్రపంచస్థాయి ల్యాబ్‌లు, టాటా టెక్నాలజీస్ సహకారం, ప్రముఖ ఇండస్ట్రీల భాగస్వామ్యంతో యువతకు నైపుణ్యంతో కూడిన శిక్షణను అందించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అన్నారు. ఎటిసిలో చేరుటకు 10వ తరగతి ఉత్తీర్ణత పొందాలని, అలాగే ఇంటర్, డిగ్రీ చదివి డిస్ కంటిన్యూ చేసిన వారు చేరవచ్చునని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం 65 ఎటిసీలలో 11132 సీట్లు అంబాటులో ఉన్నాయని తెలిపారు. ఇందులో నిష్ణాతులైన ట్రైనర్ల వేర్యవేక్షణలో శిక్షణ ఉంటుదని అన్నారు. విద్యా, సంక్షేమ అందికారులు ఈ అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల (ఎటిసి)లో అదిక మొత్తంలో యువతను చేర్పించుటకు అవగాహన కల్పించాలని ఆమె కోరారు. హైదరాబాద్‌లో మొత్తం 8 ఐటిఐ ఉన్నాయని, ఎటీసి చేరుటకు 7 శిక్షణ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని, దరఖాస్తులకు చేసుకొనుటకు ఈనెల 31న చివరి తేది అని తెలిపారు. అలాగే https://iti.telangana.gov.in ద్వారా కూడా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కదిరవన్ పలని, డిఆర్ ఓ వెంకటాచారి, సంక్షేమ శాఖల అధికారులతో కార్మిక శాఖ జాయింట్ కమీషనర్ సునీతా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల (ఎటిసి) కి సంబందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్మిక శాఖ ఉప కమీషనర్ బి. జాసన్, డీఈవో రోహిణి, జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎ. వందన, సంక్షేమ శాఖల అధికారులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఇలియాస్, ఆశన్న, కోటాజీ, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదిరతులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలను స్వతరమే పరిష్కరించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజావాణిలో ప్రజల నుండి స్వీకరించి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించుటకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ కదిరవన్ పలన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిద సమస్యలపై ప్రజలు అందించిన దరఖాస్తులను జిల్లా రెవెన్యూ అధికారితో కలసి అదనపు కలెక్టర్ స్వీకరించారు. ప్రజలు వద్ద నుండి ఎక్కువగా ఇందిరమ్మ ఇండ్ల సమస్యలపై ఎక్కువ దరఖాస్తులు చేసుకుంటున్నారని తెలిపారు. వచ్చిన దరఖాస్తుపై ఎండార్స్మెంట్ చేసి సంబంధిత శాఖల అధికారు లకు అందజేశారు. జాప్యం లేకుండా దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని, అవసరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించి సత్వరమే పరిష్కరించాలని సంబందిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ప్రజావాణిపై నమ్మకం కల్పించే బాధ్యత అధికారులపై ఉందని ఆయన తెలిపారు. అలాగే ప్రజాభవం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ప్రజా దర్బార్లో వచ్చిన అర్జీల పురోగతిపై అదనపు కలెక్టర్ సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న దఖాస్తులపై నిర్లక్ష్యంగా వ్యవహరించకుడా ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అదే విదంగా జిల్లాలో నిర్వహిస్తున్న ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను జాప్యం లేకుండా చూడాలని, పరిష్కరించిన పిదప ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రజావాణి ముఖ్య ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రజావాణిలో జిల్లాలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే మర్రి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మౌలాలి డివిజన్: మౌలాలి డివిజన్ లో రూ.1.15 కోట్లు వ్యయంతో మారుతి నగర్ ఎస్ఎల్.వి బేకరి నుండి భరత్ నగర్ జంక్షన్ వరకు సి.సి.రోడ్ అభివృద్ధి పనులకు స్థానిక కాలనీల వాసులు, నాయకులతో కలిసి మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రారంభించారు. మారుతీ నగర్ మెయిన్ రోడ్డు గుండా ఆర్టీసీ బస్సు వెళ్లాలన్నా, ఇతర వాహనాలపై వెళ్లాలన్నా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేది. ఈ రోడ్డును వెయ్యాలని జిహెచ్ఎంసి ఉన్నతాధికారులను పలుమార్లు కలిసి మంజూరు చేయించి త్వరలోనే రోడ్లు వేసి ప్రజలకు అందుబాటులోకి తీస్తామని తెలిపారు. అదే విధంగా భారత్ నగర్‌లోని శ్రీ మహంకాళి, నల్ల పోచమ్మ దేవాలయంలో బోనాల పండుగ జాతర రంగము సందర్భంగా ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. మల్కాజ్గిరి సర్కిల్ జిహెచ్ఎంసి ఏ.ఈ మధురిమ, బిఆర్ఎస్ నాయకులు అమీనుద్దీన్, జేఏసి వెంకన్న, మురుగేష్, మేకల రాము యాదవ్, భాగ్యానంద్, సత్యనారాయణ, ఉస్మాన్, వంశీ ముదిరాజ్, ఆదినారాయణ, మహేష్, నవాబ్, మారుతి ప్రసాద్, హబీబ్, నర్సింగరావు, స్వామి, హరీష్ రెడ్డి, స్థానిక కాలనీవాసులు మోహన్‌రావు, రవీంద్ర బాబు, కిరణ్ కుమార్, వెంకటేశ్వరరావు, అచ్యుత రామయ్య, రమణయ్య, శ్రీనివాస్, విక్రం రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు నాగేష్ పాల్గొన్నారు.

గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని...

హిల్ టాప్ కాలనీలో సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామని మల్కాజ్గిరి శాసనసభ్యులు రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని హిల్ టాప్ కాలనీలో కాలనీవాసులు పెద్ద కొంతకాలంగా నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే మూడున్నర లక్షల రూపాయల వ్యయంతో ఎమ్మెల్యే తన సొంత నిధులతో పవర్ బోరు నీటి స్టోరేజీ కోసం ఐదు వాటర్ ట్యాంకులను ఇటీవల నిర్మించారు. నిర్మించిన వాటర్ ట్యాంకులను సోమవారం స్థానిక కార్పొరే టర్ మేకల సునీత రాము యాదవ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మల్కాజిగిరిలో దశాబ్ద కాలంగా నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్న ట్లు తెలిపారు. నాయకులు మేకల రాము యాదవ్, బైరు అనిల్, ప్రేమ్‌కుమార్ తదితరులున్నారు.

సంతానోత్పత్తి కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ అనుమతి లేకుండా నడుస్తున్న సరోగసీ, సంతానోత్పత్తి (ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్) కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని, సరోగసీ పేరుతో చైల్డ్ ట్రాఫికింగ్‌కు పాల్పడుతున్న వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సంతానోత్పత్తి కేంద్రాలను తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో కోఠిలోని రాష్ట్ర ప్రజా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అడిషనల్ డైరెక్టర్ ఆర్.పుష్పకు ఏఐవైఎఫ్ బృందం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్ లు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సరోగసీ,సంతానోత్పత్తి (ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్) కేంద్రాలు ప్రభుత్వ అనుమతులు లేకుండా విచ్చల విడిగా నడుస్తున్నాయన్నారు. ఇటీవల హైదరాబాద్ నగరంలో సృష్టి ఫర్టిలిటీ సెంటర్‌లో సరోగసీ పేరుతో అనధికారికంగా పిల్లలు లేని దంపతులకు సరోగసీ ద్వారా సంతానోత్పత్తి చేస్తామని చెప్పి 30-50 లక్షలు వసూళ్లు చేసి దంపతులను మోసం చేయడం సిగ్గు చేటు అన్నారు. రాష్ట్రంలో వీర్యకణాల సేకరణ కేంద్రాల్లో ఈ అక్రమ దందాలు జరుగుతున్నా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. అండ పిండ అరాచకానికి హైదరాబాద్‌లోని కొన్ని ప్రైవేట్ సంతానోత్పత్తి కేంద్రాలు దందాలకు తెరలేపడం సరికాదన్నారు. అక్రమ సరోగసీ, స్పెర్మ్, చిన్నారుల ట్రాఫికింగ్ రాకెట్ పై పోలీసులు ఉక్కుపాదం మోపి, దుర్మార్గులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత అరెస్టు అనంతరం బాగోతాలు ఒక్కొక్కటిగా బయట పడటం చూస్తే... సృష్టి ఆసుపత్రి వెనుక పలు పెద్ద ఆసుపత్రులు కూడా ఈ నీచ దందాకు పాల్పడుతున్నారనే అనుమానాలు వ్యక్తమవు తున్నాయన్నారు. 2023లోనే సృష్టి ఫర్టిలిటీ సెంటర్‌కు లైసెన్సు ముగిసినప్పటికీ, వైద్య శాఖ అధికారులు తెరవెనుక వెన్నుదన్నుగా అక్రమ కార్యకలాపాలకు వత్తాసు పలుకుతున్నారనే అనుమానం వ్యక్తం అవుతుందన్నారు. సరోగసీపై చట్టబద్ధత ప్రకారం ప్రక్రియ చేయకుండా, డబ్బులే పరమావధిగా తప్పులు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అదేవిధంగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ గుర్తింపు ఉన్న సంతానోత్పత్తి కేంద్రాల జాబితాను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ వినతి కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. సత్య ప్రసాద్, శ్రీమాన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్. బాలకృష్ణ, శివకుమార్, రాష్ట్ర సమితి సభ్యులు షేక్ మహమూద్, కళ్యాణ్, రాజేందర్, మధుకర్, విష్ణు పాల్గొన్నారు.

శారదా హైస్కూల్లో ప్రకృతి పరిరక్షణ దినోత్సవం



విశాలాంధ్ర -శేరిలింగంపల్లి: కొండాపూర్‌లో గల శారదా హైస్కూల్ నందు ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బందా నరేంద్ర బాబు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆచార్య కిషోర్ కుమార్, హైదరాబాదు సెంట్రల్ యూనివర్శిటీ (సెంటర్ ఫర్ ఎర్త్, స్పేస్ సైన్స్ అండ్ ఓసియన్) విచ్చేసి మాట్లాడుతూ "సకల జీవరాసుల మనుగడకు మూలాధారం పంచభూతాలైన భూమి, గాలి, నీరు, నింగి, నిప్పులను పకృతే ఈ విశ్వానికి అందించింది. పంచ భూతాల నిష్పత్తిలో సమతుల్యత లోపించిన మానవ జీవనం అస్తవ్యస్తమవడంతో పాటు విపత్తులకు గురవుతుంది. ప్రకృతి, వాతావరణ, పర్యావరణ సమతుల్యత మానవ మనుగడకు అవసరం. ఆధునీకరణ, పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, శీఘ్రంగా విస్తరిస్తున్న కార్పొరేటీకరణ శాస్త్ర, సాంకేతిక రంగాలలో సంభవిస్తున్న పరిణామాలు, మానవుని స్వార్థ పరత్వం పకృతి విధ్వంసం దిశగా కొనసాగడం శోచనీయం" అని అన్నారు. విద్యార్థిని, విద్యార్థులు, అధ్యాపకులు, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాలం శ్రీను, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాల యాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, డీఆర్ఓ సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భం గా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత జిల్లా అధికారులు సత్వర పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహాశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మస్జీద్‌కు భూమి పూజ చేసిన కొలను

విశాలాంధ్ర- దుండిగల్: సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లిలో మైనారిటీ సోదరులకు నూతన పీర్ల మస్జీద్,ఈద్గా దాత వైస్ ఎంపీపీ కొలన్ కృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన భూమి పూజ కార్యక్రమం సందర్భంగా మైనారిటీ సోదరుల ఆహ్వానం మేరకు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ఆయన చేతుల మీదుగా పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మైనారిటీ సోదరులు హర్షం వ్యక్తం చేస్తూ శాల్వాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మాజీ ఎంపీటీసీ నందిగామ సత్యనారాయణ, కాసాని వీరేష్, కాసాని సుధాకర్,ఎస్ ఎమ్ సి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ కొలన్ జీవన్ రెడ్డి, కొలన్ బాల్ రెడ్డి, మండల్ మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సయ్యద్ కలీల్ ఖాన్, మైనారిటీ జనరల్ సెక్రటరీ మొహమ్మద్ షకీల్, సయ్యద్ ఫారూఖ్, సయ్యద్ షకీల్, సయ్యద్ సలీమ్, సయ్యద్ అక్బర్, మొహమ్మద్ ఖాజా, మొహమ్మద్ చాంద్ పాషా పాల్గొన్నారు.

మల్లాది శ్రీకాంత్‌కి ఏయూ డాక్టరేట్

విశాలాంధ్ర- హైదరాబాద్ : హైదరాబాద్‌లోని డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ లిమిటెడ్ కార్పొరేట్ కార్యాలయంలో లీడ్ ఎంప్లాయ్ రిలేషన్స్ అండ్ ఇండస్ట్రియల్ రిలేషన్స్‌గా పనిచేస్తున్న మల్లాది శ్రీకాంత్‌కి ఏయూ డాక్టరేట్ లభించింది. గత 31 సంవత్సరాల నుంచి డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ లో పనిచేస్తున్న మల్లాది శ్రీకాంత్ విశాఖ ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎంహెచ్ఆర్ఎం విభాగంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసారు. అనంతరం ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ విభాగం రీసెర్చ్ స్కాలర్‌గా చేరి పరిశోధన పూర్తి చేసుకున్నారు. ఆ విభాగ ప్రొఫెసర్ ఆచార్య పుట్టపల్లి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిపిన పరిశోధనకు గాను ఆయన ఈ డాక్టరేట్ పొందా రు. ఈ మేరకు ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య జి.పి.రాజశేఖర్ చేతుల మీదుగా డాక్టరేట్ సర్టిఫికెట్ అందుకున్నారు. ఉద్యోగి జీవిత చక్ర నిర్వహణ, సంస్థ పనితీరుపై దాని ప్రభావం' (ఎంప్లాయ్ లైఫ్ సైకిల్ మేనేజ్మెంట్ అండ్ ఇట్స్ ఇంపాక్ట్ ఆన్ ఆర్గనైజేషనల్ పెర్ఫార్మెన్స్ ఏ స్టడీ విత్ రిఫరెన్స్ టు ఎగ్జిక్యూటివ్స్ ఆఫ్ 'డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ లిమిటెడ్) అనే అంశంపై తన పరిశోధనలు చేశారు. డాక్టరేట్ పొందిన సందర్భంగా డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ అధికారులు, సిబ్బంది శ్రీకాంత్‌కు అభినందనలు తెలియజేశారు.

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

విశాలాంధ్ర- దుండిగల్: ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద పేర్కొన్నారు. సోమవారం నియోజక వర్గం 132 - జీడిమెట్ల డివిజన్ పైప్ లైన్ రోడ్ కోణార్క్ హాస్పిటల్ సమీపంలో డాక్టర్ వికాస్ రెడ్డి, డాక్టర్ శివానిల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన లిటిల్ స్టార్ చిల్డ్రన్ క్లినిక్‌ను బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ రోజు రోజుకూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నూతన హాస్పిటల్ ఏర్పాటు ఎంతో అవసరమని, ఈ ప్రాంతంలో పిల్లలకు ప్రత్యేక ఆసుపత్రి ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జగద్గిరిగుట్ట శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, డివిజన్ సీనియర్ నాయకులు నరేందర్ రెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కాలే నాగేష్, ఎల్లా గౌడ్, పులి మహేష్, బాల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా ఇన్వెస్టోపియా గ్లోబల్ ఈవెంట్స్

విశాలాంధ్ర - జూబిలీహిల్స్ : యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), భారతదేశం, మధ్య కొత్త ఆర్థిక భాగస్వామ్యాలను పెంపొందించాలనే లక్ష్యంతో ఇన్వెస్టోపియా గ్లోబల్ డైలాగ్స్, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్‌లో రెండు కార్యక్రమాలను నిర్వహించాయి. భారత వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వ శాఖ, భారత వాణిజ్య పరిశ్రమల సమాఖ్య (ఫిక్కి)తో కలసి నిర్వహించిన ఈ కార్యక్రమాలు, భారత్‌తో సంబంధాలను మరింత గాఢం చేయడంపైన యూఏఈ నిబద్ధతను గ్లోబల్ పెట్టుబడి, ఆర్థిక సహకారాన్ని ప్రోత్సహించాలన్న దృష్టిని హైలైట్ చేశాయి. ఈ కార్యక్రమానికి యూఏఈ భారతదేశానికి చెందిన ప్రముఖ వ్యాపార ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు హాజరయ్యారు. వీరిలో ముఖ్యంగా హిజ్ ఎక్సలెన్సీ మొహమ్మద్ అల్ హవీ యూఏఈ ఇన్వెస్ట్మెంట్ మంత్రిత్వ శాఖ ఉప కార్యదర్శి, హిజ్ ఎక్సలెన్సీ హమద్ అల్ మరార్ ఎడ్జ్ మేనేజింగ్ డైరెక్టర్, సిఈవో, వలీద్ హారెబ్ అల్ ఫలాహీ యూఏఈ ఇంటర్నేషనల్ ఇన్వెస్టర్స్ కౌన్సిల్ సెక్రటరీ జనరల్, అదీబ్ అహ్మద్ లులు ఫైనాన్షియల్ హోల్డింగ్స్ ఎండి, డాక్టర్ మొహమ్మద్ అల్ జాబీ మిరాల్ గ్రూప్ సిఈవో ఉన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : ప్రజలు స్వచ్ఛతపై దృష్టి సారించాలని, ఏదైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించేలా ప్రజలకు అవగాహన కల్పించి మెరుగైన వైద్య సేవలు అందించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. సోమవారం కూకట్ పల్లి మండలం మూసాపేట్ లోని యూపీహెచ్ఎస్ సెంటర్ ను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి ఉమా గౌరీతో కలిసి జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏదైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించేలా ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. రోజుకు ఎంతమంది ఓపి పేషెంట్లు వస్తారని వారి నమోదు ఏవిధంగా రిజిస్టర్ చేస్తున్నారని ఆన్లైన్లో పరిశీలించారు. ఏఎంసి, బీపీ, షుగర్ పరీక్షలు పేషెంట్లు రెగ్యులర్‌గా వస్తున్నారా అని సీజనల్ వ్యాధులపై ఇంటింటి ఫీవర్ సర్వే చేస్తున్నారా అని, డెంగ్యూ పరీక్షలు ఏ విధంగా చేస్తున్నారని కలెక్టర్ మెడికల్ ఆఫీసర్‌ను అడిగి తెలుసుకు న్నారు. పేషంట్ల ఓపి నమోదు రిజిష్టర్లను కలెక్టర్ పరిశీలించి రోజుకు ఎంత మంది ఓపి పేషంట్లు వస్తున్నారని అడిగారు. సరిపడా మెడిసిన్ అందుబాటులో ఉంటున్నాయా అని, మందులను పరిశీ లించి ఎక్స్పైరీ డేట్ జాగ్రత్తగా చెక్ చేసుకో వాలని కలెక్టరు సూచించారు. టిబి, ల్యాప్రోసి పేషంట్లు ఎంత మంది ఉన్నారని, ఎన్ సిడి కేసులు ఎన్ని ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్‌ను పరిశీలించిరోజుకు ఎన్ని టెస్టులు చేస్తున్నా రని కలెక్టరు అడిగారు. యూపీహెచ్ఎస్ బోర్డు పేరు ప్రజలకు స్పష్టంగా కనిపించేలా పెట్టాలని కలెక్టరు మెడికల్ ఆఫీసర్‌కు సూచించారు.

రాజకీయ విలువలను దిగజార్చుతున్న బీఆర్ఎస్

విశాలాంధ్ర - షాద్‌నగర్, రూరల్ : పార్టీ మెప్పు కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి ని వ్యక్తిగతంగా విమర్శించడం సిగ్గు చేటని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ మంచి సంస్కృతికి, విలువలకు, పోరాటానికి నిలయమైన తెలంగాణ గడ్డ అన్నారు. తెలంగాణ తెచ్చుకున్నది మీ లాంటి వారి రౌడీయిజం చూడటానికి కాదన్నారు. బిఆర్ఎస్ అధికారం కోసం చేసే ఆకృత్యాలు ప్రజలకు కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుందన్నారు. తెలంగాణ వచ్చింది ఒక్క పార్టీ వల్లనో కాదన్నారు. ఎందరో బలిదానాల ఫలితమే తెలంగాణ అన్నారు. బిఆర్ఎస్ నాయకులు చేసే ఆకృత్యలపై న్యాయపరంగా పోరాడతామన్నారు. బిసి కల కోసం 42% రిజర్వేషన్ పట్టుబట్టి ముఖ్యమంత్రి పోరాడుతున్నారు. బిల్లు చెయ్యాల్సిన బీజేపీ పార్టీ వంకరటింకర సమాధానాలు చెబుతుందన్నారు. చేతనైతే పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలన్నారు. తెలంగాణలో రాజకీయ విలువలను పూర్తిగా దిగజారుతూ దురహంకా రాన్ని ప్రదర్శిస్తూ సీఎం రేవంత్ రెడ్డి పై దుష్ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తన తీరు మార్చుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. వికృత చేష్టలు చేస్తున్న పాడి కౌశిరెడ్డి రాజకీయ విధానాలు రాజ్యాంగానికి విరుద్ధంగా ఉన్నాయని మండిపడ్డారు. అధికారంలో వచ్చేందుకు తాపత్రయ పడుతున్న టిఆర్ఎస్ పార్టీ గడిచిన 15 నెలల్లో నే ప్రభుత్వంపై విమర్శలు చేస్తూనే వస్తుందని దీనిని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శిస్తున్న వారికి రాబోయే భవిష్యత్తులో పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. ప్రజాస్వామ్యం ఎవరి సొత్తు కాదని రాష్ట్రంలో అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తూ నేడు 42 శాతం బీసీ రిజర్వేషన్ తీసుకురావడం ప్రతి పక్షానికి గిట్టడం లేదని అందుకే కాంగ్రెస్ పార్టీకి ఎక్కడ పేరు వస్తుందని భావించి తప్పుడు ప్రచారాలు తప్పు రాజకీయాలు రాష్ట్రంలో ప్రచారం చేస్తున్నారని అన్నారు.

ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, చెంది తిరుపతి రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, నరసింహ యాదవ్, పురుషోత్తం రెడ్డి, బాలరాజ్ గౌడ్, సుదర్శన్ గౌడ్, బస్వం, శ్రీను నాయక్, అన్వర్, సత్తయ్య, సీతారాం, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయం

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: ఇందిరమ్మ మైనారిటీస్ మహిళా శక్తి పథకం రేవంతన్న భరోసా కార్యక్రమంలో భాగంగా మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ సంస్థ ద్వారా ఉచితంగా 9 మంది క్రిస్టియన్ మైనారిటీ మహిళ సోదరీమణులకు కుట్టు మిషన్లను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డితో కలిసి 9 మంది లబ్దిదారులకు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ మైనారిటీస్ మహిళా శక్తి పథకం రేవంతన్న భరోసా పథకం కింద క్రిస్టియన్ మైనార్టీ సోదరీమణులకు ఉచితంగా 9 మందికి కుట్టు మిషన్లు అందచేయడం చాలా సంతోషకరమైన రోజు అని, పేద మహిళల జీవితాలలో వెలుగులు నింపిన రోజు అని, మహిళలు ఆర్థికంగా ఎదగడానికి గొప్ప అవకాశంను ప్రభుత్వం కలిపించింది అని, మహిళలు తమ స్వంత కాళ్ళపై నిలబడి కుటుంబ పోషణకు చేదోడు వాదోడుగా ఉండేందుకు ఎంతగానో ఉపయోగపడతాయి అని, ఆర్థికంగా ఎదగాలని మనసారా కోరుకుటుంన్నాను అని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో నజియా బేగం, నాయకులు సందీప్ రెడ్డి, నరేందర్ బల్లా, శివ ముదిరాజు, సరేష్, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గురుకులాల విద్యార్థుల మరణాలపై జాతీయ మానవ హక్కుల కమిషన్ విచారణ

విశాలాంధ్ర- బషీర్‌బాగ్: తెలంగాణ రాష్ట్రంలో ఉన్న పలు గురుకు లల్లో ఆత్మహత్య, అనుమానస్పద మృతి, ఫుడ్ పాయిజన్ పలు కారణాలవల్ల 48 మంది విద్యార్థులు చనిపోవడం జరిగిందనీ, 886 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్ వల్ల అస్వస్థతకు గురయ్యారని, ఇట్టి విషయంపై ఆమ్ ఆద్మీ పార్టీ మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నయీం పాషా జాతీయ మానవ హక్కుల కమిషన్‌కి ఫిర్యాదు చేయగా, ఫిర్యాదును స్వీకరించిన కమిషన్ 28 జూలై 2025 రోజున హైదరాబాదులో ఉన్న మర్రి చెన్నారెడ్డి ఇన్స్టిట్యూట్లో విచారణ చేపట్టారు. ఈ విచారణకు తెలంగాణ రాష్ట్ర గురుకులాల సెక్రటరీ అలుగు వర్షిని హాజరయ్యారు. ఈ ఫిర్యాదుపై, మరణాలపై తీసుకున్న చర్యల గురించి అడుగుతూ నాలుగు వారాలలో పూర్తి రిపోర్టు కమిషన్ వద్ద పొందుపరచాలని కమిషన్ చైర్మన్ వి. సుబ్రమణియం ఆదేశించారు. అలాగే కమిషన్ ముందు నయీం పాషా స్పందిస్తూ 27 జూలై 2025 రోజున నాగర్‌కర్నూల్ జిల్లాలో 111 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్ వల్ల అస్వస్థతకు గురయ్యారని కమిషన్ ముందు పత్రికలో వచ్చిన ప్రకటన కాపీని సమర్పించారు. దీనిపై కూడా కమిషన్ స్పందిస్తూ పూర్తి రిపోర్టు సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ కన్వీనర్ దిడ్డి సుధాకర్, ఆప్ నేతలు బుర్ర రాము గౌడ్, ఎంఏ. మజీద్, విజయ్ మల్లంగి, డా. లక్ష్మ నాయుడు, దర్శనం రమేష్, నయీమ్ పాషా, రాజేందర్, రమ్య గౌడ్, అజీమ్ బేగ్, కొడంగల్ శ్రీనివాస్, షాబాజ్, దర్శనం రమేష్, వికాస్ రెడ్డి, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

మేజర్ కవితను సన్మానించిన బండారు దత్తాత్రేయ

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: భారత సైన్యంలో వైద్య అధికారిగా సేవలందిస్తున్న ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన మేజర్ కవిత వసుపల్లి, వీఎస్ఎంని సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ సన్మానించారు. ఇటీవల కల్నల్ రణవీర్ సింగ్ జమ్వాల్, ఎస్ఎం, వీఎస్ఎం, డైరెక్టర్ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మౌంటైనీరింగ్ అండ్ అడ్వెంచర్ స్పోర్ట్స్ నేతృత్వంలో నిర్వహించిన 28 రోజులలో 1040 కిలోమీటర్ల బ్రహ్మపుత్ర నది రివర్ రాఫ్టింగ్ ఎక్స్‌పెడిషన్‌లో మేజర్ కవిత ఏకైక మహిళగా పాల్గొని ప్రపంచ రికార్డు సృష్టించడం జరిగింది.

బీఆర్ఎస్ నాయకుడు బసగళ్ల అరవింద్ గౌడ్ మృతి

విశాలాంధ్ర - మొయినాబాద్: బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బసగళ్ల అరవింద్ గౌడ్ మొయినాబాద్ మండల పరిధిలోని రెడ్డిపల్లిలోని స్వగృహంలో ఆదివారం సాయంత్రం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా రెడ్డి వారి నివాస గృహానికి వెళ్లి భౌతిక కాయానికి శ్రద్ధాంజలి ఘటించి, తీవ్ర సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, నరోత్తం రెడ్డి, రవి యాదవ్, శ్రీహరి యాదవ్, మోర శ్రీనివాస్, జగదీష్ రెడ్డి, రామ్ రెడ్డి, మోహన్ రెడ్డి, శేఖర్, రెడ్డిపల్లి బిఆర్ఎస్ పార్టీ విలేజ్ ప్రెసిడెంట్ కావలి ప్రవీణ్, కార్యకర్తలు ఉన్నారు.

సీపీఐ జిల్లా మహాసభను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - మొయినాబాద్ : మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలోని అంజనాదేవి గార్డెన్లో ఆగస్టు 2న జరిగే సీపీఐ జిల్లా 17వ మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ప్రభు లింగం కోరారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలో చేవెళ్ల మండల కౌన్సిల్ సమావేశం మండల కార్యదర్శి ఎం. సత్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంద సంవత్సరాల భారత కమ్యూనిస్టు పార్టీ నాటి నుంచి నేటి వరకు భూమి, భుక్తి, విముక్తికోసం పేదల పక్షాన పోరాటం చేస్తోందన్నారు. పోరాటమే ఎజెండాగా జరుగనున్న జిల్లా మహా సభలను విజయవంతం చేయడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలంతా కృషి చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బి. సుభాన్ రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, ఇస్ఫాఫ్ జిల్లా అధ్యక్షుడు ఎండి. మక్బూల్, డాక్టర్ షారీల్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల, వడ్ల మంజుల, మీనాక్షి, లలిత, పోచయ్య, ఒగ్గు సత్యనారాయణ, మల్లయ్య, పెంటయ్య పాల్గొన్నారు

గెజిటెడ్ హెడ్‌మాస్టర్స్‌కు బదిలీతో కూడిన ప్రమోషన్ ఇవ్వాలి

విశాలాంధ్ర - బషీర్ బాగ్ : పాఠశాల విద్య, గజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు బదిలీతో కూడిన పదోన్నతులు కల్పించా లని తెలంగాణ స్టేట్ గజిటెడ్ హెడ్ మాస్టర్స్ అసోసియేషన్ (టిఎస్ జిహెచ్ఎంఏ) రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రాజగంగా రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.గిరిధర్ గౌడ్‌తో కలసి ఆయన మాట్లాడారు. పాఠశాల విద్యలో 2005 నుండి గజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు పై స్థాయి పోస్టులకు పదోన్నతులు ఇవ్వడం లేదని తెలిపారు. దీనివల్ల అర్హతలు కలిగి ఉండి కూడా పైస్థాయి పదోన్నతులు పొందలేక గెజిటెడ్ హెడ్ మాస్టర్ గ్రేడ్-2 స్థాయిలోనే ప్రధానోపా ధ్యాయులు పదవి విరమణ పొందుతున్నారని తెలిపారు. 2018 రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం పాఠశాల విద్యలో ఎంప్లాయిస్ సర్వీస్ రూల్స్, సబార్డినేట్ సర్వీసు రూల్స్ రూపొందించి ఖాళీగా ఉన్న పోస్టులలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు అర్హత గల అన్ని పోస్టులలో పదోన్నతి అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఉప విద్యాధికారి, జిల్లా విద్యాధికారి పోస్టులు, డైట్‌లలో ఖాళీగా ఉన్న సీనియర్ లెక్చరర్ పోస్టులు పదోన్నతుల ప్రక్రియ ద్వారా భర్తీ చేయుటకు తగు చర్య తీసుకోవా లన్నారు. పాఠశాల విద్యలో పర్యవేక్షణను పటిష్టం చేసేందుకు నూతనంగా ఉప విద్యాధికారి పోస్టులు మూడు లేదా నాలుగు మండలాలకు ఒక విద్య డివిజన్‌గా ఏర్పరిచి మంజూరు చేయాల న్నారు. తద్వారా పర్యవేక్షణ బలోపేతం అవ్వడమే కాకుండా గజిటెడ్ హెడ్ మాస్టర్, గ్రేడ్-2 స్థాయిలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులకు పదోన్నతి అవకాశాలు మెరుగవుతాయని పేర్కొన్నారు. బాలాజీ నాయక్, లక్ష్మణ్ నాయక్, ఛత్రు నాయక్, వెనకన్న, ప్రసూన, శైలజ, సంధ్య రాణి, ఇందు ప్రియ, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - రాజేంద్రనగర్ : రాజేంద్ర నగర్ నియోజకవర్గంలోని జీహెచ్ఎంసీ సర్కిల్ అత్తాపూర్ డివిజన్‌లో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మొత్తం రూ. 1.40 కోట్ల అంచనా వ్యయంతో ఈ పనులు చేపట్టనున్నారు తేజస్వినగర్ లక్ష్మీ నగర్ రెడ్డి బస్తీ సిక్ చావని ప్రాంతాలలో రూ. 91 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు ఓపెన్ జిమ్ ప్యాచ్ వర్క్‌లకు రూ.49 లక్షల వ్యయంతో యూజీడీ అండర్‌గ్రౌండ్ డ్రెనేజీ పనులకు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ ప్రజల దీర్ఘకాల డిమాండ్లను నెరవేరుస్తూ నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఈ పనులన్నీ పూర్తయితే స్థానికులకు మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయని అన్నారు. వర్షాకాలం దృష్ట్యా యూజీడీ పనులు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయని, వీటిని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ అభివృద్ధి పనులు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో ఎంతగానో దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు స్థానిక కార్పొరేటర్లు నాయకులు ఆయా కాలనీల నివాసితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పేదల పెన్నిధి సీఎం సహాయ నిధి

విశాలాంధ్ర- కుత్బుల్లాపూర్: ఆర్థిక స్థోమత లేని పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ఆరోగ్య పెన్నిధిలా ఉపయోగపడుతున్నదని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో ఇటీవలే అనారోగ్య పరిస్థితులతో ఆసుపత్రిలో చికిత్స పొందిన నర్సయ్య, జరిపేటి బ్రమేశ్వర్, వీర్ల సువర్ణ, జాలిం పవన్, యండి బషీరుద్దీన్, నక్క సురేష్ బాబు, కరల కాంత, నగల నాగమణి, జయలక్ష్మి, సంపంగి బాలమణి, టేకులపల్లి అశోక్ గౌడ్ గతంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యం నందు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి కింద దరఖాస్తు చేసుకున్నారు. ఈ విధంగా సోమవారం షాపూర్ నగర్‌లో ఆయన నివాసం వద్ద 5 లక్షల రూపాయల సిఎంఆర్ఆఫ్ చెక్కులను వారికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ అనారోగ్య పరిస్థితులతో ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేద ప్రజలు సిఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోవాలని, సిఎంఆర్ఆఫ్ ఆర్థిక సహాయం పేదలకు కొండంత భరోసాగా మారిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ప్రజాపాలన ద్వారా బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తుందని కొనియాడారు. ప్రజాపాలనలో పేద, మధ్యతరగతి ప్రజలకు ముఖ్యమంత్రి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజానర్సింహా కార్పొరేట్ రంగంలో వైద్యం అందించడంతో పాటు వైద్యనికి అయినా ఖర్చులు సిఎంఆర్ఆఫ్ ద్వారా పేదలకు అందించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. చెక్కులు అందుకునే ప్రతి లబ్దిదారుని చిరరునవ్వుతో చిరకాల జ్ఞానుడిగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిలుస్తారని వ్యక్తం చేశారు. లబ్దిదారులు, నియోజకవర్గం ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ల పనులు ప్రారంభం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం కేశంపేట మండల కేంద్రంలో విద్యుత్ సరఫరా వ్యవస్థను ఆధునీకరించేం దుకు రూ.25 లక్షల అంచనా వ్యయంతో మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. గత 50 సంవత్సరా లుగా ఉపయోగంలో ఉన్న పాత విద్యుత్ లైన్ల కారణంగా తరచుగా ఏర్పడుతున్న అంతరాయాలకు ఈ పనులతో ముగింపు పడనుంది. ఈ నిధులను మంజూరు చేయించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామంలో విద్యుత్ సమస్యలపై కేశంపేట మాజీ సర్పంచ్ శ్రీధర్ రెడ్డి గ్రామస్తులతో కలిసి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే శంకర్ గ్రామంలో శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలను తొలగించి, కొత్త స్తంభాలను ఏర్పాటు చేయడంతో పాటు పాత వైర్లను మార్చడానికి నిధులు మంజూరు చేయించారు. అంతేకాకుండా గ్రామం విస్తరించిన ప్రాంతాలకు విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసేందుకు కూడా నిధులు కేటాయించారు. ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న ఈ సమస్యను పరిష్కరించినందుకు గ్రామస్తులు ఎమ్మెల్యే శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విద్యుత్ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేశంపేట మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి, గూడ వీరేశం, శ్రీధర్ రెడ్డి, ఎమ్మార్వో, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి అహర్నిశలు కృషి

విశాలాంధ్ర - ఆమనగల్లు : ప్రతి పేద కుటుంబం గుర్తింపు, ఆకలి తీర్చే ఆయుధం రేషన్ కార్డు అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని రైతు వేదికలో మండలంలో పేదలకు మంజూరైన నూతన రేషన్ కార్డుల పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేళ్లుగా ప్రజలు రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న అర్హులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే ఇచ్చినట్లు తెలిపారు. ఇళ్లు, పింఛన్లు, ఆరోగ్యశ్రీ, వ్యక్తిగత బీమా సౌకర్యం, ఇతర అవసరాలకు కూడా రేషన్ కార్డు ప్రధానమని తెలిపారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్దే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డ్ మంజూరు చేయడంతో పాటు ఉచితంగా సన్నబియ్యం అందిస్తున్నామని చెప్పారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలు వంటి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పొల్యూషన్ బోర్డ్ మెంబర్ ఠాకూర్ బాలాజీ సింగ్, పీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, మాజీ జడ్పీటీసీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, సీనియర్ నాయకులు ఖలీల్, రమణ రెడ్డి గుర్రం కేశవులు, కాలే మల్లయ్య, జిల్లా నాయకులు అబ్దుల్ ఖాదర్, నిట్ట నారాయణ, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, అబ్దుల్ అలీమ్, ఖాదర్ ఖాద్రి, వెంకట్ రెడ్డి,ఐఎన్టీయూసీ ఎంగలి ప్రసాద్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్,నాజర్, విజేందర్ పాల్గొన్నారు.

అక్కను హత్య చేసిన తమ్ముడు..

విశాలాంధ్ర - కొత్తూరు: ప్రియుడుతో మాట్లాడుతుండగా ఆవేశంతో అక్కను గొంతు నులిమి సొంత తమ్ముడు హత్య చేశాడు. ఈ సంఘటన కొత్తూరు మండలం, పెంజర్ల గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెంజర్ల గ్రామానికి చెందిన ఈర్లపల్లి దినేష్, అదే గ్రామానికి చెందిన ఓ అమ్మాయి మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈ విషయం అమ్మాయి తన తల్లిదండ్రులకు చెప్పగా గ్రామంలో పంచాయతీ పెట్టి మరోసారి తమ అమ్మాయి జోలికి రావద్దని ఆ యువకుడ్ని అమ్మాయి తల్లిదండ్రులు హెచ్చరించారు. అప్పటినుండి వాళ్ళు కాస్త దూరంగా ఉన్నారు. ఈ క్రమం లో ఇంట్లో తల్లిదండ్రులు లేని సమయంలో ఆ అమ్మాయి మళ్ళీ దినేష్‌తో ఫోన్‌లో మాట్లాడుతుండగా గమనించిన తమ్ముడు రోహిత్ మళ్ళీ ఆ అబ్బాయితో ఎందుకు మాట్లాడుతున్నావు అని గొడవ పెట్టుకుని ఆవేశంతో అమ్మాయి గొంతు నులిమి హత్య చేసినట్లు తెలిపారు. సంఘటనపై మృతురాలి తండ్రి దేశాల రాఘవేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సిఐ నర్సింహారావు తెలిపారు.

మీ సహకారం అవసరం

- గత పొరపాట్లు సరిచేసేందుకే ఈ పర్యటన
- కొత్త ఆలోచనలు, ఆధునికత కలయికే 'అమరావతి'
- గ్రీన్ ఎనర్జీ, డేటా సెంటర్ల ఏర్పాటుకు మంచి అవకాశాలు
- సింగపూర్ మంత్రి టాన్‌సీతో సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: గతంలో జరిగిన తప్పులను సరిదిద్దడంతో పాటు ఉన్న గ్యాప్‌ను తగ్గించేందుకు ప్రస్తుతం తాను సింగపూర్ వచ్చానని, భవిష్యత్‌లో రెండు ప్రభుత్వాల మధ్య సహకారం గతంలో కొనసాగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. గ్రీన్ ఎనర్జీ రంగంలో ఆంధ్ర ప్రదేశ్ భారీ ప్రాజెక్టులను చేపట్టిందని, ఇందులో సింగపూర్ నుంచి మరింత సహకారాన్ని ఆశిస్తున్నామని చెప్పారు. సింగపూర్‌లో రెండో రోజు పర్యటనలో భాగంగా ఆ దేశ వాణిజ్య పరిశ్రమల శాఖలోని మానవ వనరులు, శాస్త్ర సాంకేతిక విభాగం మంత్రి టాన్ సీ లాంగ్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, అధికారుల బృందం భేటీ అయ్యింది. ఈ సందర్భంగా గ్రీన్ హైడ్రోజన్, ట్రాన్స్ మిషన్ కారిడార్లు, పోర్టులు తదితర రంగాల్లో సింగపూర్ కంపెనీలు భాగస్వామ్యం వహించాలని ముఖ్యమంత్రి కోరారు. డేటా సెంటర్ల ఏర్పాటుకు సంబంధించిన అంశంలోనూ సింగపూర్ భాగస్వామ్యం అవసరమన్నారు. లాజిస్టిక్ రంగంలో సింగపూర్ బలంగా ఉందని... ప్రస్తుతం ఏపీలోనూ పోర్టుల నిర్మాణం వేగంగా జరుగుతోందని సింగపూర్ మంత్రికి సీఎం వివరించారు. పోర్టులు, లాజిస్టిక్స్ రంగంలో ఉత్తమ విధానాలను అనుసరించటంలో సింగపూర్ ఏపీకి సహకరించాలని కోరారు. మానవ వనరులు, శాస్త్ర, సాంకేతిక, వాణిజ్య రంగాల్లో సింగపూర్ భాగస్వామ్యం అవసరమని సీఎం అభిప్రాయపడ్డారు. మరోవైపు గత ప్రభుత్వం హయాంలో సింగపూర్ కంపెనీలు ఎదుర్కొన్న ఇబ్బందులు, వాటిని పరిష్కరించే అంశంపై సింగపూర్ మంత్రి టాన్ సీ లాంగ్‌తో సీఎం చర్చించారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా రికార్డులు సరి చేసేందుకే సింగపూర్ వచ్చానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సింగపూర్ పై ఉన్న అభిమానంతో గతంలో హైదరాబాద్‌లో సింగపూర్ టౌన్ షిప్ నిర్మించామని చంద్రబాబు గుర్తు చేశారు. సింగపూర్‌ను చూసే గతంలో హైదరాబాద్‌లో రాత్రిపూట రోడ్లను శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. మరోవైపు ఏపీలో నవంబరులో జరిగే భాగస్వామ్య సదస్సుకు హాజరు కావాలని సింగపూర్ మంత్రి టాన్ సీ లాంగ్‌ను సీఎం ఆహ్వానించారు.

గృహ నిర్మాణం, సబ్ సీ కేబుల్ రంగాల్లో కలిసి పని చేసేందుకు సింగపూర్ ఆసక్తి

ఆంధ్ర ప్రదేశ్‌లో గృహ నిర్మాణం, సబ్ సీ కేబుల్ రంగంలో ఏపీతో కలిసి పని చేసేందుకు ఆసక్తిగా ఉన్నామని సింగపూర్ మంత్రి టాన్ సీ లాంగ్ ముఖ్యమంత్రికి తెలిపారు. గ్రీన్ ఎనర్జీ, గృహనిర్మాణం లాంటి అంశాల్లో ప్రపంచ బ్యాంకుతో కలిసి పని చేస్తున్నామని సింగపూర్ మంత్రి ఏపీ సీఎంకు వివరించారు. గతంలో హైదరాబాద్ వచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశానని సింగపూర్ మంత్రి నాటి సంగతులను గుర్తు చేసుకున్నారు.

రెండు గంటల పాటు కాలినడకన బిడదారి హౌసింగ్ ప్రాజెక్టు పరిశీలన

సింగపూర్‌లో 10 వేల కుటుంబాలు నివాసం ఉండే బిడదారి ఎస్టేట్‌ను సీఎం బృందం సందర్శించింది. ఏపీలో భారీ ఎత్తున అర్బన్ హౌసింగ్ ప్రాజెక్టులు చేపట్టాలని ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ క్రమంలో సింగపూర్ దేశంలో అర్బన్ హౌస్ ప్లానింగ్ ఏ విధంగా ఉందనే అంశాన్ని పరిశీలించేందుకు బిడదారి ఎస్టేటును సీఎం చంద్రబాబు సందర్శించారు. సిటీ ఇన్ ఎ గార్డెన్ పేరుతో ఏర్పాటయిన హౌసింగ్ ప్రాజెక్టు విశిష్టతలను ముఖ్యమంత్రికి సింగపూర్ అధికారులు వివరించారు. మొత్తం 250 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ హౌసింగ్ ప్రాజెక్టు ప్రాంతంలో సుమారు రెండు గంటల పాటు సీఎం చంద్రబాబు కాలి నడకన సందర్శించారు. ఈ క్రమంలో ఏపీకి-సింగపూర్ దేశానికి ఉన్న అనుబంధాన్ని ఆ దేశ అధికారుల వద్ద సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. అలాగే అమరావతి రాజధాని నిర్మాణానికి సంబంధించిన ఆలోచనలను వారితో పంచుకున్నారు. ఈ సమావేశానికి మంత్రులు నారా లోకేశ్, నారాయణ, టీజీ భరత్ సహా ఏపీ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

గవర్నర్‌తో జగన్ దంపతుల భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దంపతులు భేటీ అయ్యారు. విజయవాడలోని రాజ్‌భవన్‌లో సోమవారం దాదాపు గంటపాటు కొనసాగిన ఈ భేటీలో జగన్‌తో పాటు ఆయన సతీమణి వైఎస్ భారతీరెడ్డి ఉన్నారు. మద్యం కేసుల్లో వరుస వారీగా అరెస్టుల సమయంలో గవర్నర్‌ను జగన్ కలవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఇప్పటికే వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్టు చేసి రాజమహేంద్రవరం జైలుకు తరలించారు. ఈ తర్వాత మరిన్ని అరెస్టులు ఉంటాయని సిట్ అధికారులు వెల్లడించారు. దీంతో గవర్నర్‌కు రాష్ట్రంలోని తాజా పరిణామాలను జగన్ వివరించినట్లు తెలిసింది. అటు మర్యాద పూర్వకంగానే గవర్నర్‌ను జగన్ దంపతులు కలిసినట్లుగా వైసీపీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇటీవల అనారోగ్య సమస్యల నుంచి కోలుకున్న గవర్నర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నట్లు తెలిసింది. హైదరాబాద్ భారతీ సిమెంట్స్ కార్యాలయంలో సిట్ సిట్ అధికారుల సోదాల నేపథ్యంలో గవర్నర్‌తో జగన్ దంపతుల భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది.

31న నెల్లూరుకు జగన్

ఈనెల 31న నెల్లూరు జిల్లాకు జగన్ వెళ్లనున్నారు. జైలులో ఉన్న మాజీ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డితో ఆయన ములాఖత్ అవుతారు. జగన్ హెలిప్యాడ్ వద్ద 10 మందికే అనుమతి ఉంటుందని పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ పర్యటనలో భాగంగా మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటికి జగన్ వెళ్లే సమయంలో ప్రజలకు అనుమతి లేదంటూ ఆదేశాలిచ్చారు. జగన్ పర్యటనలపై అడుగడుగునా ఆంక్షలు విధిస్తున్న చంద్రబాబు ప్రభుత్వ వైఖరిపై వైసీపీ శ్రేణులు మండిపడుతున్నాయి.

గోదావరికి భారీ వరద

ఆరు లక్షల క్యూసెక్కుల నీటి విడుదల

విశాలాంధ్ర -రాజమండ్రి రూరల్: ఎగువ రాష్ట్రాల్లో కురుస్తోన్న వర్షాలతో గోదావరిలోకి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. దీంతో గోదావరి నీటిమట్టం గంట గంటకు పెరుగుతోంది. భారీగా వరద జలాలు వచ్చి చేరుతున్నాయి. చారిత్రక రాజమహేంద్రవరం వద్ద అఖండ గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. గోదావరి రేవులు వరద నీటితో జలకళను సంతరించుకున్నాయి. రాజమహేంద్రవరంలోని పుష్కరాల ఘాట్, వీఐపీ ఘాట్, విశ్వేశ్వర ఘాట్, కోటిలింగాల రేవు, మార్కండేయ స్వామి ఘాట్, ఇసుక రేంపు, కాతేరు, వెంకటనగర, ధవళేశ్వరంలోని ప్రధాన ఘాట్లలోకి వరదనీరు భారీగా వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు ఎక్కువగా వచ్చి చేరుతుండటంతో మిగులు జలాలను ఇరిగేషన్ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు సముద్రంలోకి వదులుతున్నారు. పై నుండి వస్తున్న వరదనీటిని అంచనా వేస్తూ... మిగులు జలాలను ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుండి సముద్రంలోకి వదులు తున్నారు. కాటన్ బ్యారేజ్ 175 గేట్లను స్వల్పంగా ఎత్తి మిగులు జలాలను సముద్రంలోకి వదులుతున్నారు. సోమవారం ఆరు లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదిలారు. ధవళేశ్వరం వద్ద 10.98 అడుగులు, రాజమండ్రి పుష్కర ఘాట్ వద్ద 50 అడుగులు, భద్రాచలం వద్ద 35.7 అడుగుల నీటిమట్టం నమోదైంది.డెల్టాలోని పంట పొలాలకు 9,250 క్యూసెక్కుల నీటిని వదులుతుండగా ఈస్ట్ కెనాల్ ద్వారా 2200, వెస్ట్ కెనాల్ ద్వారా ఐదు వేలు, సెంట్రల్ కెనాల్ ద్వారా రెండు వేల యాభై క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

గిన్నీస్ రికార్డుల్లో మెగా పీటీఎం

1.5 కోట్ల మంది హాజరు: మంత్రి లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రపంచంలోనే అతిపెద్ద పేరెంట్-టీచర్ మీటింగ్ (మెగా పీటీఎం) నిర్వహించి రాష్ట్రం గిన్నీస్ రికార్డును నెలకొల్పిందని, ఈ గిన్నీస్ రికార్డు ఉపాధ్యాయులకు అంకితమని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సోమవారం ఓ ప్రకటలో తెలిపారు. గిన్నీస్ బుక్ వరల్డ్ రికార్డ్స్ ప్రకారం మెగా పీటీఎంలో 5.34 మిలియన్ల (53.4 లక్షలు) తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారని వివరించారు. విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం, పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్ఎంసీ) సభ్యులు, ప్రత్యక్షంగాను, పరోక్షంగాను పాల్గొన్న వారితో సహా మొత్తం 15.2 మిలియన్ల (1.5 కోట్లు) మంది అతిపెద్ద పేరెంట్-టీచర్ మీటింగులో భాగస్వాములయ్యారని చెప్పారు. జాతీయ విద్యా విధానం ఐదో వార్షికోత్సవం ఈనెల 29కి ఒక రోజు ముందు మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ గిన్నీస్ రికార్డు సాధించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రపంచ స్థాయి ప్రమాణాలను తీసుకురావడానికి చేస్తున్న కృషికి ఈ రికార్డు గొప్ప ప్రోత్సాహంగా నిలిచిందని మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ఈ అరుదైన రికార్డు సాధనలో భాగమైన విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యాశాఖ, సమగ్రశిక్ష, విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. మెగా పీటీఎం నుంచి సేకరించిన డేటాను నిశితంగా ఆడిట్ చేసిన తర్వాత ఈ రికార్డు అధికారికంగా గిన్నీస్ రికార్డు బృందం ధృవీకరించిందని తెలిపారు. ఇందులో మూడు ఫోటోగ్రాఫ్‌లు, ఒక వీడియో, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సంఖ్య, ప్రతి పాల్గొన్న పాఠశాల నుంచి స్వతంత్ర భాగస్వామ్యం ద్వారా డేటాను ఎల్ఈఏపీ యాప్ ద్వారా సేకరించారని చెప్పారు. గిన్నీస్ వరల్డ్ రికార్డ్స్ నియమించిన 40 మందికి పైగా ఆడిటర్లు ఈ అవార్డును నిర్ధారించడానికి 61వేల పాఠశాలల నుంచి సేకరించిన డేటాను విశ్లేషించారని వివరించారు. అధికారిక గిన్నీస్ ప్రపంచ రికార్డు ధృవపత్రం ఆగస్టు రెండో వారంలో అమరావతిలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో అందజేస్తారని తెలిపారు.

ఐఐటీ విద్యార్థుల ఆత్మహత్యలపై సుప్రీం సీరియస్

నివారణకు తక్షణమే చర్యలు తీసుకోండి- విద్యాసంస్థలకు ఆదేశాలు

న్యూదిల్లీ: ఐఐటీ-ఖరగ్‌పూర్‌లో విద్యార్థుల ఆత్మహత్యలపై సర్వోన్నత న్యాయస్థానం ఆందోళన వ్యక్తంచేసింది. ఈ ఘటనలను తీవ్రంగా పరిగణించింది. ఇలాంటి వ్యవహారాల్లో ఆయా విద్యాసంస్థల స్పందనను ప్రశ్నించింది. యాజమాన్యం ప్రతికూల దృక్పథాన్ని పరిగణనలోకి తీసుకుంది. ఐఐటీ ఖరగ్‌పూర్, శారద వర్సిటీలో విద్యార్థుల ఆత్మహత్యలపై సుమోటో కేసును జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్.మాధవన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం సోమవారం విచారించింది. 'ఐఐటీ ఖరగ్‌పూర్‌లో అసలేం జరుగుతోంది? విద్యార్థులు ఎందుకు ఆత్మహత్య చేసుకుంటున్నారు? కారణాలను అన్వేషించారా? అంటూ ప్రశ్నించింది. ఐఐటీ ఖరగ్‌పూర్ తరపు న్యాయవాది స్పందిస్తూ విద్యార్థుల మానసిక రుగ్మతల పరిష్కారానికి 10 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కౌనెల్సింగ్ కేంద్రం, హెల్ప్‌లైన్ సేవలు అందుబాటులోకి ఉన్నాయని తెలిపారు. ఇవన్నీ ఉన్నా ఆత్మహత్యలు ఎందుకు జరుగుతున్నాయని ధర్మాసనం ప్రశ్నించింది. ఈ సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని ఆదేశించింది. విద్యార్థుల ఆత్మహత్యలను నివారించేందుకు సంస్థాగతంగా సమర్థ చర్యలు తీసుకోవాలని సూచించింది. సముచిత చర్యలు తీసుకోవాలని, చట్టానికి లోబడి ఉండాలని రెండు విద్యా సంస్థలను సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇదలావుంటే, ఐఐటీ దిల్లీలో జూన్ 4న విద్యార్థి ఆత్మహత్యపై ఇప్పటివరకు ఎఫ్ఐఆర్ నమోదు కాకపోవడాన్ని గుర్తించిన న్యాయస్థానం ఈ కేసును అమికస్ క్యూరీకి సిఫార్సు చేసింది. తదుపరి విచారణ నాలుగు వారాల తర్వాత జరుగుతుందని తెలిపింది.

ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ కార్యవర్గం సస్పెన్షన్

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

విశాలాంధ్ర- విజయవాడ స్పోర్ట్స్ : ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్‌లో జరుగుతున్న వివాదం కీలక మలుపు తిరిగింది. అధ్యక్షుడు గొలుగూరి వెంకటరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు జోక్యం చేసుకుంది. మే 17న రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ అధ్వర్యంలో ఎన్నికైన కొత్త కార్యవర్గాన్ని హైకోర్టు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా సోమవారం ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకటరెడ్డి మాట్లాడుతూ ... మెడల్స్ గెల్చుకున్న క్రీడాకారులకు సన్మానం చేస్తామంటూ కార్యదర్శి శ్రీకాంత్ మే 16న కొన్ని జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులను విజయవాడ రప్పించారని, మే 17న తనకు తెలియకుండా స్పోర్ట్స్ నిబంధనలకు విరుద్ధంగా కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు ప్రకటించారని చెప్పారు. దీనిపై తాను హైకోర్టును ఆశ్రయించగా ఆ ఎన్నిక సస్పెండ్ చేస్తూ ఆదేశాలిచ్చిందని చెప్పారు. రావులపాలెంలో ఏప్రిల్ 13న జరిగిన అసోసియేషన్ సమావేశంలో... శ్రీకాంత్ తీసుకుంటున్న నియంతృత్వ నిర్ణయాలపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయన్నారు. ముఖ్యంగా అక్రమ ఎంపికలు, తప్పుడు పుట్టినతేదీ సర్టిఫికెట్ల ద్వారా జట్ల ఎంపిక, జిల్లాల ప్రాతినిధ్యంలో జోక్యం వంటి అంశాలపై వివరణ కోరమన్నారు. అయినప్పటికీ శ్రీకాంత్ తన వైఖరి మార్చుకోక, తిరుగుబాటు చేస్తున్నవారిని అసోసియేషన్ నుంచి తొలగించేందుకు ప్రయత్నించారని వెంకటరెడ్డి ఆరోపించారు. కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ జూలై 15కి ముందు "యువ ఆంధ్ర ప్రో కబడ్డీ" పేరుతో ఎంపికలు నిర్వహించడం, స్కై అనే పేరుతో రాష్ట్ర జట్టును ప్రవేశపెట్టడం కూడా కోర్టు దృష్టికి తీసుకువెళ్లమన్నారు. వాస్తవాలు నిరూపించేందుకు సమర్పించిన తప్పుడు అఫిడవిట్‌పై సంతకం చేసిన 26 మంది పై చర్యలు తీసుకోవాలని కోర్టును కోరినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఈ వివాదంలో పాలుపంచుకోవడం బాధాకరమని వ్యాఖ్యానించారు. క్రీడాకారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, కబడ్డీని రాజకీయాల నుంచి దూరంగా ఉంచుతూ, నైతిక విలువలు కలిగిన కమిటీతో క్రీడను ముందుకు తీసుకెళ్లే విధంగా కృషి చేస్తామని వెంకటరెడ్డి వెల్లడించారు.

ప్రజాస్వామ్యంపై దాడి

- ఎస్ఐఆర్ ప్రక్రియ తక్షణమే నిలిపివేయాలి
- పార్లమెంటు వద్ద 'ఇండియా' నిరసన
- ఉభయ సభల్లోనూ ఇదే డిమాండ్

న్యూదిల్లీ: బీహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని ప్రతిపక్ష ఇండియా ఐక్య సంఘటన ఎంపీలు డిమాండ్ చేశారు. ఈ ప్రక్రియను ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణించారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ ఓటర్ల తొలగింపే లక్ష్యంగా ఎస్ఐఆర్ జరుగుతోందని విమర్శించారు. పార్లమెంటు సమావేశాల వేళ వరుసగా ఐదో రోజు ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. పార్లమెంటు మకరద్వారం వద్ద సోమవారం 'ఎస్ఐఆర్-ప్రజాస్వామ్యంపై దాడి' అనే భారీ బ్యానర్, ఎస్ఐఆర్ నిలిపివేయాలన్న ప్లకార్డులతో కాంగ్రెస్, డీఎంకే, ఎస్పీ, సీపీఐ, ఆర్జేడీ సహా 'ఇండియా' ఎంపీలు నిరసన తెలిపారు. కాంగ్రెస్ అగ్ర నాయకులు సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు డెరెక్ ఓబ్రెయిన్, సాగరిక, డీఎంకే నేతలు కనిమొళి, ఎ.రాజాతో పాటు వామపక్షాల నాయకులు పాల్గొన్నారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు ఇచ్చారు. అటు పార్లమెంటు ఉభయ సభలు ఎస్ఐఆర్ అంశంపై దద్దరిల్లాయి. లోక్‌సభలో వాయిదాల పర్వం కొనసాగింది. ప్రతిపక్ష ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు ఇచ్చారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత బీహార్‌లో ఎస్ఐర్‌పై చర్చ నిర్వహిస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో స్పీకర్ ఓం బిర్లా అసహనానికి గురయ్యారు. ముందు అనుకున్న ప్రకారం చర్చ జరగనివ్వాలని, షరతులు పెట్టవద్దని ప్రతిపక్ష సభ్యులకు సూచించారు. అయితే ప్రతిపక్షాల ఆందోళనతో ఆపరేషన్ సిందూర్‌పై చర్చ ఆలస్యమైంది. ఈ క్రమంలో సభ తొలుత మధ్యాహ్నం ఒంటి గంట వరకు, ఆపై 2 గంటల వరకు వాయిదా పడింది. 'ఆపరేషన్ సిందూర్‌పై చర్చ కావాలంటే ఎవరి స్థానాల్లో వారు కూర్చోండి. వెల్‌లోకి వెళ్లి ఏదేని అంశంపై చర్చ కోసం డిమాండ్ చేయొద్దు. సభ నిబంధనలకు కట్టుబడాలి' విపక్ష సభ్యులనుద్దేశించి స్పీకర్ అన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై 16 గంటలకు అంగీకరించి, ఇప్పుడు ఇలా చేయడం ఏమిటని ప్రశ్నించారు. సభ సజావుగా సాగించే చిత్తశుద్ధి లేదా అని అడిగారు. ఎస్ఐఆర్‌పై చర్చ కోసం డిమాండ్ చేస్తున్న అఖిలేశ్ యాదవ్‌నుద్దేశించి 'మీకు సామర్థ్యం లేకపోతే, నిర్ణయాలు తీసుకోగలిగిన సమర్థ ప్రతినిధిని అఖిలపక్ష సమావేశాలకు పంపండి' అని ఓం బిర్లా వ్యాఖ్యానించారు. అటు రాజ్యసభలోనూ ఎస్ఐఆర్ రద్దు కోసం ప్రతిపక్షాల డిమాండ్‌తో వాయిదాలు కొనసాగాయి. మధ్యాహ్నం భోజనం విరామం వరకు సభ రెండు సార్లు వాయిదా పడింది. జీరో అవర్‌లో డిప్యూటీ చైర్మన్ హరివంశ్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ సహా వివిధ అంశాలపై చర్చ కోసం నియమం 267 కింద 26 నోటీసులు వచ్చాయని చెప్పారు. అయితే వాటన్నింటిని తిరస్కరించారు. నామినేటెడ్ సభ్యులు సుధా మూర్తిని మాట్లాడమన్నారు. అయితే సభాపతి నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష సభ్యులు ఆందోళనకు దిగారు. 'ఓట్ కి చోరీ బంద్ కరో' (ఓట్ల చౌర్యం ఆపండి) అంటూ నినాదాలిచ్చారు. దీంతో సభ వాయిదా పడింది. ప్రశ్నోత్తరాల కోసం తిరిగి సమావేశమైనప్పుడు ప్రతిపక్ష ఎంపీల ఆందోళన కొనసాగింది. టీఎంపీ సభ్యురాలు సుష్మిత దేవ్ వెల్‌లోకి వెళ్లి వివిధ అంశాలపై మాట్లాడనివ్వాలన్నారు. ఈ గందరగోళం నడుమ సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. తిరిగి సమావేశమైనప్పుడు 'ది క్యారేజి ఆఫ్ గూడ్స్ బై సీ బిల్-2025పై చర్చను చేపట్టేందుకు సభాపతి యత్నించారు కానీ ఎస్ఐఆర్‌పై చర్చ కోసం ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. కొందరు ఎంపీలు వెల్‌లోకి వెళ్లి నినాదాలిచ్చారు. దీంతో సభను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు హరివంశ్ తెలిపారు. కాగా, ఉదయం సభ మొదలైనప్పుడు కొత్త సభ్యులు ఐఎస్ ఇంబాదుర్రై, ఎం.ధన్‌పాల్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఇకపై డిప్యూటీ చైర్మన్ మాట్లాడుతూ ఇక నోటీసులన్నీ డిజిటల్ సంసద్ పోర్టల్ ద్వారానే సమర్పించాలని సభికులకు సూచించారు.

యూపీ ఆలయంలో తొక్కిసలాట

ఇద్దరు మృతి-32 మందికి గాయాలు

రూ.5లక్షలు ప్రకటించిన సీఎం

బారాబంకీ: ఆలయంలో తొక్కిసలాట జరిగి ఇద్దరు ప్రాణాలు కోల్పోయిన ఘటన ఉత్తరప్రదేశ్, బారాబంకీలోని ఔసనేశ్వర మహదేవ గుడిలో సోమవారం జరిగింది. శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని భక్తులు పోటెత్తిన క్రమంలో అర్ధరాత్రి 2-2.30 గంటలప్పుడు జలాభిషేకం సందర్భంగా తొక్కిసలాట జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఇద్దరు చనిపోగా, 32 మందికి గాయాలయ్యాయన్నారు. విద్యుత్ తీగలు తెగి ఆలయం ఆవరణలోని షెడ్డుపై పడటంతో భయాందోళనకు గురైన భక్తులు అటూ ఇటూ పరుగులు తీయడంతో తొక్కిసలాట జరిగిందని చెప్పారు. కోతుల వల్ల విద్యుత్ తీగలు తెగిపడ్డాయని అధికారులు వెల్లడించారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకొన్నారు. గాయపడిన వారిని హైదర్‌ఘర్, త్రివేదిగంజ్ ఆరోగ్య కేంద్రాలకు అంబులెన్సుల్లో తరలించారు. తీవ్రంగా గాయపడిన వారిని జిల్లా ఆసుపత్రిలో చేర్చారు. విద్యుత్ తీగలు తెగి పడటం వాస్తవమేనని జిల్లా మెజిస్ట్రేట్ శశాంక్ త్రిపాఠి, ఎస్పీ అర్పిత్ విజయవర్గియాతో పాటు కొందరు సీనియర్ అధికారులు ధ్రువీకరించారు. ఘటనాస్థలికి చేరుకొని ఆరా తీశారు. ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని, వారికి మెరుగైన చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. ఈ ఘటనపై దర్యాప్తుకు ఆదేశించినట్లు వెల్లడించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తొక్కిసలాటపై సీఎం యోగి ఆదిత్యనాథ్ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5లక్షల పరిహారం ప్రకటించారు.

ఫిడే ప్రపంచ మహిళల చెస్ ఛాంపియన్ దివ్య

బటుమి: ఫిడే ప్రపంచ మహిళల చెస్ ఛాంపియన్‌గా దివ్య దేశ్‌ముఖ్ (19) నిలిచారు. ఆమె తన ప్రత్యర్థి కోనేరు హంపీపై విజయం సాధించారు. జార్జియాలోని బటుమిలో సోమవారం వీరిద్దరి మధ్య జరిగిన తొలి ర్యాపిడ్ టై బ్రేకర్ డ్రాగా ముగియగా... రెండో గేమ్‌లో మొత్తం 75 ఎత్తుల్లో దివ్య విజయం సాధించారు. చివరి టైబ్రేకర్‌లో దివ్య తెల్లపావులతో బరిలోకి దిగారు. ఫైనల్స్‌లో దివ్య 1.5 పాయింట్లు... కోనేరు హంపి 0.5 సాధించారు. ఆదివారం జరిగిన మ్యాచ్‌ల్లో కోనేరు హంపీ తీవ్రమైన పోటీ ఇచ్చారు. దీంతో ఫలితం టైబ్రేకర్‌కు చేరింది. నిన్న జరిగిన మ్యాచ్‌లో దివ్య కూడా దూకుడుగానే ఆడింది. ఓ దశలో హంపీని ఒత్తిడికి గురి చేసింది. తాజా విజయంతో దివ్య గ్రాండ్ మాస్టర్ హోదా అందుకున్నారు. దీంతో భారత్‌లో ఈ హోదా అందుకొన్న 88వ వ్యక్తిగా నిలిచారు. మహిళల ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన దివ్యను మాజీ ప్రపంచ ఛాంపియన్ విశ్వనాథన్ ఆనంద్ అభినందించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. 'ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచినందుకు అభినందనలు దివ్య. ఉత్కంఠ భరితమైన పోరు. కోనేరు హంపీ కూడా మంచి ఆటతీరు... పోరాటస్ఫూర్తి కనబర్చారు. భారత చదరంగానికి సంబరాలు తెచ్చిన విజయం' అని పేర్కొన్నారు. దివ్య దేశ్‌ముఖ్... హంపీతో పోలిస్తే అనుభవం లేని క్రీడాకారిణి. నాగపూర్‌కు చెందిన 19 ఏళ్ల దివ్య... సీనియర్ విభాగంలో ఆడిన టోర్నీలు తక్కువ. ఈ టోర్నీ ఫైనల్స్ ముందు వరకు గ్రాండ్‌మాస్టర్ హోదా కూడా అందుకోలేదు. 2021లో ఇంటర్నేషనల్ మాస్టర్ హోదా పొందిన ఆమె 2023లో ఆసియా ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచింది. ఒలింపియాడ్‌లో మూడు పసిడి పతకాలు ఆమె ఖాతాలో ఉన్నాయి. గతేడాది తొలిసారి 2500 ఎలో రేటింగ్‌ను అందుకుంది. దూకుడైన ఆటతో గ్రాండ్‌మాస్టర్లను కంగుతిని పిస్తోంది. తాజాగా ప్రపంచకప్‌లో తనకన్నా మెరుగైన రేటింగ్ ఉన్న ద్రోణవల్లి హారిక, జు జినర్‌పై నెగ్గడమే ఇందుకు ఉదాహరణ. సెమీస్‌లో మాజీ ప్రపంచ ఛాంపియన్ జాగ్యిపై గెలవడం ఆమెను మరో మెట్టు ఎక్కించింది.

పీ4తో అట్టడుగు కుటుంబాల అభివృద్ధి: కుటుంబరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి దిశానిర్దేశకుడిగా నిలిచిన సీఎం చంద్రబాబు ఉగాది పర్వదినాన పీ4 ఘనంగా ప్రారంభించారని, ఆ పథకం ద్వారా సమాజంలో ఆర్థికంగా బలంగా ఉన్న వారు స్వచ్ఛందంగా అట్టడుగునున్న కుటుంబాలు, వ్యక్తులు, గ్రామాల అభివృద్ధిలో తోడ్పడే అవకాశాన్ని కల్పిస్తోందని పీ4 వైస్ చైర్మన్ కుటుంబరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాజంలో ఎవరైతే బాగా ఆర్థికంగా బలంగా ఎదిగారో, వారు అట్టడుగున ఉన్న బడుగు వర్గాలకు సహాయం అందిస్తే అసమానతలు తొలగుతాయని, సమాజంలో సమానత్వం నెలకుంటుందన్నారు. ప్రతి ఒక్కరూ వెల్తీ, హెల్దీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ పౌరులుగా జీవించగలుగుతారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఒక సర్వే నిర్వహించి ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాల్సిన కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించిందని, సహాయం చేయగల సామర్థ్యం ఉన్నవారిని మార్గదర్శకులుగా గుర్తించి నమోదు చేసిందని వివరించారు. ఇటీవల కొంతమంది పీ4 పథకంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే 50వేల మందికి పైగా మార్గదర్శకులు స్వచ్ఛందంగా నమోదు అయ్యారని, ఆరు లక్షల బంగారు కుటుంబాలు గుర్తించబడ్డాయని తెలిపారు. మార్గదర్శకులు వారిని దత్తత తీసుకుంటున్నారని, సీఎం చంద్రబాబే 250 కుటుంబాలను దత్తత తీసుకొని పీ4 పథకానికే ఆదర్శంగా నిలిచారన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.